

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ఉగాది శుభాకాంక్షలు



ఆదివారం | 18-3-2018 | పేజీలు: 20 + 20 + 64 పేజీల ఆదివారం అనుబంధం | వెల: రూ.6.00 | సంపుటి: 58 సంచిక: 332 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి రా. 6.32 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 8.10 తదుపరి రేవతి; వర్జ్యం: తె. ఉ. 7.08; దుర్ముహూర్తం: సా. 4.47-5.35; అమృతఘడియలు: మ. 3.16-4.54; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.25; సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

చి'వరి'కి వర్షార్పణం!

పలు జిల్లాల్లో అకాల వర్షం.. అన్నదాతకు కష్టం

కలెక్టర్లతో మంత్రి సోమిరెడ్డి సమీక్ష

తడిసిన ధాన్యం కొనుగోలుకు ఆదేశం 2



పండగ చేస్కో!

సండే స్పెషల్

నేడు సంప్రదాయ సంవత్సరాది

- సరికొత్త కాలానికి సూచిక
- వసంత రుతువు వేడుక
- టీవీ, స్మార్ట్‌ఫోన్‌కు సెలవు
- సకుటుంబ ఆనందాల నెలవు
- తెలుగు రుచులు చూడండి
- పిల్లలకు వివరించి చెప్పండి



ఉగాది... వస్తోందంటే ఒక ఉత్సాహం!.. కొత్త బట్టలు కుట్టించాల్సిందే! ఉదయాన్నే వేపపువ్వు, మామిడాకుల కోసం చెట్లు వెతకాల్సిందే! 'ఆకాశ వాణి'లో అచ్చ తెలుగు కవి సమ్మేళనం వినాల్సిందే! పంచాంగ శ్రవణం చెవిన పడాలి! అలా ఊరి బయటి తోటల్లోకి వ్యాహాళికి వెళ్లాలి!

...ఇదంతా చూస్తే 'ఔనా... పండగ ఇలా చేసుకోవాలా!' అని 'యూత్'కు సందేహం రావొచ్చు. ఔను... పండగ ఇలాగే చేసుకోవాలి. ఉరిమే ఉత్సాహం, ఉబికే

మిగతా 2వ పేజీలో...

ఏప్రిల్ నుంచి కొత్త పెన్షన్లు!

13

మూడు లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా

ప్రభుత్వ పనితీరు భేష్

57 నుంచి 62 శాతానికి పెరిగిన సంతృప్తి స్థాయి 16























ఉగాది ఎలా చేసుకోవాలంటే..

మనిషి ఉపాసన చేసి భగవంతుడిని పొందడానికి వీలుగా రుషులు కాలాన్ని విభాగం చేశారు. అలా విభాగం చేసిన కాలంలో ప్రధానమైన ప్రమాణం.. సంవత్సరం. 365 రోజులు.. 12 మాసాలతో కూడిన సంవత్సరంలో అందులో చైత్ర మాసంలో మొట్టమొదటి తిథి అయినటువంటి పాడ్య మినాడు కొత్త సంవత్సరం ప్రారంభం అవుతుంది. కొత్త సంవత్సరం ప్రారంభమైనప్పుడు దాన్ని అనుష్ఠించి తత్సంబంధమైన ప్రయోజనాలను పొందడానికి కావాల్సినటువంటి రీతిని రుషులే నిర్ణయం చేశారు. దాని ప్రకారం మనం సంవత్సరాది(ఉగాది)ని ప్రత్యేకమైన విధానంలో జరుపుకోవాలి. సంవత్సరాదినాడు విధించిన ప్రధానమైన కర్తవ్యం.. ప్రాతఃకాలంలో స్నానం చేయడం. సూర్యోదయాత్పూర్వమే నిద్ర లేచి మొదటి యామం ముగిసేలోపే.. ఇంట్లోని పెద్దలతో నువ్వుల నూనె మాడు మీద పెట్టించుకుని తలంటి స్నానం చేయాలి. తైలాభ్యంగన స్నానం వల్ల అలక్ష్మి పరిహారమవుతుంది. అంచు కలిగినటువంటి నూతన వస్త్రాలు ధరించాలి. తర్వాత కులదైవానికి నమస్కారం చేయాలి. ఆరోజు భగవంతుడికి నివేదన చేసే ప్రసాదం విశేషమైనది. ఆరోగ్యాన్నిచ్చే వేప చెట్టుకు పూసే పువ్వులు, బెల్లం, నీరు, చింతపండు పులుసు, ఆవు నెయ్యి, భగవంతుని పేరు (రసోవైసః) కలిగిన మామిడి చెట్టు (రసాలము)కు కాసిన మామిడికాయ ముక్కలను కలిపి ఆ పదార్థాన్ని ఈశ్వరుడికి నివేదన చేసి ప్రసాదంగా పుచ్చుకోవాలి. ఆ పదార్థాన్ని ప్రసాదంగా తీసుకున్నవారికి సంవత్సరమంతా ప్రశాంతంగా జీవించడానికి అవసరమైన వ్యవస్థను అందిస్తుంది. అలాగే శివపార్వతులను గానీ.. లక్ష్మీనారాయణులనుగానీ దర్శనం చేయాలి. గోపూజ, వృషభపూజ చేయాలి. పంచాంగ శ్రవణం, రాజదర్శనం చేయాలి. పెద్దలైన తల్లిదండ్రులకు, గురువుకు నమస్కారం చేసి ఆశీర్వచనం పొందాలి.

Paramjyothi పరంజ్యోతి



–చాగంటి కోటేశ్వరరావు శర్మ

పండగ చేసుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లాసంతోనే పండగ చేసుకోవాలి. 'నాకు ఉగాదుల్లేవు... ఉషస్సులు లేవు' అనే నిరాశాజనకమైన కవితలను పక్కనపెట్టేసి... కోకిలల కుహుకుహూలు విని పులకరించాలి.

ఉగాది పండగంటే..

'హ్యాపీ న్యూ ఇయర్' అన్ని డిసెంబరు 31 అర్ధరాత్రి కేకులు కోసి, రోడ్లెక్కి హడావుడి చేసేది ఆంగ్ల సంవత్సరాది! కుటుంబ సభ్యులతో కలిసి, పంచభక్ష్య పరమాన్నాలు భుజించి సంప్రదాయబద్ధంగా చేసుకునే తెలుగు సంవత్సరాది... ఉగాది! ఇది ఏ దేవుడికీ సంబంధించింది కాదు. కాలానికి సంబంధించిన పండుగ! రుతువులకు సంబంధించిన వేడుక! 'వస్తూ పోయే సెలవుల్లో ఇదీ ఒకటి' అనుకుని... టీవీల ముందు కూలబడి, ఎప్పట్లాగే స్మార్ట్‌ఫోన్లో తలదూర్చేస్తే మజా ఏముంటుంది! అందుకే... ఇంట్లో తాతయ్యనో, అమ్మమ్మనో పలకరించి వారి కాలంలో పండగ ఎలా చేసుకునేవారో తెలుసుకుని, అచ్చం అలాగే అనుసరిస్తే సరికొత్తగా ఉంటుంది. పండగ మజా తెలుస్తుంది. అందుకని... ఈరోజు టీవీని కట్టేయండి. ఫోన్లు పక్కన పెట్టేయండి.



వాట్సాప్‌లో వద్దు గురూ...

పండగ అంటేనే నలుగురిని కలిపేది. కలివిడిగా నిలిపేది. అందుకే, కొత్త సంవత్సరాన్ని సరికొత్తగా మొదలుపెట్టండి. వాట్సాప్‌లో అందరికీ గుడ్ మార్నింగ్ మెసేజ్‌లు పెట్టడం పక్కనపెట్టి... ముందు ఇంట్లో ఉన్న అందరికీ ఉగాది శుభాకాంక్షలు చెప్పండి. పెద్దలకు నమస్కరించి, వారి ఆశీర్వాదాలు తీసుకోండి. ఒక్కసారి వంటగది వైపు చూడండి! అమ్మ, ఆవిడ, వదిన, అమ్మమ్మ... ఇలా ఇంట్లో ఉన్న వారు పులిహోర, భక్ష్యాలు, గారెలు, పప్పు, రసం... ఇలా రకరకాల వంటలు సిద్ధం చేయడంలో నిమగ్నమై ఉంటారు. 'అమ్మా... నేనూ ఒక చేయి వేస్తాం' అంటూ ఏదో ఒక పనిచేసేందుకు ముందుకు రండి. మీతో పని చేయించే సంగతి తర్వాత... మీర్చిన ఆఫర్‌కు అమ్మ కళ్లలో కనిపించే మెరుపును గమనించండి.

సంప్రదాయాలకు స్వాగతం

కాలం కొత్త మలుపు తీసుకునే వేళ.. వసంతాన్ని స్వాగతిస్తూ జరుపుకొనే పండుగ ఉగాది! కాలం, ప్రకృతి పట్ల ప్రేమాస్పద స్పందన నింపేందుకే భారతీయ సంస్కృతిలో అనేక పండుగలు, పర్వాలు ఏర్పాటయ్యాయి. జీవితమంటే తీపి ఒక్కటేకాదు... చేదూ ఉంటుందని, దానినీ జీర్ణించుకోవాలని ఉగాది పచ్చడి చెబుతోంది. గుడికి వెళ్లడం, పంచాంగ శ్రవణం వినడం, వ్యాహ్యాళికి వెళ్లడం... నలుగురితో కలిసి నడవడాన్ని నేర్పిస్తుంది. పండగపూటా రోజూలా ఉండటం ఎందుకు! స్ట్రిక్ట్‌లీ... ఈ రోజు టీవీలో సినిమాలు, సీరియళ్ల బంద్! స్మార్ట్‌ఫోన్‌కు కటీఫ్! ఈ రోజు నిజంగా పండగ చేసుకోండి!

తెలుగు నెలలా.. అంటే?

చాలామంది విద్యార్థులకు తెలుగు మాసాలే తెలియదని... గుంటూరులో లెక్క తేలింది. చైత్రం, వైశాఖం.. అని గుర్తుచేయగా, 'ఓహో... అవా! కొన్ని తెలుసు' అని కొందరు బదులిచ్చారు. నూటికి 95 శాతం మంది తెలుగు నెలలు గురించి తెలియదన్నారు. 2 శాతం మంది మాత్రమే తెలుసు అని బదులిచ్చారు. మన సంప్రదాయం మహిళల చేతుల్లో భద్రంగా ఉందని మరోసారి రుజువైంది. 90 శాతం మంది గృహిణులు ఏమాత్రం తడుముకోకుండా తెలుగు నెలల పేర్లు చెప్పారు. మరి మీ పిల్లలకు ఎందుకు నేర్పడం లేదు? అని ప్రశ్నిస్తే..పాఠశాలల్లో నేర్పిస్తారు కదా అని బదులిచ్చారు. నిజానికి తెలుగు నెలల గురించి ఏ తరగతి సిలబస్‌లోనూ లేదన్నది తెలుగు ఉపాధ్యాయుల ఉవాచ!

కలవడమే పెద్ద పండగ



పండుగలు పట్టణాలు, నగరాల్లో కృత్రిమంగా జరుగుతాయి. నిజమైన పండుగ గ్రామాల్లోనే ఉంటుంది. నగరాల్లో పండుగలు వ్యక్తిగతమైనవి. కుటుంబాలకే అవి పరిమితం! పల్లెల్లో పండుగ సామాజికమైనది. గ్రామాల్లో అనుబంధాలు, ఆత్మీయతలు కనిపిస్తాయి. ఉద్యోగాలు, చదువుల కోసం వేర్వేరు ప్రాంతాల్లో ఉండే కుటుంబ సభ్యులంతా ఒక్కటవుతారు. అలా కలవడమే అతిపెద్ద పండుగ.

– సాయిప్రజ్ఞ వేముల, నోవా ఇంజినీరింగ్ కాలేజ్, విజయవాడ

మా సిలబస్‌లో లేదు



ప్రస్తుత విద్యావిధానంలో తెలుగు భాష, సంస్కృతి, పండుగలకు ప్రాధాన్యం లేదు. చదువుకోకపోయినా మా అమ్మమ్మ తెలుగు సంవత్సరాల పేర్లు చెప్పేది. కానీ మాకు వాటి గురించి తెలియదు. కనీసం మా తెలుగు పాఠ్యపుస్తకంలో ఉన్నా మేం నేర్చుకునే అవకాశం ఉంటుంది.

- యం. నిహారిక, విద్యార్థిని,ఒంగోలు

ఉగాది అంటే తెలుసా?

ఉగాది అంటే ఏమిటి? తెలుగు సంవత్సరాలు ఎన్ని? కనీసం తెలుగు మాసాల పేర్లయినా యువతకు తెలుసా? ఉగాదికి ఏం చేస్తారో తెలుసా? అని తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో యువతను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించింది. ఉగాది ప్రత్యేకత గురించి తిరుపతిలో పదిమంది యువతీ యువకులను ప్రశ్నించగా.. పచ్చడి పండగ, పెద్దల పండగ, తెలుగు న్యూ ఇయర్ అని బదులిచ్చారు. తెలుగు సంవత్సరాల గురించి చెప్పలేమన్నారు. ఒక్కరు మాత్రం... 60 తెలుగు సంవత్సరాలను 61 చేసేశారు. ఉగాది రోజు ఏం చేయాలని అడగ్గా.. పూర్వీకులకు బట్టలు పెట్టాలనీ, గుడికి వెళ్లి టెంకాయ కొట్టాలని, హోలీలా రంగులు చల్లుకోవాలని, వడపప్పు తినాలనీ, మామిడికాయ పచ్చడి చేసుకోవాలనీ సమాధానం చెప్పారు. ఫర్లేదు... వీరంతా పండగను అనుసరిస్తున్నట్లే!

పల్లెలోనే పండగ

పండగ ఏదైనా పిండివంటలు తినడం, సాయంత్రం సినిమాకు వెళ్లడం ఇదే పట్టణాల్లో కనిపిస్తుంది. లేదా టీవీలకు అతుక్కుపోతారు. పట్టణాల్లో పండగ వాతావరణం కనిపించకపోయినా గ్రామాల్లో ఇంకా ఉంది. మా గ్రామంలో పన్నెరం బండ్లు కడతారు. పెద్దలు టెంకాయ పందెం ఆడటం, పిల్లలంతా వారిని అనుసరిస్తారు.

- సునీల్, ఇంజినీరింగ్ విద్యార్థి, ఎస్కేయూ, అనంతపురం

మొదటి మెట్టును మరచిపోకూడదు



ప్రతి ఒక్క విద్యార్థి మన పురాణాలు, ఆచారాలు, సంప్రదాయాలు గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. సంస్కృత, ఆచార వ్యవహారాల్లో తమిళుల్లో ఉన్నంత ఆసక్తి తెలుగువారిలో కనిపించదు. మనమెంత అభివృద్ధి చెందినా..ఎక్కిన మొదటి మెట్టును మరచిపోకూడదు.

- హరిప్రియ, పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల, విజయవాడ

పంచాంగ శ్రవణం శుభకరం

చాలామంది జనవరి 1కి ఇస్తున్న ప్రాధాన్యత ఉగాదికి ఇవ్వడం లేదు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు ఆరోగ్యానికి మంచివి. ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేస్తే శుభాలు కల్గుతాయి.

- ఆర్ లత, తెలుగు ఉపాధ్యాయురాలు, పలాస, శ్రీకాకుళం జిల్లా

కొద్దిగా తెలుసు

ఉగాది గురించి కొద్దిగా తెలుసు. తెలుగు సంవత్సరం చైత్ర మాసంతో మొదలవుతుంది. తెలుగు సంవత్సరాలు అరవై. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారని కూడాతెలుసు. ఇప్పుడైతే... గుడికి వెళ్లి, ఉగాదిపచ్చడి తిని, టీవీ చూడటంతప్ప పెద్దగా ఏమీ చేయడంలేదు.

- రాగిణి, విద్యార్థిని, హైదరాబాద్

పది మందీ కలిస్తేనే సంబరం!

మన పండుగలు, వాటి గొప్పతనం గురించి పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పాలి. షడ్రుచుల పచ్చడి ఎందుకు తినాలో ఎవరూ చెప్పకపోతే ఈ తరం పిల్లలకు అది వింతగానే అనిపిస్తుంది. ఆంగ్ల విద్యా బోధనతో అదంతా పోయింది. ఈ తరం ఆంగ్లం నేర్చుకుని ఊరుకోవడం లేదు. పాశ్చాత్యుల్లా జీవిస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా మన సమాజంలో చిత్రమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మనిషి ఒంటరిగా మారుతున్నాడు. చిన్న కుటుంబాలతో ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. పండుగలు వస్తున్నా అవి ఆనందాన్ని పంచలేకపోతున్నాయి. పదిమందీ కలిస్తేనే సంతోషం.. సంబరం!



- గరికపాటి నరసింహారావు, సహస్రావధాని

ఇంగ్లీషు మీడియం కాబట్టి తెలీదట!

శ్రీకాకుళం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, కర్నూలు, కడప, అనంతపురాల్లో 14 నుంచి 24 ఏళ్లలోపు విద్యార్థులను 'ఉగాది' గురించి ప్రశ్నించగా... ఉగాది అంటే తెలుగు న్యూ ఇయర్ అని ఎక్కుమంది సమాధానం చెప్పారు. సంవత్సరాల పేర్లు తెలియవన్నారు. 'తెలుగు సిలబస్‌లో ఇటువంటివి లేవు' అని బదులిచ్చారు. తెలుగు సంవత్సరాలకు, తెలుగు మాసాలకు మధ్య తేడా కూడా 90శాతం మంది యువతీ యువకులకు తెలీదు. 'ఇంగ్లీషు మీడియంలో చదువుతున్నాం. అందుకే ఇవన్నీ తెలియడం లేదు' అని చెప్పేశారు.

అపార్ట్‌మెంట్లలో మేలుమేలు

వినాయక చవితి, హోలీల్లాగానే... నగరాల్లోని అపార్ట్‌మెంట్లలో ఉగాదిని కూడా ఉమ్మడిగా జరుపుకొనే సంప్రదాయం మొదలైంది. "ఉగాది పండుగను మాఅపార్ట్‌మెంట్‌లో అంతా కలిసి జరుపుకొంటాం. సంప్రదాయ వస్త్రధారణతో పూజలు చేస్తాం" అని విశాఖపట్నం విద్యార్థినులు సాహిశ్రీ, దీపిక తెలిపారు.



ఇక సోలార్ చెట్లు!

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టిసారించింది. ఈ మేరకు నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సూర్య పవర్ ట్రీ కంపెనీ ప్రయోగాత్మకంగా వెలగపూడి సచివాలయం ఆవరణలో 2 సోలార్ చెట్లను ((సోలార్ ట్రీ) ఏర్పాటు చేసింది. ఒక్కో చెట్టు నుంచి ఏడాదికి 18 వేల యూనిట్లు, రెండు చెట్లకు కలిపి 36 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, సందర్శకులు వస్తుంటారని, దీనిపై వారికి అవగాహన కల్పించే నిమిత్తం సచివాలయం బయట ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో సోలార్ చెట్టు ఎత్తు 20 అడుగులు. అతి తక్కువ స్థలంలో అంటే.. 12 మీటర్ల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయడం ప్రత్యేకత.

కొండపై విద్యుత్ బస్సు



పవిత్ర తిరుమలలో శబ్ద, వాయు కాలుష్య నివారణకు ప్రవేశపెట్టిన విద్యుత్ బస్సు తిరుపతి నుంచి శనివారం తిరుమలకు చేరుకుంది. హైదరాబాద్‌కు చెందిన గోల్డ్‌స్టోన్ సంస్థ రూపొందించిన ఈ బస్సును ఆర్టీసీ తిరుమల ఘాట్‌రోడ్డుపై ప్రయోగాత్మకంగా పరిశీలించింది. మొదటి, రెండవ ఘాట్ రోడ్లపై నడిపి ప్రయాణంలో లోటుపాట్లను గుర్తించారు. ఘాట్ ప్రారంభమయ్యే అలిపిరి నుంచి 29 నిమిషాల్లో బస్సు సాఫీగా తిరుమలకు చేరుకుంది. తిరుగు ప్రయాణంలో తిరుమల జీఎన్‌సీ టోల్‌గేట్ నుంచి 39 నిమిషాల్లో అలిపిరికి చేరుకోవడం విశేషం. దిగువ తిరుపతికి చేరుకునేటప్పుడు 53 మలుపులు ఉండటం వల్ల ప్రయాణం ఆలస్యమవుతోంది. - తిరుమల

చి'వరి'కి వర్షార్పణం

- పలు జిల్లాల్లో అకాల వర్షంతో అన్నదాతకు కష్టం
- దెబ్బతిన్న వరిపైరు
- కళ్లాల్లో తడిసిన ధాన్యం.. కోట్లలో నష్టం
- కలెక్టర్లతో మంత్రి సోమిరెడ్డి సమీక్ష
- తడిసిన ధాన్యం కొనుగోలుకు ఆదేశం

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరి రైతులను నిండా ముంచేసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి పైరుతోపాటు, కళ్లాల్లో నిల్వచేసిన ధాన్యం, ఇతర పంట దినుసులు తడిసిపోవడంతో అన్నదాతలకు కోట్లలో నష్టం వాటిల్లింది. ప్రధానంగా నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 4170 హెక్టార్లలో కోతకు వచ్చిన వరిపైరు దెబ్బతింది. 2800 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయింది. మొత్తం రూ.45.70 కోట్ల పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. గుంటూరు జిల్లా మాచర్ల మండలంలో 14.6 మి.మీ.లు, వెల్దుర్తి మండలంలో 8.4మి.మీలు వర్షపాతం నమోదైంది. రెంటచింతల మండలంలో 2 మి.మీ.ల వర్షం పడింది. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి మండలంలో 875 ఎకరాలు, ఏర్పేడు 375 ఎకరాలు, తొట్టంబేడు 525 ఎకరాలు, కేవీబీపురం 210 ఎకరాలు, బీఎన్‌కండ్రిగ మండలంలో సుమారు 50 ఎకరాలు వెరసి మొత్తం 2500 ఎకరాల్లో వరిపైరు నేలకొరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. కళ్లాల్లో ధాన్యం తడవడం వల్ల రంగు మారి ధర తగ్గిపోయే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళ వర్షం కురవడంతో వరి, మిర్చి రైతులు తెల్లవార్లూ పరదాలు కప్పుతూ కల్లాల వద్దే జాగారం చేశారు. తడిసిన ఉత్పత్తులను ఆరబెట్టి తరలించడానికి నానా తంటాలు పడ్డారు. అకాల వర్ష సమాచారం తెలుసుకున్న వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఉదయం విశాఖపట్నం నుంచి నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, జేసీలతో టెలిఫోన్‌లో మాట్లాడారు. పొలాలను పరిశీలించి పంట నష్టం అంచనాలు వేయాలని ఆదేశించారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, రెండు రోజుల్లో ఈ ధాన్యం మొత్తం మిల్లులకు చేరాలని ఆదేశించారు.





వెల్దుర్తిలో బురదమయంగా మారిన మిర్చి కల్లాలు (ఇన్‌సెట్‌లో) మనుబోలు తడిసిన ధాన్యం

రాజంపేట డివిజన్‌లో రూ.40 కోట్లు నష్టం!

రాజంపేట : కడప జిల్లా రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అకాల భారీ వర్షం వల్ల సుమారు రూ.40 కోట్ల విలువైన పంట నష్టం వాటిల్లింది. రాజంపేట మండలంలో పక్వానికి వచ్చిన 500 ఎకరాలకు పైబడి అరటితోటలు నేలకొరిగాయి. ఆకేపాడు చుట్టుపక్కల గ్రామాల్లో 200ఎకరాల్లో అరటిపంట దెబ్బతింది. పిందె దశలో ఉన్న మామిడి కాయలు రాలిపోయాయి. ఉద్యానవన, రెవెన్యూ శాఖాధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో నిమగ్నమై ఉన్నట్లు రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

కుంగిన రైల్వేట్రాక్

ఎర్రగుంట్ల, మార్చి17: కడప జిల్లాలోని ఎర్రగుంట్ల- ఎర్రగుడిపాడు మధ్యలో కాపలా గేటు పక్కనే నిర్మిస్తున్న అండర్ గ్రౌండు బ్రిడ్జి వద్ద మట్టికట్ట భారీ వర్షానికి కొట్టుకుపోయింది. రైల్వే ట్రాక్ కింద పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. కాపలాగా ఉన్న వాచ్‌మెన్, పనిచేసే కార్మికులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బందిని పురమాయించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రాత్రి ఒకటి రెండు గూడ్సు రైళ్లు ఆలస్యంగా వెళ్లినట్లు అధికారులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం డీఆర్‌ఎం విజయ్‌ప్రతాప్‌సింగ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎర్రగుంట్ల - నంద్యాల రైల్వే లైన్‌లోనూ ఇలాంటి సమస్యే రాగా, మరమ్మతు పనులు చేస్తున్నట్లు అధికారుల సమాచారం.

లోకం తీరు




హామీలిచ్చి మాట మారిస్తే ఎలా? కాబట్టి ముందు సంభావనిస్తేనే పంచాంగ శ్రవణం..

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కడప	38.0	22.0
ప్రకాశం	33.0	23.8
హైదరాబాద్	32.6	20.0
విశాఖపట్నం	31.4	22.6
విజయవాడ	30.9	25.5

రాష్ట్రంలో తగ్గిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 2 రోజుల నుంచి వాతావరణంచల్లబడింది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం కూడా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 7.4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. చాలా చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడ్డాయి. అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లా వంగూరులో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో 4 రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణమే కొనసాగుతుందని వాతావరణశాఖ వెల్లడించింది. కాగా, వాతావరణం చల్లబడటం.. వ్యవసాయ వినియోగం తగ్గిపోవడంతో విద్యుత్తు డిమాండ్ 10,050 మెగావాట్ల నుంచి 8,342 మెగావాట్లకు పడిపోయింది.



మాకు అర్థమైంది.. ఇలా కూడా జరుగుతుందని

'యూపీలో రెండు పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుంటాం. అయిందేదో అయిపోయింది.. ముమ్ముందు అలా జరగదు. ఈ ఎన్నికలతో మాకు అర్థమైంది.. ఇలా కూడా జరుగుతుందని'

- రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి

29న జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 08 ప్రయోగం

- వచ్చే నెలలో పీఎస్‌ఎల్వీ-సీ41

తిరుమల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్) నుంచి ఈ నెల 29న జీఎస్ఎల్వీ-ఎఫ్08 రాకెట్ ప్రయోగం ఉంటుందని ఇస్రో చైర్మన్ కె.శివన్ చెప్పారు. దీనిద్వారా జీ శాట్-6 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపుతున్నట్లు తెలిపారు. అలాగే ఏప్రిల్ 12న పీఎస్ఎల్వీ-సీ41 రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు వివరించారు. ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం ప్రారంభ సమయంలో తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇస్రోలో వినియోగించే పరికరాలు, యంత్రాలన్నీ ప్రైవేటు సంస్థల్లోనే ఉత్పత్తవుతున్నాయని, ఆ సంస్థలతో పాటు ఇస్రోలో కూడా ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. పాఠశాలల్లో పిల్లలకు సైన్స్ బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందుకు ప్రధాని మోదీ కూడా కృషి చేస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారుల సౌకర్యార్థం ప్రత్యేక యాప్‌ను రూపొందించి కేంద్రప్రభుత్వం ద్వారా వారికి అప్పగిస్తామని, అలాగే పిడుగు పడే సూచనలను ముందుగా సమాచారం అందించే వ్యవస్థను అన్ని రాష్ట్రాలు ఉపయోగించుకోవాలని కోరారు. చంద్రయాన్-2 ప్రయోగానికి పటిష్ఠ ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఈ ఏడాదే ప్రయోగిస్తామని చెప్పారు.

శ్రీవారి ఆలయంలో నేడు ఉగాది ఆస్థానం

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం విళంబినామ సంవత్సర ఉగాది ఆస్థాన వేడుకలకు సిద్ధమైంది. శ్రీవారి ఆలయాన్ని ఫలపుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీవారి ఆలయంలో నాలుగు టన్నులు, జీఎన్‌సీ టోల్‌గేట్ నుంచి ఆలయం వరకు మరో ఆరు టన్నుల సంప్రదాయ పుష్పాలను అలంకరణకు వినియోగించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కొబ్బరిపూత, మొక్కజొన్న, ద్రాక్ష, మామిడి, దానిమ్మ పండ్లతో శోభాయమానంగా ఏర్పాట్లు చేశారు. వేకువజామున ఆలయంలో సుప్రభాతం తరువాత ఏకాంతంగా తోమాల, అర్చనసేవలు ఉంటాయి. అనంతరం ఉదయం 6-9 గంటల మధ్య విశేష కార్యక్రమాలు జరుగుతాయి. మలయప్పస్వామి, దేవేరులను విశేషంగా అలంకరించి బంగారు వాకిలిలో సర్వభూపాల వాహనంలో ఆశీనులు చేస్తారు. శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలను ధరింప చేసి పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ*
ఆంధ్రజ్యోతి
ఆదివారం 18-3-2018
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



జన చైనాకు చక్రవర్తి!

అధ్యక్షుడిగా మళ్లీ జిన్‌పింగ్ ఎన్నిక

జీవితకాలం పాటు ఆయనకే పదవి!

రాజ్యాంగ సవరణ.. వెంటనే పట్టం

విదేశాల్లోని చైనా విద్యార్థుల నిరసన

15



2

సోలార్ చెట్లు!

సచివాలయంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు

AADHAAR

థర్డ్ పార్టీ వెబ్‌సైట్లలో ఆధార్ డేటా లీక్

గూగుల్ సెర్చ్‌లో పీడీఎఫ్‌లు

బ్లాక్ చేసిన యూఐడీఏఐ

అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు సూచన

15

ఫైనల్ ఫైట్

ముక్కోణపు టీ20 సిరీస్

భారత్, బంగ్లా పోరు నేడు

ఫేవరెట్‌గా రోహిత్ సేన

సమరోత్సాహంతో షకీబల్ బృందం

19



ఘన రష్యాకు రారాజు

అధ్యక్షుడిగా మళ్లీ పుతిన్

నేడు పోలింగ్.. ఎన్నిక లాంఛనమే

స్టాలిన్ తర్వాత అత్యధిక కాలం పదవిలో

పుతిన్ రాజ్యకాంక్షపై పశ్చిమ దేశాల్లో అలజడి

ఒక్కటవుతున్న ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా, బ్రిటన్

దౌత్యవేత్తలను పరస్పరం వెలి వేసుకున్న బ్రిటన్, రష్యా

15

దేశం చూపు ఏపీ వైపు!

మహా కుట్రను ప్రజల ముందుంచాం

జగన్‌పై కేసులు కొట్టేస్తారనే ప్రచారం


మాఫీ కోసమే కేంద్ర పెద్దలకు దండాలు

టీడీపీ అవిశ్వాసానికి గంటలోనే మద్దతు

మన విశ్వసనీయతకు ఇదే నిదర్శనం

సభలో ఓటింగ్ జరిగేలా పట్టుపట్టండి

టీడీపీ ఎంపీలకు చంద్రబాబు ఆదేశం



"జగన్ అనుచరులు పీఎంవోలోనే ఉంటున్నారు. కేసుల్లో సడలింపులు జరుగుతున్నాయి. రేపోమాపో మొత్తం కేసులు కొట్టివేస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారు."

- చంద్రబాబు

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): "దేశం మొత్తం ఏపీ వైపే చూస్తోంది. ఏపీ ప్రజల గొంతు జాతీయ స్థాయిలో వినిపించాం. మనకు కావాల్సింది రాజకీయం కాదు. రాష్ట్రానికి న్యాయం జరగడమే మన లక్ష్యం" అని తెలుగుదేశం అధిపతి, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ ఎంపీలు, వ్యూహ కమిటీ సభ్యులతో శనివారం ఉదయం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్‌సభలో అవిశ్వాసంపై ఓటింగ్‌కు పట్టు బట్టాలని పార్టీ ఎంపీలకు సూచించారు. శని, ఆదివారాలు సెలవే అయినప్పటికీ ఢిల్లీలోనే ఉండి, అన్ని

మిగతా 17వ పేజీలో...

రానిస్తారా? దాటేస్తారా?

అవిశ్వాసంపై రేపేం జరుగుతుంది?

అన్ని పార్టీల్లో హై టెన్షన్

50మందికిపైగా మద్దతిస్తే చేపట్టాల్సిందే

పది రోజుల్లోపు ఎప్పుడైనా చర్చ

'గందరగోళం' ఉంటే తోసిపుచ్చవచ్చు

ఒంటరిగానే పోరు!

ఇతర పార్టీలతో పొత్తులుండవు: పవన్



16



అమిత్ షాతో ఏపీ బీజేపీ నేతల భేటీ. చిత్రంలో రామ్‌మాధవ్

విజృంభించండి

ఏపీలో యుద్ధం మొదలైంది

17

మూడు నెలల్లో సీన్ రివర్స్

బాబుపై వ్యతిరేకత పెరగడం ఖాయం

అప్పుడు నిధులు, ప్రాజెక్టులు ప్రకటిస్తాం

మన వ్యూహం మొదలైపోయింది

ఏపీ మనకు మరో 'త్రిపుర' అవుతుంది

హోదా ప్రయోజనాలన్నీ మనమిస్తున్నాం

ఆ వివరాలను ప్రజలకు వివరించండి

బీజేపీ నేతలకు 'చీఫ్' అమిత్ షా ఆదేశం

హోదాకు మించి ఇచ్చేందుకు సిద్ధం

టీడీపీయే మమ్మల్ని వదులుకుంది

మా ప్రశ్నలకూ బదులివ్వాలి: రామ్‌మాధవ్

అహం బ్రహ్మాస్మి!

ప్రధాని మోదీ తీరుపై ఆర్కే మార్క్ విశ్లేషణ

కొత్త పలుకు -4లో..



ప్లీనరీలో ప్రసంగించిన సోనియాను ఆప్యాయంగా హత్తుకున్న రాహుల్‌గాంధీ

హోదా ఇవ్వాల్సిందే

మిగిలిన హామీలూ అమలు చేయాలి

వాటిని విస్మరించడం ఆందోళనకరం

కాంగ్రెస్ తీర్మానంలో ప్రత్యేక ప్రస్తావన



20

మోదీ నియంత

అధికార జులుం నుంచి దేశానికి విముక్తి

అహంకారం, పక్షపాతం, ప్రతీకార రాజకీయాల నుంచి కూడా..

ఇదే మన లక్ష్యం.. ఇందుకే పోరాటం.. ఇది నియంతృత్వ ప్రభుత్వం

కాంగ్రెస్‌ను నాశనం చేయడానికి నాలుగేళ్లుగా కుటిల యత్నాలు

అయినా, భయపడం, దాక్కోం.. అధికార మదానికి తలవంచం

కాంగ్రెస్ ప్లీనరీలో ప్రధానిపై విరుచుకుపడిన సోనియాగాంధీ

20

దేశవ్యాప్తంగా రైతులకు రుణ మాఫీ

కౌలు రైతులకు వడ్డీలేని రుణాలు

రైతు కూలీలకు వృద్ధాప్య పింఛన్

పేదరిక నిర్మూలనకు నిధి

సంపన్నులపై 5% సెస్సు

ప్లీనరీలో కీలక తీర్మానాలు



బీజేపీ భేటీలో వైసీపీ వ్యూహకర్త!

ఇద్దరికీ పీకే సలహాలేనా?



17

దక్షిణాది రాష్ట్రాలతో 'ద్రవిడనాడు'

డిమాండ్ వస్తే మద్దతిస్తాం: డీఎంకే

దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసివస్తాయా?



20





■ ఆర్కే RK

కొత్తపలుకు

అహం బ్రహ్మోస్మి!

రాజకీయాలలో ఆత్మహత్యలే గానీ హత్యలు ఉండవని అంటారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యవహార శైలి ప్రస్తుతం ఈ కోవలోకే వస్తుంది. అతి విశ్వాసం, అహంభావం పూర్తిగా కమ్మేయడంతో మిత్రపక్షాల నాయకులే కాదు– సొంత పార్టీ నాయకులు కూడా ఇప్పుడు ఆయన కళ్లకు ఆనడం లేదు. ఫలితంగా తన పతనాన్ని తానే కోరుకుంటున్నారు. అహంకారాన్ని అపజయాలు వెన్నాడుతుంటాయి. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాలలో బీజేపీ ఓటమే ఇందుకు నిదర్శనం. ఎనిమిది పర్యాయాలు అప్రతిహతంగా గెలుస్తూ వచ్చిన గోరఖ్‌పూర్‌లో ఓటమి దేనికి సంకేతమో కమలనాథులకు తెలియదా? ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పార్లమెంట్ మెట్ల వద్ద మోకరిల్లి, కన్నీళ్లు పెట్టుకుని, భక్తి ప్రపత్తులు ప్రదర్శించిన నరేంద్ర మోదీ కాలక్రమంలో తన నిజ స్వరూపం ప్రదర్శించడం మొదలుపెట్టారు. ఇవ్వాళ తాను ఈ స్థానంలో ఉండటానికి కారణమైన లాల్‌కృష్ణ ఆడ్వాణీని త్రిపురలో అవమానించిన తీరు చూసి దేశ ప్రజలు అవాక్కయ్యారు. ఒకప్పుడు ఆడ్వాణీ ప్రసంగిస్తుంటే ఇదే నరేంద్ర మోదీ మైక్ పట్టుకుని నిలబడ్డ దృశ్యాలను మనం చూశాం. వేదికలపై ఆసీనులైన బీజేపీ నాయకులకు వెనుక నిలిచి మంచినీళ్లు అందించిన దృశ్యాలను కూడా చూశాం. ఇవ్వాళ అదే నరేంద్ర మోదీ కాలం కలిసివచ్చి ప్రధానమంత్రి అయ్యారు. ఒకప్పటి చాయ్‌వాలా ప్రధానమంత్రి కాగలగడం ఈ దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనమని సంబరపడ్డాం. ఏ నాయకుల అండతో తాను ఈ స్థాయికి ఎదిగాడో ఆ నాయకులనే నరేంద్ర మోదీ ఇప్పుడు అవమానిస్తున్నారు. గుజరాత్ అల్లర్లు జరిగినప్పుడు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ఇదే మోదీని తొలగించాలని నాటి ప్రధాని వాజపేయి నిర్ణయించగా, ఆడ్వాణీ అడ్డుపడి ఆదుకున్నారు. అదే జరిగి ఉండకపోతే ఇవ్వాళ నరేంద్ర మోదీ ఎక్కడ ఉండేవారో ఊహించుకోవచ్చు. నాడు అండగా నిలిచిన ఆడ్వాణీని ఇవ్వాళ ఇంతలా అవమానించడానికి కారణం ఏమిటో అర్థంకాని పరిస్థితి! రాజకీయాలలో ప్రత్యర్థులు ఎదురైనప్పుడు సైతం నమస్కారం– ప్రతినమస్కారం చేయడం సంస్కారం, సంప్రదాయం. అలాంటిది భారతీయ జనతా

> **కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతీయ జనతా పార్టీని విస్తరించాలన్న కాంక్షతో ప్రాంతీయ పార్టీలను కబళించాలన్న మోదీ–షా వ్యూహం వికటించడం మొదలయ్యింది. 'బలవంతమైన సర్పము చలి చీమల చేత చిక్కి చావదె సుమతీ' అన్నట్టుగా తనకు తిరుగులేదనుకుంటున్న నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా దాదాపుగా అన్ని పార్టీలూ ఏకం అవుతున్నాయి. పార్లమెంట్‌లో తెలుగుదేశం, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడం దీనికి సంకేతం!**

పార్టీ ఇవ్వాళ ఈ స్థాయిలో ఉండటానికి కారణమైన ఆడ్వాణీని త్రిపురలో వేదికపై అవమానించడంతో నరేంద్ర మోదీ పట్ల ప్రజలు తమ అభిప్రాయం మార్చుకుంటున్నారు. అధికారం శాశ్వతం కాదు. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలంటారు. ఈ సూత్రం నరేంద్ర మోదీకి వర్తించదని భావించవచ్చు. ఆయన ఎదిగేకొద్దీ తన ఎదుగుదలకు కారకులైన వారిని తొక్కిపారేస్తున్నారు. సొంత పార్టీ నాయకులనే కాదు– మిత్రపక్షాల నాయకులను కూడా అణచివేయాలనుకోవడం మోదీలోని ప్రత్యేకత అని చెప్పవచ్చు. ప్రధానమంత్రి పదవిని చేపట్టిన తర్వాత అహాన్ని, దర్పాన్ని, గాంభీర్యతని ప్రదర్శిస్తూ వచ్చిన మోదీ.. రాజకీయ ప్రత్యర్థులపై ప్రభుత్వ ఏజెన్సీలతో దాడులు చేయిస్తూ హడలెత్తించారు. ఇప్పుడు ప్రజలను కూడా భయపెట్టి పాలించాలనుకుంటున్నారు. ఫలితంగా ఉత్తరాదిలోనే పార్టీ కంచుకోటలకు బీటలు వారుతున్నాయి. ప్రధానమంత్రి స్థానంలో ఉన్న వారు దయార్ద్ర హృదయంతో వ్యవహరించాలి. ముఖంలో గ్రేస్ ఉండాలి. నరేంద్ర మోదీని చూసేవారికి ఈ లక్షణాలు కనబడవు. 125 కోట్ల జనాభాకు వండివార్చలేక ఇబ్బందిపడుతున్నట్టుగా హావభావాలు ఉంటాయి. ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ పదేళ్లు ఉన్నారు. ఆయన పట్ల ప్రజలలో ద్వేషభావం ఏర్పడలేదు. కాకపోతే ఆయన హయాంలో అవినీతి కుంభకోణాలు జరిగాయని ప్రజలు వ్యతిరేకించారు. ఇవ్వాళ దేశంలో అవినీతి కుంభకోణాలు జరగకపోయినా ప్రధాని నరేంద్ర మోదీని మెజారిటీ ప్రజలు ద్వేషించే పరిస్థితి ఏర్పడింది. మోదీ స్వయంకృతాపరాధం కారణంగా దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఆయనకు వ్యతిరేకంగా ఒక్కతాటిపైకి వస్తున్నాయి. నమ్మకమైన మిత్రపక్షాలు కూడా దూరం అవుతున్నాయి. ఎన్‌డీఏ నుంచి తెలుగుదేశం పార్టీ బయటకు రావడానికి కమలనాథుల అహంకారమే కారణం. ఉత్తరప్రదేశ్‌లో బద్ధశత్రువులైన ఎస్పీ, బీఎస్పీలు ఏకం కావడానికి మోదీ–షా పొగరే కారణం. అందుకే గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఎన్నికల తర్వాత బీజేపీ నేతల పొగరణిగింది అని అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతీయ జనతా పార్టీని విస్తరించాలన్న కాంక్షతో ప్రాంతీయ పార్టీలను కబళించాలన్న మోదీ–షా వ్యూహం వికటించడం మొదలయ్యింది. 'బలవంతమైన సర్పము చలి చీమల చేత చిక్కి చావదె సుమతీ' అన్నట్టుగా తనకు తిరుగులేదనుకుంటున్న నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా దాదాపుగా అన్ని పార్టీలూ ఏకం అవుతున్నాయి. పార్లమెంట్‌లో తెలుగుదేశం, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడం దీనికి సంకేతం! అధికారంతో కూడిన అహంకారం తలకెక్కినవారికి వాస్తవాలు కనిపించవు.

ఈ ఐక్యత ఘనత మోదీదే!

ఆంధ్రప్రదేశ్ విషయమే తీసుకుందాం. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకున్నది కమలనాథులు కాదా? ప్రత్యేక హోదా బదులు ప్యాకేజీ ఇస్తామని చెప్పినా ప్రజలు సంతృప్తి చెందారు. ప్రత్యేక హోదా విషయంలో రాజీపడిపోయారు. అలాంటప్పుడు విజ్ఞత కలిగినవారెవ్వరైనా ప్రకటించిన ప్యాకేజీని అమలు చేయడం ద్వారా ప్రజల మన్ననలు పొందడానికి ప్రయత్నిస్తారు. ప్యాకేజీ అమలు కాకపోవడంతో పరిస్థితులు తిరగబడ్డాయి. ప్రత్యేక హోదా అంశం మళ్లీ తెర మీదకు వచ్చింది. అయిదు కోట్ల ఆంధ్రుల హక్కు 'హోదా' అంటూ నినదించడానికి కమలదళమే కారణం! ఇప్పుడు పరిస్థితులు ఎవరి చేతుల్లోనూ లేవు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకోని పార్టీలకు మనుగడ ఉండదు. తమకు భారతీయ జనతా పార్టీ అన్యాయం చేస్తున్నదని ఆంధ్రప్రదేశ్ ప్రజలు బలంగా నమ్ముతున్నారు. దీని కంతటికీ కారణం నరేంద్ర మోదీ అని భావిస్తున్నారు. దీంతో ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీ స్వరం పెంచాల్సి వచ్చింది. బీజేపీపై ప్రజలలో ఏర్పడిన వ్యతిరేకత తమకు చుట్టుకోకుండా ఉండటానికై కేంద్రంలో ఇద్దరు మంత్రులతో ముందుగా రాజీనామా చేయించారు. ఈ పరిణామం తర్వాతైనా మోదీ– అమిత్ షా ద్వయం మేలుకొని పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నించి ఉండవలసింది. ఇందాకే చెప్పుకొన్నట్టుగా తమకు తిరుగులేదని విర్రవీగుతున్న ఈ ఇరువురు నాయకులూ మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత? అన్నట్టుగా వ్యవహరించారు. అదే సమయంలో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. దీంతో ఎన్‌డీఏ నుంచి బయటకు రాక తప్పని పరిస్థితి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఏర్పడింది. తమిళనాడు తరహాలో తనను కూడా బలహీనపరచడానికి కమలదళం వ్యూహరచన చేసిందని గ్రహించిన చంద్రబాబు.. ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై సొంతంగానే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించుకోవడంతో దేశ రాజకీయాలలో కుదుపు మొదలయ్యింది. మోదీ– అమిత్ షా బాధితులుగా ఉన్న ప్రాంతీయ పార్టీల నాయకులే కాకుండా కాంగ్రెస్ పార్టీ కూడా చేయి కలిపింది. అవిశ్వాస తీర్మానం వల్ల ప్రభుత్వం ఏమీ పడిపోదు గానీ ప్రతిపక్షాలన్నీ ఏకం అవుతున్నాయి. ప్రస్తుత బలాబలాల ప్రకారం ప్రతిపక్షాలన్నీ ఏకమైనా మోదీ ప్రభుత్వం కూలిపోదు. అయితే ఎవరికి వారుగా చెల్లాచెదురుగా ఉన్న ప్రతిపక్షాలను ఏకం చేస్తున్న ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుంది. ఆయన ఉదార స్వభావం కలిగి ఉంటే ఇంత తొందరగా ప్రజలలో వ్యతిరేకత వచ్చేది కాదు. ప్రతిపక్షాలు కూడా ఏకమయ్యేవి కావు. జాతీయ స్థాయిలో చంద్రబాబునాయుడికి ఉన్న సంబంధాలు తెలిసి కూడా ఆయనను వదులుకోవడానికి సిద్ధపడ్డారంటే కమలనాథులను ఏమనుకోవాలి? త్రిపురలోనే గెలిచాం, ఇక మాకు తిరుగులేదనుకోవద్దని ఉత్తరప్రదేశ్ ప్రజలే తీర్పు ఇచ్చారు. మోదీ స్థానంలో మరెవరు ఉన్నా చంద్రబాబును వదులుకునేవారు కాదు. ఇవ్వాళ పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే వచ్చే ఎన్నికల తర్వాత బీజేపీకి మెజారిటీ తగ్గితే నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మార్చాలని డిమాండ్ చేయడం ఖాయం. ఏదిఏమైనా రానున్న ఎన్నికలలో బీజేపీ ఓడిపోతే అందుకు మోదీ–షా ద్వయమే కారణం కాబోతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబునాయుడు ఏ వైఖరి తీసుకోబోతున్నారన్నది జాతీయ రాజకీయాలలో కూడా చర్చనీయాంశం అయ్యింది. గతంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటులో చంద్రబాబు కీలక పాత్ర పోషించారు కనుక ఇప్పుడు మళ్లీ అదే ప్రయత్నం చేయకుండా ఉంటారా అన్న ఉద్దేశంతో జాతీయ మీడియాలో పలు కథనాలు ప్రసారం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడున్న పరిస్థితులలో జాతీయ రాజకీయాలకు తన సమయాన్ని కేటాయిస్తే రాష్ట్రం దెబ్బతింటుందన్న ఆలోచనతో చంద్రబాబు ఉన్నారని చెబుతున్నారు. అయితే నరేంద్ర మోదీ బాధితులుగా ఉన్న ప్రాంతీయ పార్టీల నాయకులందరూ చంద్రబాబుపై ఒత్తిడి పెంచకుండా ఉండరు. వివిధ పార్టీల నాయకులతో మాట్లాడి ఒక్కతాటిపైకి తీసుకురాగల చొరవ, ఓపిక చంద్రబాబుకు మాత్రమే ఉన్నాయి. ఈ కారణంగా ఇవ్వాళ కాకపోయినా మరి కొంతకాలం తర్వాత ఆయన జాతీయ రాజకీయాలలో ప్రధాన భూమిక పోషించడం తప్పకపోవచ్చు. అంతేకాదు– ముున్ముందు తన విషయంలో భారతీయ జనతా పార్టీ ఎటువంటి వైఖరి తీసుకుంటుంది అన్నదాన్ని బట్టి కూడా చంద్రబాబు తదుపరి అడుగులు ఉంటాయి. ప్రధాని నరేంద్రమోదీపై చంద్రబాబు రెండు రోజులుగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని ఆయన నమ్ముతున్నారు. రాష్ట్రంలో తనను బలహీనపరచడానికి ఒకవైపు నుంచి జగన్మోహన్‌రెడ్డిని, మరోవైపు నుంచి పవన్ కల్యాణ్‌ను ప్రోత్సహిస్తున్నారని ఆయన అనుమానిస్తున్నారు. ఈ కారణంగానే బీజేపీ నుంచి ఉన్న పళంగా విడిపోయారు. రాజకీయాలలో మిత్రత్వం, శత్రుత్వం శాశ్వతం కాదు. అవసరాలను బట్టి సంబంధాలు ఏర్పడుతుంటాయి. నరేంద్ర మోదీ బలహీనపడతారని కొద్ది రోజుల క్రితం వరకు ఎవరైనా ఊహించారా? ఎనిమిది పర్యాయాలుగా విజయకేతనం ఎగరవేస్తూ వచ్చిన గోరఖ్‌పూర్‌లోనే బీజేపీ ఓడిపోతుందని ఎవరైనా భావించారా? గోరఖ్‌పూర్‌లాంటి స్థానంలోనే ఓడిపోతే ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాకపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. క్షేత్రస్థాయిలో ప్రజలలో నెలకొన్న వ్యతిరేకతను గమనించకుండా ఈశాన్య రాష్ట్రాలలో గెలిచామని జబ్బలు చరుచుకుంటున్న కమలనాథులకు తాజాగా జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు షాకిచ్చాయి. ఇంత జరిగాక కూడా బీజేపీ నాయకుల వైఖరిలో మార్పు రాకపోవడమే ఆశ్చర్యంగా ఉంది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో అసాధారణ మెజారిటీతో విజయం సాధించిన తర్వాత జాతీయ మీడియా మొత్తం నరేంద్ర మోదీని ఆకాశానికెత్తేసింది. పెద్దనోట్ల రద్దు ప్రభావం లేదని తేల్చిపారేశారు. ఇప్పుడు ఏమైంది? నోట్ల రద్దు వల్ల ధనవంతులు నష్టపోతారనీ, ఆ డబ్బును ప్రధానమంత్రి మోదీ తమకు పంచుతారనీ అమాయక ప్రజలు అప్పుడు భావించారు. ఇప్పుడు పేదలకు కూడా తత్వం బోధపడింది. నాలుగేళ్ల మోదీ పాలనలో గుణాత్మక మార్పు ఏమీ రాలేదని గ్రహించారు. ఫలితమే గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఫలితాలు. ఈ ఫలితాల తర్వాతైనా చంద్రబాబుతో కమలనాథులు సయోధ్య కుదుర్చుకుంటారని రాజకీయ పరిశీలకులు భావించారు. అయినా ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్, మాయావతి కలవడాన్నే పట్టించుకోనివారు చంద్రబాబును మాత్రం ఎందుకు పట్టించుకుంటారు? ఫలితమే ప్రస్తుత ప్రతిపక్షాల ఐక్యత! రానున్న ఎన్నికలలో చాలా రాష్ట్రాలలో స్థానిక, ప్రాంతీయ పార్టీలతో కాంగ్రెస్ పార్టీ జతకట్టడం ఖాయం. నరేంద్ర మోదీని ఓడించడమే వారి ముందున్న ఏకైక లక్ష్యం కనుక ఆయా పార్టీల మధ్య విభేదాలు ఉన్నా పట్టించుకోకుండా చేతులు కలిపే పరిస్థితి వచ్చింది. దేశంలో కాంగ్రెస్ పని అయిపోయిందని చాలామంది వ్యాఖ్యానించారు. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పరాజయం సంపూర్ణమని ప్రధాని మోదీనే వ్యాఖ్యానించారు. ఇప్పుడు జరుగుతున్నదేమిటి? భారతీయ జనతాపార్టీనే పరాజయం అంచున నిలబడింది. తనను అవమానించిన నరేంద్రమోదీపై ప్రతీకారం తీర్చుకోవడానికి చంద్రబాబు ప్రయత్నించకుండా ఎందుకుంటారు? తమను కబళించడానికి దూసుకువస్తున్న బీజేపీని నిలువరించడానికి ఎవరితోనైనా చేతులు కలపకుండా మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్ వంటి వారు ఎందుకుంటారు? కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడితే తప్ప ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగని పరిస్థితి! ఈ నేపథ్యంలో చంద్రబాబు అడుగులు ముున్ముందు అదే దిశగా ఉంటాయి. రాజకీయ గురువైన లాల్‌కృష్ణ ఆడ్వాణీని నరేంద్రమోదీ అవమానించిన తీరు చూసిన వారంతా ఆయనకు పాపం తగులుతుందని శపించారు. 'అహం బ్రహ్మోస్మి' అనుకుంటాం. కానీ, కాలం చాలా గొప్పది. ఎంతటివారినైనా నేల మీదకు తెస్తుంది. దేశంలో మరే పార్టీ బతకకూడదు అనుకోవడం ప్రకృతివిరుద్ధం. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజశేఖర్‌రెడ్డి కూడా తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలు లేకుండా చేయాలనుకున్నారు. జరిగిందా? ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా ఆలోచించేవారికి అపజయమే మిగులుతుంది. నాలుగేళ్లుగా మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఇప్పుడు శత్రుపక్షంగా మారి తన ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కారణం ఏమిటో ప్రధాని మోదీ ఆత్మపరిశీలన చేసుకుంటే ఆయనకే మంచిది.

> **ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ పదేళ్లు ఉన్నారు. ఆయన పట్ల ప్రజలలో ద్వేషభావం ఏర్పడలేదు. కాకపోతే ఆయన హయాంలో అవినీతి కుంభకోణాలు జరిగాయని ప్రజలు వ్యతిరేకించారు. ఇవ్వాళ దేశంలో అవినీతి కుంభకోణాలు జరగకపోయినా ప్రధాని నరేంద్ర మోదీని మెజారిటీ ప్రజలు ద్వేషించే పరిస్థితి ఏర్పడింది. మోదీ స్వయంకృతాపరాధం కారణంగా దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఆయనకు వ్యతిరేకంగా ఒక్కతాటిపైకి వస్తున్నాయి. నమ్మకమైన మిత్రపక్షాలు కూడా దూరం అవుతున్నాయి. ఎన్‌డీఏ నుంచి తెలుగుదేశం పార్టీ బయటకు రావడానికి కమలనాథుల అహంకారమే కారణం.**



> **జాతీయ స్థాయిలో చంద్రబాబునాయుడికి ఉన్న సంబంధాలు తెలిసి కూడా ఆయనను వదులుకోవడానికి సిద్ధపడ్డారంటే కమలనాథులను ఏమనుకోవాలి? త్రిపురలోనే గెలిచాం, ఇక మాకు తిరుగులేదనుకోవద్దని ఉత్తరప్రదేశ్ ప్రజలే తీర్పు ఇచ్చారు. మోదీ స్థానంలో మరెవరు ఉన్నా చంద్రబాబును వదులుకునేవారు కాదు. ఇవ్వాళ పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే వచ్చే ఎన్నికల తర్వాత బీజేపీకి మెజారిటీ తగ్గితే నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మార్చాలని డిమాండ్ చేయడం ఖాయం.**

పవన్.. నిన్న.. నేడు.. రేపు?

ఈ విషయం అలా ఉంచితే, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రెండు రోజుల క్రితం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌పై చేసిన విమర్శలు, ఆరోపణలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగేళ్లుగా తెలుగుదేశం పార్టీ పట్ల స్నేహభావం ప్రదర్శిస్తూ వచ్చిన పవన్ కల్యాణ్ హఠాత్తుగా ఇలా మాట్లాడటం ఏమిటి? అని పలువురు ఆశ్చర్యపోయారు. అయితే పవన్ కల్యాణ్ గురించి తెలిసినవారు మాత్రం ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే ఆయన వైఖరి ఎప్పుడూ స్థిరంగా ఉండదు. చంద్రబాబు డైరెక్షన్‌లో తాను లేనని చెప్పుకోవడానికై పవన్ కల్యాణ్ అవసరానికి మించి విమర్శలు, ఆరోపణలు చేశారు. ఒక పార్టీ నాయకుడిగా కాకుండా దారినపోయే దానయ్య వలె నోటికొచ్చిన ఆరోపణలు చేశారు. దీంతో గురితప్పినట్టయింది. ఎండాకాలంలో కురిసే వడగళ్లవాన వలె నష్టమే తప్ప లాభం లేకుండా పోయింది. పవన్ కల్యాణ్ ఆరోపణలు అసందర్భపు ప్రేలాపనలుగా చాలామందికి అనిపించింది. ఎందుకంటే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు కోరుకుంటున్నది ఏమిటి? పవన్ మాట్లాడింది ఏమిటి? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. రాష్ట్రానికి న్యాయం కావాలని ప్రజలు కోరుకుంటున్న సమయంలో రాజకీయ విమర్శలు చేయడం వల్ల పవన్ కల్యాణ్‌కు ఒక

> **నిన్నమొన్నటి వరకు తనది పాతికేళ్ల రాజకీయ లక్ష్యమనీ, వచ్చే ఎన్నికల గురించి ఆలోచించడం లేదనీ పవన్ కల్యాణ్ చెబుతూ వచ్చారు. ముఖ్యమంత్రి పదవికి తనకు అనుభవం సరిపోదని కూడా అన్నారు. ఇంతలోనే స్వరం మార్చుకున్నారు. రేపు ఏమంటారో తెలియదు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలు రావలసి ఉందని తాను నియమించిన జేఎఫ్‌సీ నివేదిక ఇచ్చినా నరేంద్ర మోదీని పల్లెత్తు మాట అనకపోవడంలో ఆంతర్యం ఏమిటో తెలియదు.**

రకంగా నష్టం జరిగిందనే చెప్పాలి. లోకేశ్‌పై పవన్ చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించడం గమనార్హం. స్వతంత్రంగా వ్యవహరించాలన్న నిర్ణయం తీసుకుని ఉండి ఉంటే తెలుగుదేశం పార్టీపై దశలవారీగా దాడి చేసి ఉండవచ్చు. అలా కాకుండా వైసీపీ వాళ్లను సంతృప్తిపరచడానికి అన్నట్టుగా నోటికొచ్చిన ఆరోపణలు చేశారు. శేఖర్‌రెడ్డితో లోకేశ్‌కు ఉన్న సంబంధాల కారణంగా చంద్రబాబును కలవడానికి నరేంద్ర మోదీ ఇష్టపడటం లేదన్న ఆరోపణ చేయడం ద్వారా పవన్ కల్యాణ్ విమర్శల పాలయ్యారు. జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సిఫారసు చేయడం వల్లనే శేఖర్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడిగా నియమితులైన విషయం అందరికీతెలుసు! అంతేకాదు ఆదాయపు పన్ను శాఖ అధికారుల దాడుల తర్వాత శేఖర్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసిన విషయం పవన్ కల్యాణ్‌కు తెలియదు. చంద్రబాబు, లోకేశ్‌లపై విమర్శల తర్వాత వైసీపీ ఎంపీ ఢిల్లీలోని విలేకరులతో మాట్లాడుతూ, 'పవన్ కల్యాణ్ మా నాయకుడు జగన్‌తోనే ఉంటారు' అని చెప్పారు. ఎన్నికల తర్వాత అవసరమైతే మద్దతు ఇస్తానని కూడా హామీ ఇచ్చారని తేల్చిచెప్పారు. దీంతో వచ్చే ఎన్నికలలో జగన్‌తో కలిసి పవన్ కల్యాణ్ పోటీ చేయబోతున్నారన్న ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. దీనికితోడు రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న నరేంద్ర మోదీని పల్లెత్తు మాట అనకపోవడంతో పవన్ కల్యాణ్ విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకం అయ్యింది. ఈ వ్యవహారంలో గవర్నర్ పాత్ర కచ్చితంగా ఉందని తెలుగుదేశం నాయకులు అనుమానిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ పెద్దలు గవర్నర్ ద్వారా పవన్ కల్యాణ్‌ను ఆడిస్తున్నారన్నది తెలుగుదేశం నాయకుల అభిప్రాయంగా ఉంది. పార్టీ ఆవిర్భావ సభలో పార్టీ లక్ష్యాలు ఏమిటో, వచ్చే ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేస్తారా? లేక ఎవరితోనైనా జత కడతారా? ఒంటరిగా అయితే ఎన్ని సీట్లకు పోటీ చేస్తారు? వగైరా సందేహాలను నివృత్తి చేసి ఉంటే బాగుండేది. నిన్నమొన్నటి వరకు తనది పాతికేళ్ల రాజకీయ లక్ష్యమనీ, వచ్చే ఎన్నికల గురించి ఆలోచించడం లేదనీ పవన్ కల్యాణ్ చెబుతూ వచ్చారు. ముఖ్యమంత్రి పదవికి తనకు అనుభవం సరిపోదని కూడా అన్నారు. ఇంతలోనే స్వరం మార్చుకున్నారు. రేపు ఏమంటారో తెలియదు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలు రావలసి ఉందని తాను నియమించిన జేఎఫ్‌సీ నివేదిక ఇచ్చినా నరేంద్ర మోదీని పల్లెత్తు మాట అనకపోవడంలో ఆంతర్యం ఏమిటో తెలియదు. రాష్ట్ర ప్రజల దృష్టిలో నరేంద్ర మోదీనే ఇప్పుడు విలన్! ఆయనను టార్గెట్ చేసుకోకుండా చంద్రబాబును టార్గెట్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో పవన్ కల్యాణ్‌కే తెలియాలి. మొత్తంమీద పవన్ కల్యాణ్ తనను గురించి తాను చాలా ఎక్కువ ఊహించుకుంటున్నారన్న వ్యాఖ్యానాలు ఆవిర్భావ సభ తర్వాత వినబడ్డాయి. అదే నిజమైతే నాటి ప్రసంగంలో పవన్ కల్యాణ్ ఉదహరించిన బైబిల్ సూక్తి ఆయనకు కూడా వర్తిస్తుంది. విచిత్రమేమిటంటే వచ్చే ఎన్నికలలో జనసేన పార్టీకి తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉంటుందని భావించి అక్కడ అవకాశాలు లేనివారు జనసేనలో చేరాలనుకున్నారు. పవన్ కల్యాణ్‌తో సమావేశమైన ఎన్ఆర్ఐలలో కొంతమంది ఇలాగే భావించారు. తీరా ఇక్కడకు వచ్చాక తెలుగుదేశంపై పవన్ కల్యాణ్ నూటొక్క రాగంతో తిట్లు లంకించుకోవడంతో హతాశులయ్యారు. డటీజ్ పవన్ కల్యాణ్! ■

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

అందమైన అనుభవం


> **దక్షిణాఫ్రికాకు ఉన్న ప్రధాన ఆదాయ వనరులలో పర్యాటకం ఒకటి కనుక అది తమ దేశాన్ని సందర్శించే వారికి కొత్తగా లోచూపునివ్వడానికి తపిస్తోంది. కాస్త సాహసాన్ని జోడించి మరచిపోలేని అనుభవాలను, ఆనందానుభూతిని పోగేసుకుని వెళ్లేలా పర్యాటక ప్రియులను ఆకర్షించడానికి శతథా యత్నిస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రాంతాల్ని పర్యాటకానికి అనువుగా తీర్చిదిద్దుకుంటూ, ఆకర్షణీయమైన ప్యాకేజీలతో భారతీయులకు ఆహ్వానం పలుకుతోంది.**

ప్రపంచీకరణతో దేశాల మధ్య సహకారం, సాన్నిహిత్యంతో పాటు రాకపోకల పర్యాటకం కూడా పెరిగింది. ఎంతో కొంత మేర దేశ జాతీయ స్థూల ఆదాయం పెరగడానికి, అభివృద్ధి కొనసాగడానికి పర్యాటకం ఊతంగా మారింది. అనేక దేశాల ప్రజలు విదేశీ పర్యటనల మీద మోజు పెంచుకోవడం గత రెండు దశాబ్దాలలో ఎక్కువైంది.

ప్రపంచంలోని అనేక దేశాల్ని ప్రకృతి అందమైన చూపే చూసింది. కళ్లు చెదిరే సహజసిద్ధమైన రమణీయత, మనసును కట్టిపడేసే ప్రాంతాలు చాలా దేశాల సొంతం. అలాంటి ప్రదేశాలను చూడటం, అక్కడ విహరించడం ఎవరికైనా ఆనందదాయకమే. రోజువారీ రొటీన్ జీవితం నుంచి కొత్తదనంలోకి, వైవిధ్యంలోకి అడుగిడటమే ఇందుకు కారణం. ఆ కొత్త ప్రాంతాలు ప్రకృతి రమణీయతతో విరాజిల్లేవో, చారిత్రక సంపదతో అలరారేవో అయితే ఒక అనిర్వచనీయమైన అనుభూతి కలగడమే కాక నిలువెల్లా ఉత్తేజం, ఉల్లాసం నిండి మనసు రీచార్జ్ అవుతుంది. నేత్రానందానికి అనుభవం ఇచ్చే ఉల్లాసం తోడైతే మనసు నిండా ఒక తాదాత్మ్యం అలుముకుంటుంది. ఆ పర్యటనను అది పది కాలాల పాటు మది పొరల మీద ముద్రిస్తుంది.

అదిగో, ఆ అనుభవమే ఇప్పుడో ముఖ్యాంశంగా మారుతోంది పర్యాటక రంగంలో. కొన్ని దేశాలు దీనిపై ప్రత్యేక దృష్టిని సారించి పర్యాటకానుభవంతో కూడిన ప్యాకేజీలు ప్రకటిస్తున్నాయి. ఆదాయ మార్గాల్ని పెంచుకుంటున్నాయి. ఇందులో ముందు వరుసలో నిలిచే దేశాలలో దక్షిణాఫ్రికా ఒకటి. ఆఫ్రికా దేశాలలో చాలా వాటిలో రాజకీయ అస్థిరత కారణంగా ఆయా దేశాలకు వెళ్లే పర్యాటకుల సంఖ్య చాలా తక్కువే. కానీ దక్షిణాఫ్రికా మాత్రం దీనికి మినహాయింపు. ఆ దేశం సంప్రదాయేతర మార్గాల్ని అన్వేషించుకుంటూ అనుభవానుభూతుల మేళవింపుతో పర్యాటకులను ఆకర్షిస్తోంది.

దక్షిణాఫ్రికాకు ఉన్న ప్రధాన ఆదాయ వనరులలో ఒకటి ఈ పర్యాటకం కనుకే తమ దేశాన్ని సందర్శించే వారికి కొత్తగా లోచూపునివ్వడానికి తపిస్తోంది. కాస్త సాహసాన్ని జోడించి మరచిపోలేని అనుభవాలను, ఆనందానుభూతిని పోగేసుకుని వెళ్లేలా పర్యాటక ప్రియులను ఆకర్షించడానికి శతథా యత్నిస్తోంది. అందులో భాగంగానే మనదేశంపై ప్రత్యేకంగా చూపు నిలుపుతోంది. నైసర్గికంగా భారత, దక్షిణాఫ్రికా దాదాపు కవల దేశాలలాగే ఉంటాయి. వాతావరణ పరిస్థితుల్లోను, వన్యప్రాణి సంపదలోనూ సారూప్యం కనిపిస్తుంది. ఆ దేశంలో పర్యటిస్తోంటే చాలా వరకు మనదేశంలోనే ఏవో కొత్త ప్రాంతాల్లో తిరుగాడుతున్నట్లే ఉంటుంది. ఎటొచ్చీ దానికి ఉన్న వైవిధ్యమల్లా ప్రాక్ పశ్చిమల సమ్మేళనంగా నిలవడం, అందులోనూ పాశ్చాత్యంపాలు ఒకింత ఎక్కువ కావడం. సుదీర్ఘకాలం బ్రిటిషర్ల పాలనలో మగ్గటం వలన వాళ్లకనుగుణమైన రీతిలో అభివృద్ధికి బాటలు పరచటం వల్ల ఇళ్లు, ఆకాశాహ



ర్మ్యాల్లాంటి భవనాలు, రోడ్లు పాశ్చాత్య రీతిలో ఉంటాయి. సాంస్కృతికంగా కూడా సగంపైనే పాశ్చాత్య పోకడ మనల్ని పలకరిస్తుంటుంది.

ప్రపంచమంతా మనవైపు చూడటానికి ప్రధాన కారణం మార్కెట్ వనరులే. ఇక్కడ అపరిమితంగా ఉన్న ఆ వనరే అయస్కాంతంలా దక్షిణాఫ్రికానూ పట్టి లాగుతోంది. అందుకే అది మన చేయిని మరింతగా పట్టుకుని తనలోకి అడుగులు వేయించుకోడానికి తహతహలాడుతోంది. అయితే అది పెట్టుబడులు పెట్టడానికో, పరిశ్రమలు స్థాపించడానికో, తమ ఉత్పత్తుల్ని అమ్ముకోడానికో కాదు. మనవారి అడుగుల్ని ఆదాయంగా మలుచుకోవడం కోసమే. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రాంతాల్ని పర్యాటకానికి అనువుగా తీర్చిదిద్దుకుంటూ, సాటిలేని అనుభవాలనిచ్చే విన్యాసాల్ని వాటికి జోడించుకుంటూ ఆకర్షణీయమైన ప్యాకేజీలతో భారతీయులకు ఆహ్వానం పలుకుతోంది. మార్కెట్‌ను విస్తరించుకుంటోంది. ఇటీవలి కాలంలో ఎగువ మధ్యతరగతి వారిలోనూ కొత్త ప్రాంతాలు, దేశాలు చుట్టిరావాలనే ఆకాంక్షలు పెరగడం, ఉన్నతాదాయ వర్గాల వారిలోనూ పాశ్చాత్య దేశాలపట్ల మక్కువ పెరగటం దక్షిణాఫ్రికాకు కలసి వస్తోంది. భారతీయ మూలాలు ఉన్న జనాభా బాగానే ఉందక్కడ. వ్యాపార, వాణిజ్య రంగాల్లోనూ వాళ్లు పాతుకుపోయి ఉన్నారు. శాకాహారులైనా, మాంసాహారులైనా, ఆఖరికి జైనులైనా కోరుకునే భారతీయ రుచుల్ని పళ్లెం నిండా పరిచి అందించే రెస్టారెంట్లు ఎక్కువగానే కనిపిస్తాయి. ఎప్పుడూ చూడని రుచుల్ని కోరుకునే వారి జిహ్వను అలరించడానికి దేశదేశాల వంటకాలు కావాలనుకుంటే విస్తట్లో వాలడానికి సిద్ధంగానే ఉంటాయి. దీనికి తోడు పెద్దగా వ్యత్యాసం లేని కరెన్సీ మారకపు రేటు కూడా భారత పర్యాటకుల్ని ఇటీవల దక్షిణాఫ్రికా వైపు నడిపిస్తోంది. పర్యాటక పరంగా ఆ దేశానికి అధికంగా ఆదాయాన్ని కల్పిస్తున్న దేశాలలో భారత్ ఎనిమిదో స్థానంలో ఉంది.

2015లో 78,385 మంది భారతీయులు దక్షిణాఫ్రికాలో పర్యటించగా 2016లో ఈ సంఖ్య 95,377 మందికి చేరుకుంది. అంటే, ఏడాదిలోనే ఆ దేశాన్ని చుట్టపు చూపుగా చుట్టివచ్చిన వారి సంఖ్య 21.7 శాతం పెరిగింది. దీన్ని ఇంకా పెంచుకోవడానికి దక్షిణాఫ్రికా రకరకాలుగా యత్నిస్తూనే ఉంది. తమ దేశంలోని కొత్త పర్యాటక ప్రాంతాల గురించి అవగాహన కల్పించడానికి 2017లో మన ప్రధాన నగరాల్లో విస్తృతంగానే కార్యక్రమాలు నిర్వహించింది. సాహసానుభవాలతో సహజావాసాలలో వన్యప్రాణుల్ని అన్వేషించే సఫారీలతో పాటు ప్రపంచ స్థాయి నగరాలు, తమ అందమైన బీచ్‌లు, నైట్‌లైఫ్, రకరకాల ఆహారాలు, వైన్ ఇలా ఏ ఒక్కటీ వదలకుండా పర్యాటకులను ఊరించడం మీద ఫోకస్ పెడుతూ ఈ ఏడాది కూడా ఆయా నగరాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. విహార ప్రాంతాలు, అక్కడి విశేషాలు, ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాల గురించి ప్రత్యక్షరీతిలో ప్రచారం కల్పించుకోడానికి ప్రాంతాల వారీగా మనదేశం నుంచి మీడియా బృందాల్ని ఏటా తమ దేశానికి తీసుకెళ్తోంది. పర్యాటక ప్రాంతాల జాబితాలో దక్షిణాఫ్రికాకు ప్రాధాన్యం ఇచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఒంటరిగానో, జంటగానో కాక యావత్ కుటుంబమంతా కలసికట్టుగా పర్యటించే ధోరణి ఇటీవల హెచ్చుతోంది. మానవ పరిణామ వికాసానికి సంబంధించిన 'క్రేడిల్ ఆఫ్ హ్యూమన్ కైండ్' లాంటి ప్రాంతాలు, అందమైన పెంగ్విన్‌లు, ఉష్ట్రపక్షి, వింత అలవాట్లున్న మీర్కట్ల లాంటి అరుదైన పక్షులు, జంతువులు కనువిందు చేయటం వంటివెన్నో పిల్లా, పెద్దా, ముసలి అనే తారతమ్యం లేకుండా ఆకర్షిస్తుండటంతో కుటుంబమంతా కలిసి సెలవుల్ని గడిపే సంస్కృతి వ్యాప్తి చెందుతూ ఆ దేశంలో రెక్కలు కట్టుకుని వాలే భారతీయ కుటుంబాల సంఖ్య పెరుగుతూనే ఉంది. దక్షిణాఫ్రికా పర్యటన ప్రత్యేకించి చిన్న పిల్లలకు విహారంగా మాత్రమే కాకుండా విజ్ఞానపర్యటనగా కూడా ఉంటుందనడం నిస్సందేహం.

హిందూ మహాసముద్రం తీరంలోని ప్లెట్టనబర్గ్ బేలో ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో అతి ఎత్తైన ప్రదేశం నుంచి దుమికే బంగీ జంప్ అంటే భయం కలిగినా ఆసక్తి ఉండనిదెవరికి? కళ్లు చెదిరే అందమైన తీర పట్టణం హెర్మానస్ చేరువలో సముద్ర గర్భంలోకి షార్క్ కేజ్ డైవింగ్ ద్వారా జారి ఒళ్లు గగుర్పొడిచేంతటి భయానకమైన తెల్లటి సొరచేపల్ని చూడటం జీవితకాల అనుభవం కాదూ?! అవుడ్‌షోర్న్ లోని వైల్డ్‌లైఫ్ సాంక్చ్యురీలోని మొసళ్ల మడుగులోకి బోనులో దిగితే అడుగు దూరంలో ఉండి మనల్ని మింగేసేలా చూస్తున్న మొసళ్లు బోను చుట్టూ తిరుగుతూ ఎక్కడ, ఎలా చటుక్కున అందుకుందామా అని ప్రయత్నం చేయడం, అట్లాంటిక్ తీరంలో సముద్రంపై హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టడం, ఆ సముద్ర తీరం వెంబడి కనువిందు చేసే పట్టణాలు, బీచల మధ్య బైక్ రైడింగ్ చేయడం లాంటి విన్యాసాలు ఎవరిని మాత్రం కట్టిపడేయవు? ఇవన్నీ జీవిత కాలమంతా మననంటి ఉండిపోయే మధుర జ్ఞాపకాలు అనడంలో సందేహమేముంది. దక్షిణాఫ్రికాలో బంగీ జంప్ చేస్తున్న వారిలో భారతీయ పర్యాటకులు రెండో స్థానంలో, షార్క్‌కేజ్ డైవింగ్‌లో మూడో స్థానంలో ఉన్నారంటే ఇలాంటి సాహస విన్యాసాల పట్ల మనవాళ్లు ఎంతగా ఆకర్షితులవుతున్నారో తెలుస్తోంది. షార్క్‌కేజ్ డైవింగ్ చేయకపోతే దక్షిణాఫ్రికా పర్యటన అసంపూర్ణమే!

ప్రపంచవ్యాప్తంగా అనుభవాత్మక పర్యాటకం మీద పెరిగిన ఆసక్తికి భారతీయులు కూడా మినహాయింపు కాదనే విషయాన్ని గ్రహించినందునే దక్షిణాఫ్రికా తనను తాను కొత్తగా నిర్వచించుకుంటూ కంటి చూపుకు పని చెప్పడం నుంచి మనసు గెంతులు వేసే అనుభవాల్ని పొదువుకునేలా చేయడం దాకా పర్యాటకాన్ని రమణీయంగా మలుస్తూ సందర్శకులపై నిత్యం సంధించే అస్త్రాలకు సమ్మోహన శక్తిని అద్దుతూనే ఉంది.

దక్షిణాఫ్రికా మాదిరే భారత్ కూడా ఇటీవలి కాలంలో పర్యాటకాన్ని అభివృద్ధి పరచుకోవడానికి విదేశీయుల్ని రప్పించడంమీద ప్రత్యేక దృష్టి పెడుతోంది. దక్షిణాఫ్రికాకు ఉన్న వన్యసంపద మనకూ ఉంది. మనదేశం కూడా పర్యాటకాన్ని అనుభవంతో జోడించి, తగిన ప్యాకేజీలు రూపొందించి, విదేశాలలో ముమ్మరంగా ప్రచారం చేసి పర్యాటకులను అధిక సంఖ్యలో ఆకర్షించడానికి ప్రయత్నం చేస్తే దేశఖ్యాతి ఇనుమడిస్తుంది, ఆదాయమూ పెరుగుతుంది.

■ యార్లగడ్డ రాఘవేంద్రరావు

'తూకం' తేడా కొడుతోంది!

- జరిమానా స్వల్పం.. లెక్క చేయని వ్యాపారులు
- పెరుగుతున్న మోసాలు
- పర్యవేక్షణ లేని తూనికలు, కొలతల శాఖ

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'తూకం' తేడా కొడుతోంది. తూనికలు, కొలతల్లో మోసాలు తగ్గాయని అనుకుంటున్న తరుణంలో తాజా గణాంకాలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. రాష్ట్రంలో 2,68,726 వాణిజ్య సముదాయాలు, వ్యాపార కేంద్రాలు ఉన్నాయి. 2017-18లో ఇప్పటి వరకూ 99,081 దాడులు నిర్వహించి 17,500 అక్రమాలను గుర్తించారు. గతేడాది ఇదే సమయానికి ఈ కేసుల సంఖ్య 15,897గా ఉంది. మోసాలు 10.08 శాతం పెరిగాయి. 11.81 శాతం కాంపౌండింగ్ ఫీజు అదనంగా వసూలు కాగా, 7.91 శాతం స్టాపింగ్ ఫీజు వచ్చింది. మొత్తంగా రూ.8.56 కోట్లు జరిమానా రూపంలో వసూలైంది. మోసాల విషయంలో పశ్చిమ గోదావరి జిల్లా టాప్‌లో ఉంది. నమోదైన కేసుల్లో 44 శాతం ఈ జిల్లావే. నెల్లూరు 38, కర్నూలు 21, విజయనగరం 17.14, శ్రీకాకుళం 11.62 శాతాలతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇటీవల విజయవాడలోని కొన్ని వ్యాపార సముదాయాల్లో గుంటూరుకు చెందిన లీగల్‌మెట్రాలజీ విభాగం అధికారులు స్టాపింగ్ ఫీజు వసూలు చేయడం కలకలం రేపింది.

కంటి తుడుపు చర్యలే!

కేసులు పెరగడానికి కంటి తుడుపుచర్యలే కారణంగా కనిపిస్తున్నాయి. జరిమానాలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు లెక్కచేయడంలేదనే వాదన ఉంది. ఈ మధ్య విజయవాడలో దాడులు చేసిన అధికారులు గరిష్ఠంగా రూ.5 వేలకు మించి జరిమానా వేయలేదు. చిన్న దుకాణాలైతే రూ.వెయ్యి వసూలుచేశారు. తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో పర్యవేక్షణ చేయలేకపోతున్నామని అధికారులు అంటున్నారు. దాడుల సమయంలో ఇతర ప్రాంతాల సిబ్బందిని పిలిపిస్తున్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో పుల్లారావు కొన్ని పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేశారు. ఆపై అలాంటి దాడులు జరిగిన దాఖలాల్లేవు.

రన్‌వే లైట్లపై విమానం ల్యాండింగ్

- లైట్లు ధ్వంసం, పది విమానాల దారిమళ్లింపు

బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఓవైపు కుండపోత వర్షం.. అదే సమయంలో రన్‌వేపై ల్యాండైన విమానం రన్‌వే లైట్లపై నుంచి వెళ్లడంతో అవి ధ్వంసమయ్యాయి. ఫలితంగా విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగింది. రాత్రి 10.48 గంటలకు హైదరాబాద్ నుంచి వచ్చిన స్పైస్‌జెట్ విమానం రన్‌వే దిగిన సమయంలో.. రన్‌వే లైట్లపైకి వెళ్లడంతో నాలుగు లైట్లు ధ్వంసమయ్యాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదమూ జరగలేదని స్పైస్ జెట్ అధికార ప్రతినిధి వెల్లడించారు. కాగా.. మరమ్మతులు నిర్వహించేందుకు సుమారు గంటపాటు రన్‌వేను మూసివేశారు. ఈ సమయంలో 10 విమానాలను దారిమళ్లించారు.

ఏసీబీలో ఉగాది పురస్కారాలు

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలు అందించిన ఏసీబీ పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు హోంశాఖ ఉగాది పురస్కారాలు ప్రకటించింది. మొత్తం 16 మందికి పురస్కారాలు ప్రకటిస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి ఏఆర్ అనురాధ ఉత్తర్వులు జారీచేశారు. విజయవాడలోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న డీఎస్పీ జి.మురళీకృష్ణకు పోలీసు మహోన్నత సేవా పురస్కారం ప్రకటించారు. పోలీసు ఉత్తమ సేవా పతకాలను కర్నూలు ఏసీబీ డీఎస్పీ సి.జయరామరాజు, హెడ్ కానిస్టేబుల్ కె.లక్ష్మీనారాయణ (విజయవాడ), కానిస్టేబుల్ ఎం.తిరుపతిరావు (విజయవాడ)కు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పోలీసు సేవా పథకాలను... డీఎస్పీ ఎం.సుధాకర్ రావు (రాజమండ్రి రేంజ్), ఇన్‌స్పెక్టర్ ఎంవీ రమణ మూర్తి (విశాఖ రేంజ్), హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ యాకూబ్ జానీ (రాజమండ్రి రేంజ్), హెడ్‌కానిస్టేబుల్ ఆర్.చంద్రశేఖర్ (ఒంగోలు)తో పాటు.. మెరుగైన పనితీరు కనబరచిన పలువురు కానిస్టేబుళ్లకు పురస్కారాలు ప్రకటించారు.

అప్పన్న సేవలో న్యాయమూర్తులు



కప్పస్తంభం వద్ద జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఎస్ఏ బాబ్డే

సింహాచలం, మార్చి 17: వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. అప్పన్నను దర్శించుకున్న వారిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శివశంకర్, జస్టిస్ టి.రజనీ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్రనాథ్‌రాయ్, విశాఖ జిల్లా న్యాయమూర్తి పీవీ జ్యోతిర్మయి, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు ఉన్నారు. న్యాయమూర్తులకు సింహాచల దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని న్యాయమూర్తులు ఆలింగనం చేసుకున్నారు. అనంతరం పండితులు చతుర్వేదాశీర్వచనాలు అందజేశారు.

కొంకణాసేన్‌కి 'గొల్లపూడి శ్రీనివాస్ పురస్కారం'

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత నటుడు, రచయిత గొల్లపూడి మారుతీరావు తనయుడు దివంగత శ్రీనివాస్ పేరిట ఏటా ఉత్తమ నూతన దర్శకులకు అందించే జాతీయ పురస్కారాన్ని 2017 ఏడాదికి 'ఏ డెత్ ఇన్ ది గుంజ్' చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకురాలు కొంకణా సేన్ ఎంపికైనట్లు గొల్లపూడి శ్రీనివాస్ ఫౌండేషన్ ప్రకటించింది.

ఎన్టీఆర్‌తో 101 చిత్రాల్లో నటించా

- జీవిత సాఫల్య పురస్కారం ఆనందాన్నిచ్చింది: కైకాల



సత్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న పుల్లారావు

మంగళగిరి రూరల్, మార్చి 17: నట జీవితంలో మొత్తం 750 చిత్రాల్లో నటించానని, అందులో ఒక్క ఎన్టీఆర్‌తోనే 101 చిత్రాల్లో నటించానని సినీ నటుడు కైకాల సత్యనారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఆత్మకూరు హ్యాపీ రిసార్ట్స్‌లో శనివారం రాత్రి జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ సభలో ఆయన మంత్రి ప్రత్తిపాటి చేతుల మీదుగా జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారం అందుకోవడం ఆనందాన్నిచ్చిందని చెప్పారు.

గేట్‌లో 'వాణి' విద్యార్థుల ప్రభంజనం

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గేట్ ఫలితాల్లో వాణి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. మైనుల్ హక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించి సత్తా చాటారు. అలాగే, పినాకి మొండల్- 3వ ర్యాంకు, శరద్‌కుమార్- 4వ ర్యాంకు, రమేష్ కాముల్ల- 4వ ర్యాంకు, ఎం.బిస్వాజిత్ - 5వ ర్యాంకు, లోహిత్ కాయల్- 6వ ర్యాంకు, సోమ్యా భట్నాగర్ -6వ ర్యాంకు, కె.రిషబ్-8వ ర్యాంకు, వై.శశాంక్-9వ ర్యాంకు, చంద్రాశిస్ మజుందార్-9వ ర్యాకు, విపిన్ చంద్రగుప్త-10వ ర్యాంకు సాధించారు.

INDIAN INSTITUTE OF TECHNOLOGY TIRUPATI
Renigunta Road, Tirupati - 517 5106 (A.P.)

Ph.D. /M.S (Research) Admissions for July 2018 Semester

Applications are invited from eligible candidates for admission to Ph.D. / M.S. Programmes under Regular/External schemes of IIT Tirupati in Engineering Departments of Civil, Computer Science, Electrical and Mechanical and Ph.D. Programmes in Humanities and Social Sciences, Chemistry, Mathematics and Physics. Half-time Teaching Research Assistantships funded by MHRD are available for the eligible candidates. More information regarding submission of Application, Eligibility, Research Areas etc. is available at **msphdadmissions.iittp.ac.in** from 18-03-2018. Last date for receiving online applications is 15-04-2018.

APSET-2018
ANDHRA PRADESH STATE ELIGIBILITY TEST-2018
(On behalf of Government of Andhra Pradesh)
ANDHRA UNIVERSITY, VISAKHAPATNAM

NOTIFICATION

Andhra Pradesh State Eligibility Test (APSET-2018) for the Year 2018 will be conducted on **1st July 2018** by Andhra University, Visakhapatnam, in accordance with G.O.Ms.No.47, Higher Education (CE) Dept., dated: 02-12-2015 for recruitment and promotions of Lecturers/Assistant Professors in Universities and Degree Colleges as per the U.G.C. Regulations for the year 2018. Eligible Candidates who wish to apply for APSET-2018 may submit their application through online mode. The Registration fee of Rs.1000/- (for General Category), Rs.800/- (for B.C. Category) and Rs.500/- (for SC/ST/PH/VH Category) may be paid towards the application registration and processing fee through payment gateway (Credit card / Debit card/ Net banking). The detailed information regarding the eligibility, Syllabus, test centers, related instructions, fees for late submissions and procedures for online submission of application are available on the websites : **www.andhrauniversity.edu.in** and **www.apset.net.in**

IMPORTANT DATES FOR ONLINE SUBMISSION

Date of Commencement of Submission of online applications : 26-03-2018
Last date for Submission of online application without late fee : 02-05-2018
Visakhapatnam, Date: 18-03-2018 Sd/- Member Secretary, APSET



GITAM (DEEMED TO BE UNIVERSITY) (Estd. u/s 3 of the UGC Act, 1956)
VISAKHAPATNAM • HYDERABAD • BENGALURU

GAT - 2018
B.Tech., M.Tech., B.Arch., M.Arch., B.Pharm. & M.Pharm. Programs
ONLINE ADMISSION TEST - 48 centres across INDIA

How to Apply : (i) Apply online at www.gitam.edu (ii) Applications also available at selected branches of Union Bank of India, Indian Bank and Karur Vysya Bank.

Scholarships : ❖ 100% Fee waiver to top 10 rankers of GAT (UGT) - 2018 ❖ 50% Fee waiver to top 11-100 rankers of GAT (UGT) - 2018 ❖ Merit - cum - Means Scholarships ❖ Scholarships for all M.Tech. & M.Arch. students ❖ Teaching Assistantships to M.Tech. students ❖ Scholarships to every Aerospace Engineering student ❖ Scholarships for all B.Pharm. & M.Pharm. students

Record Placements Over 200+ corporate visits offering **2250** jobs with lucrative packages from 3.5 to 12.5 LPA which include TCS, Accenture, Deloitte, Microsoft, Amazon, ServiceNow, Futures First, FactSet, Maruti Suzuki, Fiat, etc.

Entrepreneurship Development Technology incubation and Entrepreneurship development centres provide opportunities in nurturing the young minds for innovation and startups.

Extra Edge
- Internships in multi national corporations.
- Science activity & Skill development centres to nourish creativity and unleash the inherent talent.
- Live Classes for GATE / GRE / CAT /Civil Services

IMPORTANT DATES FOR GAT - 2018
Last date to Apply: 26th March 2018
Online Slot Booking: 5th to 8th April 2018
Download of E-Hall-Tickets : 5th April 2018 onwards
Online Tests at different Centres: 11th to 26th April 2018

SCAN QR CODE www.gitam.edu

BENGALURU CAMPUS 080-28098008, 28098000 | HYDERABAD CAMPUS 08455-221266 / 200 / 204 | VISAKHAPATNAM CAMPUS 0891-2866555 / 2730177

కలెక్టర్ వారి కార్యాలయము, గుంటూరు.
ఫారం నెం.- VII

(2013వ సంవత్సరము 30వ చట్టము వలన భూ సేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టములో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి రూఢి ప్రకటన

ఆర్.సి.నెం.379/2017-జి2 తేది : 12-03-2018

ఈ క్రింది షెడ్యూలు లో అనగా గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలము వడ్లమూడి గ్రామములో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణము య.0.44 సెంట్లు ను శ్రీయుత జిల్లా కలెక్టరు, గుంటూరు వారు ప్రజా ప్రయోజనమునకు అవసరమైనదని గుర్తించినందున, నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణమును ప్రజా ప్రయోజనమునకై అనగా తెనాలి - గుంటూరు వరకు రైల్వే లైను డబ్లింగ్ కొరకు డిప్యూటి చీఫ్ ఇంజనీర్,నిర్మాణములు, సౌత్ సెంట్రల్ రైల్వే,గుంటూరు వారు ప్రతిపాదించినందున 2013వ సం॥ 30 చట్టములో 15 వ విభాగము ననుసరించి సంబంధిత వ్యక్తులు ఇచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిదప కలెక్టర్ (భూ సేకరణ), గుంటూరు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్ దాఖలా భూములను ప్రజా ప్రయోజనల నిమిత్తం భూ సేకరణ గావించుటకు నిర్ణయించినారు.సౌత్ సెంట్రల్ రైల్వే, గుంటూరు వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరము 2014-2015నకు కేటాయించినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013 వ సంవత్సరము 30 వ చట్టములోని 19(1) విభాగము ననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

కలెక్టర్ (భూ సేకరణ), గుంటూరు వారు 2013 వ సంవత్సరము 30 వ చట్టములోని 19(1) విభాగము ననుసరించి ఈ దిగువ వ్యవహరించిన షెడ్యూల్ దాఖలా భూములు మరియు వాటి విస్తీర్ణము య.0.44 సెంట్లు ను ప్రజా ప్రయోజనముకై అనగా తెనాలి - గుంటూరు వరకు రైల్వే లైను డబ్లింగ్ కొరకు అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

మండలము :: చేబ్రోలు గ్రామము: వడ్లమూడి

వ. నెం.	సర్వే నెం.	మొత్తము విస్తీర్ణము ఎ.సెంట్లు	భూ సేకరణ కొరకు విస్తీర్ణము	భూమి స్వభావము	పట్టాదారు/అనుభావదారు	సరిహద్దులు ఉత్తరము	దక్షిణము	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడములు వివరములు ఉన్నచో
1	2	3	4	5	6	(7ఎ)	(7బి)	(7సి)	(7డి)	8
1	79-1బి	1.97	0.11	సర్కారు	కర్రి లక్ష్మయ్య తండ్రి సుబ్బారావు	79-1ఎ	79-1బి2	79-2బి1	80-1,4	నిల్
2	79-2బి	0.02	0.01	పుంజ	కర్రి లక్ష్మయ్య తండ్రి సుబ్బారావు	79-1ఎ	79-2బి2	79-4బి1	79-1బి1	నిల్
3	79-4బి	1.09	0.01		పోలిశెట్టి మాతేశ్వరావు తండ్రి వీర రాఘవయ్య	79-1ఎ	79-4బి2	78-1	79-2బి1	నిల్
			0.01	సర్కారు	అబూరి ఏడుకొండలు తండ్రి వెంకటేశ్వర్లు					నిల్
			0.02	పుంజ	కర్రి లక్ష్మయ్య తండ్రి సుబ్బారావు					నిల్
4	80-2	0.20	0.05		గాజుల వేణుగోపాల్ తండ్రి ఈశ్వరయ్య	81	80-2ఎ	80-3బి	80-6బి	నిల్
5	80-3	0.59	0.04		గాజుల వేణుగోపాల్ తండ్రి ఈశ్వరయ్య	81	80-3ఎ	80-4బి	80-2బి	నిల్
6	80-4	0.98	0.05		గాజుల వేణుగోపాల్ తండ్రి ఈశ్వరయ్య	81	80-4ఎ	80-1	80-3బి	నిల్
7	80-5	0.32	0.03		తుక్కారు చిన్న సుబ్బారావు తండ్రి రామయ్య	82	80-5ఎ	80-6బి	86-2	నిల్
8	80-6	1.66	0.05		శ్రీపతి పండితా రాధ్యుల పద్మ భర్త కనక దుర్గా రావు	82	80-6ఎ	80-2బి	80-5బి	నిల్
			0.06		వణుకూరి వెంకాయమ్మ భర్త సుబ్బా రెడ్డి					
మొత్తం		6.83	0.44							

ఈ భూముల ప్లాన్ కలెక్టర్ (భూసేకరణ) గుంటూరు వారి కార్యాలయములో వుంచబడినది. దీనిని ఈ కార్యాలయపు పని వేళ్లలో ఏ సమయములోనైన తనిఖీ చేసుకొనవచ్చును ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన వారు ఏవరునూ లేరు.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూములోగాని లేదా ఒక ప్రత్యేక భాగములోగాని ఉంటే అటువంటి భాగములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూ భాగమును మాత్రమే త్రవ్వటకుగాను తొలగించుటకుగాను చేయవలెను.

సం/- కోన శశిధర్, జిల్లా కలెక్టరు మరియు మేజిస్ట్రేట్, గుంటూరు

निविदा सूचना Tender Notice

भारत के राष्ट्रपति की ओर से ... महाप्रबंधक, भारी पानी संयंत्र (मणुगुरु), परमाणु ऊर्जा विभाग, भारत सरकार, अश्वापुरम, भद्राद्री-कोत्तागुडेम जिला - 507116 ...

For and on behalf of President of India, General Manager, Heavy Water Plant (Manuguru), Department of Atomic Energy, Government of India, Aswapuram, Bhadradri-Kothagudem Dist-507 116 (T.S) invites sealed item rate tender, from the approved and eligible contractors of CPWD and those approved by other central Government Departments and from Non registered contractors and meeting eligibility criteria for the following work:

क्रमांक Sl. No	निविदा संख्या Tender no / कार्य का नाम Name of the work	अनुमानित राशि Estimated Amount in INR	ईएमडी रुपये में EMD Amount in INR	निविदा दर TENDER COST
1	आपासह(म)/एम-पी/एफबी/03/2018 T.No.: HWPM/M-P/FAB/03/2018 Supply of anchoring bolts and structural steel, fabrication, anchoring and installation of piping Supports to facilitate laying of 16 NB pipes in XU-1 area of HWPM	₹.9.98 Lakhs	₹.19,960/-	₹500/- per set (Postal Charge Rs.100/- extra)

Last date for receipt of application for Tender document: On or before 14:00 Hrs of 23/03/2018 in the Office of P&AO, HWP (M) with all credentials

Period of Tender sale: From 16/03/2018 to 26/03/2018 (Between 10:00 Hrs to 15:00 Hrs) from the Office of P&AO, HWP (M).

Date and time of Tender Submission & Opening: On 29/03/2018 between Up to 14:00 Hrs in the Office of DGM (Process), HWP (M) & Opening is by 14:30 Hrs on same date & Place.

In case the last date of sale and / or the date of receipt and opening of tender is declared as Holiday, the respective dates shall be treated as postponed to the next working day correspondingly keeping the timings same.

For detailed NIT please visit:www.hwb.gov.in

No.HWPM/GEN/1(15)/2018/ (Signature of tender inviting authority)

SARDAR VALLABHBHAI PATEL NATIONAL POLICE ACADEMY
(Government of India : Ministry of Home Affairs)
Hyderabad-500 052

No.15011/21/2013/Estt/D4/Compt/A2 Dated:15th March, 2018

Applications are invited from eligible individuals for filling up of one post of **Assistant Director (Computer)** in Sardar Vallabhbhai Patel National Police Academy, Hyderabad-500 052, **purely on outsourcing / contract basis for a period of one year** or till the regular vacancy is filled up, whichever is earlier.

2. The maximum age of the applicant as on 01.07.2018 should not exceed 65 years. Pay / qualifications required and application form are available in Academy website **http://www.svpnpa.gov.in/vacancies.aspx.** The Duly filled in applications, along with supporting documents including copies of educational qualification certificates and copy of Pension Payment Order issued by the Government, should reach the Deputy Director (Estt.), SVP National Police Academy, Hyderabad-500 052, on or before **21.05.2018.**

Sd/-
(Dr. K.Madhukar Shetty)
Deputy Director (Estt.)

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును.

పార్శిళ్ళ రవాణా కొరకు పార్శిల్ వ్యాన్ల లీజింగ్ కొరకు టెండరు ప్రకటన No.VP/2017-18/5 తేది: 19-02-2018 ద్వారా బహిరంగ టెండరు కోరబడినది.

భారత రాష్ట్రపతి తరపున దిగువ పట్టికలో చూపబడిన రైళ్ళద్వారా స్టేషన్ల మధ్య రౌండు ట్రిప్ ప్రాతిపదికపై తమ పార్శిళ్ళు రవాణా చేయుటకు ఏకమొత్తం రేట్ల చెల్లింపు పై పార్శిల్ వ్యాన్ల లీజింగ్ కొరకు (23 టన్నుల సామర్థ్యం) దక్షిణ మధ్య రైల్వే పై డివిజన్లతో 'A' క్యాటగిరిలోని చెల్లుబాటుగల నమోదిత లీజు హోల్డర్ల నుండి సీలు వేసిన బహిరంగ టెండర్లను సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ వారు కోరుచున్నారు. రైల్వేలతో లీజుహోల్డర్ల నమోదు పథకము ఏడాది పొడవునా జరిగే ప్రక్రియ. కొత్తగా ప్రవేశించే ఏ వ్యక్తి అయినా ఒక నిర్దిష్ట డివిజన్‌లో ఏ సమయంలోనైనా సంబంధిత డాక్యుమెంట్లతో ఒక దరఖాస్తును, అటుపై 'A' కేటగిరి కొరకు నమోదు ఫీజు రూ.1,00,000/- (రూపాయలు ఒక లక్ష మాత్రమే) చెల్లించి దాఖలు చేయుట ద్వారా తాను నమోదు పొందవచ్చును. నమోదు ఫీజు FA & CAO/SCR పేరున డిమాండ్ డ్రాఫ్టు లేదా బ్యాంకర్స్ చెక్కు రూపంలో ఉండవలెను. ఈ మొత్తంపై రైల్వే వడ్డీ చెల్లించదు. ...

రౌండు ట్రిప్ ప్రాతిపదికపై పార్శిల్ వ్యాన్ల లీజింగ్ కొరకు స్లాట్లు (షెడ్యూలు రేట్లు)

క్ర. సం.	ట్రైన్ నెం.	VPలీజు రౌండు ట్రిప్ సర్క్యూట్	వారానికి దినాల సంఖ్య	సేవా దినములు ప్రారంభ ప్రయాణం	వాపసు ప్రయాణం	లీజుకి ఇవ్వవలసిన పార్శిల్ వ్యాన్ల సంఖ్య	ఒప్పంద గడువు రోజులు	ఒక రౌండు ట్రిప్ రిజర్వు ధర (రూ)
1	18048/ 18047	GTL SHM-GTL	4	ఆది, మంగళ, గురు, శుక్ర (GTL నుండి)	సోమ, బుధ, గురు, శుక్ర (SHM నుండి)	1	7	9470.55
2	18048/ 18047	GTL SHM-GTL	1	శుక్ర (GTL నుండి)	గురు (SHM నుండి)	1	2	9470.55

మధ్యలో నియమిత లోడింగ్/అన్‌లోడింగ్ స్టేషన్లు : లేవు
టెండర్లు దాఖలు చేయవలసినది: Sr.DCM/గుంతకల్

వివరణ	సమయం	తేది
టెండరు డాక్యుమెంట్ల జారీకి చివరి తేది	17.00 గం॥లు	23.04.2018
టెండరు ఫారాల దాఖలుకు చివరి తేది	15.00 గం॥లు	24.04.2018
టెండరు తెరచుట	15.30 గం॥లు	24.04.2018

ఏవేని విచారణ/స్పష్టీకరణల కొరకు దయచేసి దిగువ సంతకందారు కార్యాలయాలను సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, ద.మ.రైల్వే మరియు గుంతకల్ వారి "ఫోన్ నెం.: 08552-226771 పై సంప్రదించండి. లేదా టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ చేయుటకు మా వెబ్‌సైట్ చూడగలరు.

A0484 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంతకల్.

తెలుగు ప్రజల జీవితాలలో తీపి, చేదు కలయికతో సిరిసంపదలు, సుఖసంతోషాలు నిలిపే పండుగ ఉగాది
తెలుగు ప్రజలకు, రైతు సోదరులకు, ఖాతాదారులకు, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు శ్రీ విళంబి నామసంవత్సర



ఉగాది శుభాకాంక్షలు



ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్
• తణుకు • తాడువాయి • భీమడోలు • కొవ్వూరు • సగ్గొండ • పేరేచర్ల

ఇటీవల విడుదలైన గేట్ ఫలితాల్లో నిట్ - వరంగల్ విద్యార్థులు సౌరవ్ కుమార్ సింగ్‌కు మెటలర్జికల్ పేపర్‌లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్, ఎలక్ట్రానిక్స్ పేపర్‌లో కుల్‌దీప్ జైన్‌కు 17వ ర్యాంక్ వచ్చింది. వారిద్దరు దిక్సూచితో మాట్లాడారు. ఆ విశేషాలు..

సొంతంగానే చదివా



సౌరవ్ కుమార్ సింగ్
గేట్-మెటలర్జికల్ 1వ ర్యాంక్

మెటలర్జికల్ బ్రాంచ్‌లో మొదటి ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సారి పేపర్ స్థాయి మధ్యస్థంగా ఉంది. దీంతో సింగిల్ డిజిట్ ర్యాంక్ రావచ్చని భావించా. కానీ మొదటి ర్యాంక్ వస్తుందనుకోలేదు.

కోచింగ్ తీసుకోలేదు: గేట్ కోసం ప్రత్యేకంగా ఎటువంటి కోచింగ్ తీసుకోలేదు. సొంతంగానే సిద్ధమయ్యాను. లైబ్రరీలో పుస్తకాలతోపాటు కొన్ని స్టాండర్డ్ పుస్తకాలను చదివాను. నిట్ ఫ్యాకల్టీ కూడా ఎంతో సహకరించారు. ఆరు నెలల క్రితం నుంచి ప్రిపరేషన్ ప్రారంభించాను. రోజుకు నాలుగు గంటలు చదివాను. బాగా ప్రిపేర్ కావడంతో పరీక్షలో ఎటువంటి ఒత్తిడికి లోనుకాలేదు.

ఐఓసీ లక్ష్యం: పీఎస్‌యూలకు కూడా దరఖాస్తు చేసుకున్నాను. ఇండియన్ ఆయిల్ కంపెనీ (ఐఓసీ)లో జాబ్ చేయాలని ఆసక్తితో ఉన్నాను. ప్రస్తుతానికి ఆదే లక్ష్యం. ఫలితం గురించి ఆలోచించకుండా ప్రిపరేషన్ సాగించాలి. ప్రిపరేషన్‌లో దృష్టి మరలకుండా స్థిరత్వంతో ఉండాలి. ఇదే ఔత్సాహికులకు నేనిచ్చే సలహా.

జాతీయ ప్రాధాన్యం ఉండటంతో: జేఈఈ-మెయిన్‌లో 20605వ ర్యాంక్ వచ్చింది. ఆ ర్యాంక్‌తో నిట్ వరంగల్‌లో చేరాను. దేశంలోని అత్యుత్తమ విద్యా సంస్థతోపాటు జాతీయ ప్రాధాన్యం ఉన్న సంస్థల్లో ఇది ఒకటి. దాంతో బీటెక్ చేయడానికి నిట్ వరంగల్‌ను ఎంచుకున్నా. ప్రస్తుతం బీటెక్‌లో 7.02 జీపీఏ వచ్చింది.

నేపథ్యం: మాది బీహార్‌లోని ముజఫర్‌పూర్. నాన్న విమల్ సింగ్ వ్యాపారవేత్త, అమ్మ పూనమ్ సింగ్ ఉపాధ్యాయురాలు. ఇద్దరు సోదరీమణులు. అక్క ప్రతిమ బెంగళూరులోని టీసీఎస్‌లో జాబ్ చేస్తుంది. చెల్లి మోనిక సివిల్స్‌కు ప్రిపేర్ అవుతోంది.

నిట్ పాత్ర ఎంతో



కుల్‌దీప్ జైన్
గేట్-ఈఈఈ 17వ ర్యాంక్

గేట్ (ఎలక్ట్రికల్) బ్రాంచ్‌లో ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. పరీక్ష రాసిన తరవాత 20లోపు ర్యాంకు వస్తుందని అనుకున్నాను. 17వ ర్యాంక్ వచ్చింది.

సొంతంగా సిద్ధం: ఎటువంటి కోచింగ్ తీసుకోలేదు. సొంతంగా చదివా. డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు కూడా బాగా సహకరించారు. వారు గేట్ తరగతులు నిర్వహించారు. అవి కూడా బాగా ఉపయోగపడ్డాయి. రోజూ 14 గంటలు చదివా. గత నవంబర్ నుంచి గేట్ ప్రిపరేషన్ ప్రారంభించాను. ఫ్యాకల్టీలు సూచించిన పుస్తకాలు చదివాను. ఆనలాగ్ ఎలక్ట్రానిక్స్ టాపిక్ చాలా కష్టంగా అనిపించింది. ఈసారి ఎలక్ట్రానిక్స్ పేపర్ చాలా సులభంగా ఉంది.

ఉద్యోగం.. అటుపై చదువులు: రెండేళ్లు జాబ్ చేసిన తరవాత ఉన్నత చదువుల గురించి ఆలోచిస్తాను. అన్ని పీఎస్‌యూలకు దరఖాస్తు చేశాను. ఈలోపే ఇంటెల్ బెంగళూరులో జాబ్ వచ్చింది. పీఎస్‌యూ, ఇంటెల్ రెంటిలో ఏది అనే విషయంలో ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అంతేకాకుండా ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్ష రాయాలి. అందులో విజయం సాధిస్తే అటువైపు వెళతాను.

నాలుగేళ్లు అద్భుతం: మాది రాజస్థాన్. నాన్న సంజయ్ కుమార్ జైన్ పవర్ హౌస్‌లో ఉద్యోగి. అమ్మ ఉషా జైన్. జేఈఈ-మెయిన్‌లో 5792వ ర్యాంక్ వచ్చింది. నిట్ వరంగల్ ప్రాధాన్యం గురించి విన్నాను. దీంతో బీటెక్ చేయడానికి ఇక్కడకు వచ్చాను. నిట్‌లో నాలుగేళ్లు ఎంతో అద్భుతంగా గడిచాయి. డిపార్ట్‌మెంట్ చాలా బాగుంది. ఫ్యాకల్టీలు ఎంతో సహకరించారు. ఫలితంగానే గేట్ ర్యాంక్‌తోపాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో జాబ్ వచ్చింది. నా విజయంలో నిట్ పాత్ర చాలా ఉంది.

టెస్ట్ సిరీస్‌లు ఉపయోగపడ్డాయి

గేట్ ఫలితాల్లో శ్రీకాకుళంకు చెందిన రాజేంద్రకు ఎలక్ట్రానిక్స్‌లో 33వ ర్యాంక్ వచ్చింది. ఈ నేపథ్యంలో తన విజయానికి దోహదం చేసిన అంశాల గురించి దిక్సూచితో మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

గేట్ టాపర్స్ వాయిస్



రాజేంద్ర
గేట్-ఈఈఈ 33వ ర్యాంక్

గేట్ (ఎలక్ట్రికల్)లో 33వ ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. గతంలో కూడా గేట్ రాశాను 1200వ ర్యాంక్ వచ్చింది. ఎన్ని గంటలని కాకుండా ఎక్కువగా ప్రాక్టీస్ చేయడానికి ప్రాధాన్యం ఇచ్చాను. ఈ విజయంలో నాన్న మోహన్ రావు, నిట్-వరంగల్ అధ్యాపకుల పాత్ర కూడా ఉంది.

మూడో ఏడాదిలో: 2017లో నిట్-వరంగల్ నుంచి బీటెక్ పూర్తి చేశాను. మూడో ఏడాదిలో ఉన్నప్పుడే గేట్ రాయాలనే ఆలోచన వచ్చింది. దీంతో 2016 వేసవి సెలవుల్లో సమ్మర్ క్రాష్ కోర్సు విధానంలో కోచింగ్ తీసుకున్నాను. అదేవిధంగా నిట్ అధ్యాపకులు ఎంతో సహకరించారు. గేట్ కోసం వారు నిర్వహించిన శిక్షణ తరగతులు కూడా ఈ విషయంలో ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ సారి ఎలక్ట్రానిక్స్ పేపర్‌లో ఆప్టిట్యూడ్ విభాగం సులువుగా ఉంది. టెక్నికల్ విభాగంలో పవర్ ఎలక్ట్రానిక్స్ క్లిష్టంగా అనిపించింది. మిగతా అంశాలు చాలా లెంథీగా ఉన్నాయి. మొత్తమ్మీద ఎలక్ట్రానిక్స్ పేపర్ యావరేజ్‌గా ఉందని చెప్పొచ్చు.

చదువుతూనే: గతంలో గేట్‌లో వచ్చిన ర్యాంక్‌తో ప్రస్తుతం ఐఐటీ-ఖరగ్‌పూర్‌లో ఎంటెక్ చేస్తున్నాను. దాంతో ఎంటెక్ చేస్తూనే గేట్‌కు సన్నద్ధమయ్యాను. రోజుకు ఇన్ని గంటలని ఏమీ నిర్దేశించుకోలేదు. గతంలో కోచింగ్ తీసుకొని ఉండటంతోపాటు గేట్ రాసిన అనుభవం దృష్ట్యా కాన్సెప్ట్‌లను ప్రాక్టీస్ చేయడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాను. చివరి నెల రోజులు మాత్రమే గేట్ కోసం టెస్ట్ సిరీస్‌లు రాశాను. అవి చాలా ఉపయోగపడ్డాయి. ప్రిపరేషన్‌లో పవర్ ఎలక్ట్రానిక్స్ చాలా కష్టంగా అనిపించింది.

ఆఫర్ వద్దనుకున్నా: మాది శ్రీకాకుళం జిల్లా. నాన్న మోహన్‌రావు టీచర్. అమ్మ పద్మావతి గృహిణి. అన్నయ్య రాజేష్ హెచ్‌పీసీఎల్‌లో పని చేస్తున్నాడు. ఎంసెట్‌లో 25వ ర్యాంక్, జేఈఈ మెయిన్స్‌లో 1258వ ర్యాంక్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 3330వ ర్యాంక్ వచ్చాయి. దీంతో బీటెక్ చేయడానికి నిట్-వరంగల్‌ను ఎంచుకున్నా. నిట్‌లో ఉన్నప్పుడే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో టాటా మోటార్స్ నుంచి జాబ్ ఆఫర్ వచ్చింది. కానీ ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో ఆ ఆఫర్ తిరస్కరించాను.

సివిల్స్ లక్ష్యం: అన్ని పీఎస్‌యూలకు దరఖాస్తు చేశాను. ప్రస్తుతం నేను చేస్తున్న ఎంటెక్‌లో కోర్సు వర్క్ పూర్తయింది. ప్రాజెక్ట్ మిగిలి ఉంది. దీంతో పీఎస్‌యూ జాబ్, ఉన్నత విద్య విషయంలో ఎటువంటి నిర్ణయానికి రాలేకపోతున్నాను. కాకపోతే నా లక్ష్యం సివిల్స్. కాబట్టి సివిల్స్ ప్రిపరేషన్ సాగిస్తాను.

త్వరగా స్పష్టతకు రావాలి: బీటెక్‌లో రెండు లేదా మూడో ఏడాదిలో ఉన్నప్పుడే గేట్, కోర్ జాబ్ విషయంలో ఒక స్పష్టతకు రావాలి. ఎందుకంటే తదనుగుణంగా తొందరగా సన్నాహాలు ప్రారంభించవచ్చు. గేట్ పరీక్షలో ఉండే మూడు గంటలలో ఎన్ని ప్రశ్నలు చేశావు అనే దాని కంటే ఎన్నింటికి కచ్చితంగా సరైన సమాధానాలను ఇచ్చావు అనేది కీలకం. కాబట్టి ప్రిపరేషన్‌లో ఈ విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. బ్రాంచ్‌ల వారీగా స్టాండర్డ్ పుస్తకాలతోపాటు కోచింగ్ కూడా తీసుకోవాలి. ఎటువంటి ప్రశ్నలు ఏవిధంగా అడుగుతున్నారనే అంశాలపై కోచింగ్ ద్వారా స్పష్టత వస్తుంది. మొదటి సారే విజయం లభించనంత మాత్రాన ప్రయత్నం విరమించకూడదు.

ఢిల్లీలో సౌర కూటమి తొలి సదస్సు

కరెంట్ అఫైర్స్

జాతీయం

కారుణ్య మరణానికి ఓకే



మరణాన్ని వాయిదా వేయడం మినహా మరే ఆశ లేనప్పుడు, శారీరక బాధను భరించలేని దయనీయ పరిస్థితిలో.. రోగి లేదా అతని తరఫున నమ్మకమైన వ్యక్తి అనుమతితో కారుణ్య మరణం ప్రసాదించవచ్చని సుప్రీం కోర్టు పేర్కొంది. పరోక్ష కారుణ్య మరణానికి (పాసివ్ యుథనేసియా) సమ్మతిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మార్చి 9న తీర్పు చెప్పింది. గౌరవప్రదమైన మరణం కూడా జీవించే హక్కులో భాగమేనని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరోక్ష కారుణ్య మరణాన్ని ఎప్పుడు, ఎలా, ఎవరికి అమలు చేయాలనే విషయమై మార్గదర్శకాలను సవివరంగా పొందుపరిచింది. అరుణా షాన్‌బాగ్ కేసులో 2011లోనే సుప్రీంకోర్టు పరోక్ష కారుణ్య మరణాన్ని ప్రసాదించవచ్చునని తెలిపింది. 'జీవించే హక్కులో మరణించే హక్కు భాగమే' అని 1996లోనే జ్ఞాన్‌కౌర్ కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం నిర్ధారించింది. ప్రపంచంలో పలు దేశాలు కారుణ్య మరణాన్ని చట్టబద్ధం చేశాయి. అవి.. నెదర్లాండ్స్, బెల్జియం, కొలంబియా, లక్సెంబర్గ్, కెనడా, దక్షిణ కొరియా, భారత్. ఇక, ప్రాణాంతక మందులు తీసుకోవడం ద్వారా ఆత్మహత్య చేసుకోవడాన్ని స్విట్జర్లాండ్, జర్మనీ, జపాన్, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు చట్టబద్ధం చేశాయి.

అభివృద్ధి కోసం మనం సదస్సు

పార్లమెంటు సెంట్రల్ హాలులో మార్చి 10న 'అభివృద్ధి కోసం మనం ('వియ్ ఫర్ డెవలప్‌మెంట్')' అనే అంశంపై జాతీయ చట్టసభ సభ్యుల సదస్సు జరిగింది.

1,700 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు

దేశ వ్యాప్తంగా దాదాపు 1,700 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై నేరారోపణలు ఉన్నాయి. వీరంతా దాదాపు 3,045 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరణ ఇచ్చింది. ఈ నివేదిక ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో 248 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, తమిళనాడు, బీహార్, బెంగాల్‌లో వరుసగా 178, 144, 139 మంది ఎమ్మెల్యేలు విచారణను ఎదుర్కొంటున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో 100 మందికిపైగా ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా వివిధ నేరాల్లో పాలుపంచుకున్నట్లు, స్వయంగా చేసినట్లు కేసులు ఉన్నాయి.

2025 నాటికి క్షయరహిత భారత్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్చి 13న ఢిల్లీలో టీబీ ఫ్రీ ఇండియా ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారు. క్షయ వ్యాధి రహిత భారత్‌ను సాధించడమే తమ లక్ష్యమని నరేంద్రమోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఆయుధాల దిగుమతిలో భారత్ నెంబర్ వన్

దేశ రక్షణకు అవసరమైన ఆయుధాలను దిగుమతి చేసుకోవడంలో ప్రపంచ దేశాల్లో మళ్లీ మనమే నెంబర్ వన్‌గా నిలిచాం. 2008 - 12, 2013 - 17 మధ్య కాలంలో భారత్ ఆయుధాల దిగుమతి 24 శాతం పెరిగినట్లు స్టాక్‌హోమ్‌కు చెందిన ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రీ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఆయుధాల దిగుమతిలో భారత్ తరవాతి స్థానాల్లో సౌదీ అరేబియా, ఈజిప్టు, యూఏఈ, చైనా, ఆస్ట్రేలియా, ఇరాక్, పాకిస్తాన్, ఇండోనేసియా నిలిచాయి. భారత్‌కు అత్యధికంగా ఆయుధాలు సరఫరా చేస్తున్న దేశం రష్యా. మన దేశానికి అవసరమయ్యే ఆయుధాల్లో రష్యా నుంచి 62 శాతం, అమెరికా నుంచి 15 శాతం, ఇజ్రాయెల్ నుంచి 11 శాతం దిగుమతి చేసుకున్నట్లు ఆ నివేదిక తెలిపింది.



ప్రపంచ స్మార్ట్ సిటీల్లో భువనేశ్వర్

ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు ప్రపంచ స్మార్ట్ సిటీల జాబితాలో 20వ స్థానం దక్కింది. జునిపర్ రీసెర్చ్ అనే సంస్థ ఇంటెల్ సాయంతో 'గ్లోబల్ స్మార్ట్‌సిటీ పర్ఫార్మెన్స్ ఇండెక్స్' పేరుతో నిర్వహించిన సర్వే ఫలితాలను తాజాగా విడుదల చేసింది. రవాణా సౌకర్యాలు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత, ఉత్పాదకత అనే నాలుగు అంశాల్లో ర్యాంకింగ్స్ ఇచ్చారు. భద్రతలో 13వ ర్యాంకు దక్కించుకున్న భువనేశ్వర్.. రవాణా, ఆరోగ్యం, ఉత్పాదకత సూచీల్లో 20 స్థానంలో నిలిచింది. 2016లో భారత ప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్ సిటీల జాబితాలోనూ భువనేశ్వర్ తొలిస్థానంలో నిలిచింది. ఈ సర్వేలో సింగపూర్ నాలుగు అంశాల్లోనూ తొలిస్థానం సాధించింది.



ఐఎస్ఏ తొలి సదస్సు

న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మార్చి 11న భారత్ - ఫ్రాన్స్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) తొలి సదస్సు జరిగింది. ఇందులో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేనలతో కలిసి ప్రధాని మోదీ పాల్గొన్నారు. అంతేకాకుండా ఆరుదేశాల ఉపాధ్యక్షులు, ఉప ప్రధానులతో పాటు 19 దేశాల నుంచి మంత్రుల స్థాయి బృందాలు సదస్సుకు హాజరయ్యాయి. సోలార్ ఇంధనాన్ని పోత్సహించే లక్ష్యంతో 121 దేశాల్ని ఒకే వేదికపైకి తేవాలన్న మోదీ ఆలోచన నుంచి పుట్టిందే ఐఎస్ఏ (ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్).

భారత్‌లో పర్యటించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్



ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మార్చి 9 నుంచి నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మార్చి 10న ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షణ, భద్రత, అణు విద్యుత్తు, ఇండో - పసిఫిక్ ప్రాంతంలో సహకారాన్ని విస్తృతం చేయడం సహా కీలక రంగాలకు సంబంధించి ఇరు దేశాలు 14 ఒప్పందాలు చేసుకున్నాయి. మైక్రాన్ తాజ్‌మహల్, వారణాసి పట్టణాలను కూడా సందర్శించారు. ఐఎస్ఏ సదస్సులో పాల్గొన్నారు. వారణాసిలో కూడా పర్యటించారు. ఉత్తరప్రదేశ్‌లో అతిపెద్ద పవర్ ప్లాంట్‌ను మోదీతో కలిసి మార్చి 12న ప్రారంభించారు. గంగానదిలో ఇరువురు నేతలు బోటు షికారు చేశారు.



రామచంద్రారెడ్డి ఉప్పుల

స్టీఫెన్ హాకింగ్ మృతి



విధిరాతను ఎదిరించి, విశ్వ రహస్యాలను ఛేదించిన ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ (76) మార్చి 14న కేంబ్రిడ్జిలో కన్నుమూశారు. స్టీఫెన్ హాకింగ్ 1942 జనవరి 8న ఆక్స్‌ఫర్డ్‌లో పుట్టారు. హాకింగ్ పూర్తిపేరు స్టీఫెన్ విలియం హాకింగ్. 1964లో.. ఆయనకు 21 ఏళ్ల వయసులో మోటార్ న్యూరాన్ వ్యాధితో బాధపడుతున్నట్లు వెల్లడైంది. అది శరీరాంగాల్ని దెబ్బతీస్తూ ఆయనను తీవ్రమైన పక్షవాతానికి గురిచేసింది. 1985లో న్యుమోనియా రావడంతో పూర్తిగా వీల్ చైర్‌కే పరిమిత మయ్యారు. శరీరం అంతా పక్షవాతం రావడంతో చేతి చిటికెన వేలి కదలికల సాయంతో ట్రేడ్‌మార్క్ వాయిస్ సింథసైజర్ ద్వారా తన ఆలోచనలను తెలిపేవారు. హాకింగ్ బిగ్ బ్యాంగ్ థియరీని ముందుకు తెచ్చారు. కృష్ణబిలాలపై ఆయన శోధించి వెల్లడించిన అంశాలు ప్రస్తుతం ప్రామాణికంగా నిలుస్తున్నాయి. శాస్త్ర రంగంలో చేసిన పరిశోధనలకుగాను హాకింగ్‌కి అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అవార్డు, వోల్ఫ్ ప్రైజ్, ద కోప్లీ మెడల్, ద ఫండమెంటల్ ఫిజిక్స్ ప్రైజ్, కమాండర్ ఆఫ్ మోస్ట్ ఎక్సలెంట్ ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్, గోల్డ్ మెడల్ ఆఫ్ రాయల్ ఆస్ట్రోనామికల్ సొసైటీ తదితర పురస్కారాలు ఆయనను వరించాయి. హాకింగ్ బ్రిటిష్ పౌరుడైనప్పటికీ 2009లో ఒబామా అమెరికా అత్యున్నత పౌర పురస్కారం 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'తో ఆయనను సత్కరించారు. 2014లో స్టీఫెన్ హాకింగ్ జీవితంపై 'ద థియరీ ఆఫ్ ఎవ్రీథింగ్' అని సినిమా కూడా తీశారు. ఈ సినిమాలో స్టీఫెన్ పాత్ర పోషించిన రెడ్‌మేన్‌కు ఆస్కార్ అవార్డు లభించింది. హాకింగ్ అయిదు అద్భుత రచనలు: మై బ్రీఫ్ హిస్టరీ, ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్, ది గ్రాండ్ డిజైన్, యూనివర్స్ ఇన్ ఏ నట్‌షెల్, జార్జ్స్ సీక్రెట్ కీ టు యూనివర్స్.

ఆర్థిక రంగం

మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సూచీ

మాస్టర్ కార్డ్ విడుదల చేసిన మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సూచీ 2018లో భారత్ 42.7 పాయింట్లతో 52వ స్థానంలో నిలిచింది. జాబితాలో న్యూజిలాండ్ 74.2 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. స్వీడన్, కెనడా, అమెరికా వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి.

ఫోర్బ్స్ అండర్ - 40 బిలియనీర్లలో విజయ్‌శేఖర్ శర్మ

ఫోర్బ్స్ అండర్ - 40 బిలియనీర్ల జాబితాను మార్చి 7న ప్రకటించింది. పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్‌శేఖర్ శర్మ భారత్ తరఫున ఫోర్బ్స్ అండర్ - 40 బిలియనీర్స్ జాబితాలో చోటు సంపాదించుకున్నారు. 39 ఏళ్ల వయసున్న శర్మ ఇప్పుడు భారత్‌లో పిన్న వయసు కలిగిన బిలియనీర్ అని ఫోర్బ్స్ వెల్లడించింది (సంపద 170 కోట్ల డాలర్లుగా అంచనా). ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో మొత్తం 2,208 మంది ఉండగా... అందులో 40 ఏళ్ల లోపువారు కేవలం 63 మంది మాత్రమే.

2018-19లో భారత్ వృద్ధి 7.3 శాతం

2018-19లో భారత్ వృద్ధి రేటు 7.3 శాతం ఉంటుందని ప్రపంచబ్యాంక్ తన ద్వైవార్షిక ప్రచురణలో పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం 2019-20లో ఈ రేటు 7.5 శాతంగా నమోదవుతుంది. భారత్ 8 శాతం వృద్ధిని సాధించాలంటే మరిన్ని చర్యలు అవసరమని ప్రపంచ బ్యాంక్ తెలిపింది.

వింగ్స్ ఇండియా 2018



వింగ్స్ ఇండియా 2018 ప్రదర్శన మార్చి 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా విమానయాన రంగంలో సేవలకు గుర్తింపుగా అందించే వింగ్స్ ఇండియా పురస్కారాలను మార్చి 8న అందజేశారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్యాసింజర్ ఫ్రెండ్లీ ఎయిర్‌లైన్స్‌గా విస్తారా, ఉత్తమ డొమెస్టిక్ ఎయిర్‌లైన్స్‌గా స్పైస్ జెట్ సంస్థలు అవార్డులు గెలుచుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విభాగంలో ఇందిరాగాంధీ విమానాశ్రయం (ఢిల్లీ), ప్రయాణికుల విభాగంలో ఛత్రపతి శివాజీ విమానాశ్రయం (మహారాష్ట్ర) ఉత్తమ విమానాశ్రయ పురస్కారాలను అందుకున్నాయి. బెస్ట్ స్టేట్ విత్ ఏ డెడికేటెడ్ ఔట్‌లుక్ పురస్కారం తెలంగాణకు దక్కింది.

రాష్ట్రీయం

తెలంగాణ బడ్జెట్

తెలంగాణ బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ మార్చి 15న శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇందులోని ముఖ్యాంశాలు..

- బడ్జెట్ మొత్తం రూ.1,74,453 కోట్లు
- రెవెన్యూ వ్యయం.. రూ.1,25,454 కోట్లు
- రెవెన్యూ మిగులు రూ.5,520 కోట్లు
- ద్రవ్యలోటు అంచనా.. రూ.29,077కోట్లు
- జీడీపీలో ద్రవ్య లోటు 3.45 శాతం
- రాష్ట్ర ఆదాయం రూ.73,751 కోట్లు
- కేంద్రం వాటా రూ.29,041 కోట్లు

కేటాయింపులు..

- నీటి పారుదల రంగానికి రూ.25వేల కోట్లు
- పంటల పెట్టుబడి మద్దతుకు రూ.12వేల కోట్లు

తెలంగాణ ఆర్థిక సర్వే

తెలంగాణ ఆర్థిక సర్వే మార్చి 15న విడుదలైంది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణ జీఎస్‌డీపీ 2017-18 ధరల వద్ద రూ. 7.33 లక్షల కోట్లుగా ఉంది. ఇది 2016-17లో రూ. 6.42 లక్షల కోట్లు. అంటే 14 శాతం వృద్ధి నమోదైంది. కాగా దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.37 శాతం. 2017-18 జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా 18.2 శాతం, ద్వితీయ రంగం వాటా 16.4 శాతం, సేవారంగం వాటా 65.4 శాతంగా ఉంది. 2017-18 లో తెలంగాణలో తలసరి ఆదాయం ప్రస్తుత ధరల వద్ద రూ. 1,75,534 .ఇదే కాలంలో దేశ తలసరి ఆదాయం రూ. 1,12,764. జిల్లాల వారీగా రంగారెడ్డి జిల్లా అత్యధిక తలసరి ఆదాయాన్ని (రూ.3,68,747), నాగర్‌కర్నూలు అత్యల్ప తలసరి ఆదాయాన్ని (రూ.82,694) కలిగి ఉన్నాయి.

ఆదరణ ప్రారంభం

ఆదరణ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్చి 15న విజయవాడలో ప్రారంభించారు. కుల వృత్తి / చేతి వృత్తిదారుల ఆదాయం పెంపుకోసం ఆధునిక పనిముట్లు అందజేయడం, అవసరాలకు అనుగుణంగా ఆధునిక శిక్షణ ఇవ్వడం ఈ పథకం ఉద్దేశం.

వార్తల్లో వ్యక్తులు

అమెరికాకు నూతన విదేశాంగ మంత్రి

అమెరికా విదేశాంగ మంత్రిగా అమెరికా నిఘా సంస్థ (సీఐఏ) డైరెక్టర్ మైక్ పాంపియోను మార్చి 13న ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించారు. అంతకు ముందు రెక్స్ టిలర్సన్‌ను విదేశాంగ శాఖ మంత్రి పదవి నుంచి తొలగించారు.

నేపాల్ కొత్త స్పీకర్‌గా మహారా

నేపాల్ పార్లమెంట్ కొత్త స్పీకర్‌గా సీపీఎన్ మావోయిస్టు సెంటర్ నేత కృష్ణ బహదూర్ మహారా మార్చి 9న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్చి 10న నిర్వహించిన ప్రజా ప్రతినిధుల సమావేశంలో ఈ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు.

జర్మనీ అధినేత్రిగా ఏంజెలా మెర్కెల్

జర్మనీ అధినేత్రిగా నాలుగోసారి ఏంజెలా మెర్కెల్ పగ్గాలు చేపట్టబోతున్నారు. జర్మన్ పార్లమెంటు సభ్యులు మార్చి 14న మరోసారి దేశ చాన్స్‌లర్‌గా ఏంజెలాను ఎన్నుకున్నారు.

నేపాల్ అధ్యక్షురాలిగా విద్యాదేవి

నేపాల్ అధ్యక్షురాలిగా విద్యాదేవి భండారి రెండోసారి ఎన్నికయ్యారు. నేపాల్ అధ్యక్ష పదవికి మార్చి 13న జరిగిన ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీరాయిపై వామపక్ష కూటమి సీపీఎన్ (యూఎంఎల్), సీపీఎన్ (మావోయిస్టు) అభ్యర్థి విద్యాదేవి భండారి భారీ ఆధిక్యంతో గెలుపొందారు.

సర్వోన్నత నేత స్థాయికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్



చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఇక జీవితకాలం ఆ పదవిలో కొనసాగేందుకు మార్గం అధికారికంగా సుగమమైంది. ఓ వ్యక్తి అధ్యక్షుడిగా రెండు కంటే ఎక్కువసార్లు పనిచేయకూడదంటూ ఉన్న పరిమితిని ఎత్తివేసే రాజ్యాంగ సవరణకు ఆ దేశ పార్లమెంటు 'నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్' మార్చి 11న ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జిన్‌పింగ్ రెండోసారి అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఇకపై కూడా ఆయన ఎన్నాళ్లు కోరుకుంటే అన్నాళ్లు, కావాలంటే చనిపోయేంత వరకు కూడా అధ్యక్షుడిగా ఉండొచ్చు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) స్థాపక చైర్మన్ అయిన మావో జెడాంగ్ తర్వాత అధ్యక్ష పదవిలో జీవితకాలం కొనసాగనున్న నేతగా జిన్‌పింగ్ రికార్డు సృష్టించనున్నారు. జిన్‌పింగ్ 1971లోనే కమ్యూనిస్ట్ యూత్‌లీగ్‌లో చేరారు. హుజింటావో అధ్యక్షుడిగా ఉన్నపుడు 2008-13 మధ్యలో ఉపాధ్యక్షుడిగా, 2010-12 మధ్యలో సెంట్రల్ మిలటరీ కమిషన్ వైస్‌చైర్మన్‌గా ఉన్నారు. 2012లో తొలి సారిగా ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టారు. 2013లో అధ్యక్ష పదవిని, సీపీసీ ప్రధాన కార్యదర్శి, శక్తిమంతమైన కేంద్ర సైనిక కమిషన్ (సీఎంసీ) పదవులనూ జిన్‌పింగ్ దక్కించుకున్నారు. ఆయన 2017లో మళ్లీ ఆ పదవులకు ఎన్నికయ్యారు. మావో పాలన తర్వాత మరో జీవితకాల నియంతృత్వం తలెత్తకుండా ఉండేందుకు 1982లో చైనా నాయకుడు డెంగ్ జియావోపింగ్ ఈ పరిమితిని తెచ్చారు. చైనా మొదటి రాజ్యాంగం 1954లో అమల్లోకి వచ్చింది. ప్రస్తుత రాజ్యాంగం 1982 నుంచి అమల్లో ఉంది. ఇప్పటివరకూ నాలుగుసార్లు (1988, 1993, 1999, 2004లో) సవరణలు చేశారు. 1949 నుంచి అమల్లో ఉన్న ఏకపార్టీ వ్యవస్థలో.. పదవీకాల పరిమితి తొలగింపే అతిపెద్ద రాజకీయ మార్పుగా పరిగణిస్తున్నారు.

సీఐఏ డైరెక్టర్‌గా గినా హాస్పెల్

సీఐఏ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న గినా హాస్పెల్‌ను ఆ సంస్థ కొత్త డైరెక్టర్‌గా మార్చి 13న ప్రకటించారు. సీఐఏ చీఫ్‌గా ఒక మహిళను నియమించడం ఇదే తొలిసారి.

విధి - విధానం

ఉగాది పూజ ఎలా చేయాలి?

ఇవాళ ఉగాది నుంచి మనకు కొత్త సంవత్సరం ప్రారంభం! ఇవాళ నియమానుసారంగా దైవారాధన చేస్తే, ఏడాది అంతా శుభప్రదంగా, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా గడుస్తుందన్న నమ్మకంతో, ఈ ఒక్క రోజే కాదు, ఏడాదంతా సత్ప్రవర్తనతో మెలుగుతామని సంకల్పం చేసుకోవాలి. తెల్లారకముందే, వీలైతే బ్రాహ్మీ ముహూర్తంలో నిద్ర లేవాలి. అభ్యంగన స్నానం చేసి, శుచిగా భగవదారాధన చేయాలి. పూజకు ముందే గడపలో ముగ్గులు పెట్టాలి. గుమ్మాలకు మామిడి ఆకుల తోరణాలు కట్టాలి. పూజా మందిరాన్ని పుష్పాలతో అలంకరించాలి. ఆవు నెయ్యితో దీపం వెలిగించాలి. మీ ఇష్ట దైవానికి పూజ చేసి, ఉగాది పచ్చడినీ, పిండి వంటలనూ నివేదన చేయాలి. ఉగాది నుంచి వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. ఈ తొమ్మిది రోజుల్లో అమ్మవారినీ, శ్రీరాముడినీ పూజిస్తే సత్ఫలితాలు ఉంటాయి. పూజ తరువాత పంచాంగ పఠనం, లేదా శ్రవణం చేయడం, తరువాత ఆలయానికి వెళ్ళి దైవ దర్శనం చేసుకోవడం ఆనవాయితీ.



వసంత కోకిలలు

నవ పల్లవాలు రుచి చూసిన కోయిలలు ఏడాదికి ఒక్కసారి గొంతు శ్రుతి చేసుకుంటాయి. కానీ ఈ కోయిలమ్మలు రుతువులకు అతీతంగా నవ రాగాలను ఆలపిస్తూనే ఉంటారు. షడ్రుచులను ఆస్వాదించినంత అందంగా పదాలతో అల్లుకుపోతుంటారు. నూతన వత్సరాది ఉగాది పూట వీరి సరిగమల సరాగాలు 'నవ్య' పాఠకులకు ప్రత్యేకం..

ఫలితం దక్కిందనిపించింది

- మనీషా ఈరబత్తిని

నేను పుట్టి పెరిగిందంతా అమెరికాలోనే. అక్కడ కూడా ఉగాది చాలా ప్రత్యేకం. అమెరికాలో తెలుగువారున్న ప్రతిచోట చాలా ఘనంగా ఆ పండుగ జరుపుకుంటాం. కానీ ఉగాది పచ్చడి చేసుకునేందుకు కావలసిన పదార్థాలూ అక్కడ సరిగ్గా దొరకవు. డ్రై వేపపువ్వు మాత్రమే దొరుకుతుంది. దాని కోసం ఒక రోజు ముందే షాపింగ్ చెయ్యాలి. ఇక పండగ రోజు ఉదయాన్నే లేచి తలస్నానం చేసి ఉగాది పచ్చడి, మామిడి పులిహోర, భక్ష్యాలు తయారు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఆ తర్వాత డ్యూటీలకు వెళ్లిపోతాం. సాయంత్రం ఆఫీస్ నుంచి రాగానే మళ్లీ పూజ చేసి గుడికి వెళ్తాం. అమ్మా వాళ్లంతా అక్కడ పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని ఇంటికొచ్చి పంచాంగం నాకు చెప్పేవారు. ఆ తర్వాత స్నేహితులు, బంధువుల సమక్షంలో సరదాగా కబురు చెప్పుకుంటూ విందు ఆరగిస్తాం. వీకెండ్‌లో పండగ వస్తే ఎంజాయ్ చెయ్యడానికి టైమ్ ఉంటుంది. ప్లేబ్యాక్ సింగింగ్ కోసం హైదరాబాద్ వచ్చేశాక ఉగాది మరింత ఘనంగా చేసుకుంటున్నా. సింగింగ్ పరంగా గడిచిన రెండేళ్లతో పోలిస్తే గత ఉగాది నుంచీ కెరీర్ చాలా బావుంది. అప్పుడు 'నేను లోకల్'లో 'అరెరే ఎక్కడ ఎక్కడ...', 'మహానుభావుడు'లో 'కిస్ మి బేబీ...', 'ఇంటెలిజెంట్'లో 'నా సెల్ ఫోన్...' పాటలు మంచి పేరు తీసుకొచ్చాయి. ఫస్ట్ టైమ్ తమిళంలో, హిందీలో పాటలు పాడా. 'ఫిదా'లో శైలూగా చిన్న పాత్ర చేశా. దానితో ఎక్కడికెళ్లినా నన్ను శైలుగానే గుర్తిస్తున్నారు. నా కష్టానికి ప్రతిఫలం దక్కిందనిపిస్తోంది. అలాగే మొదటిసారి ఆర్.పి.పట్నాయక్‌గారితో కలిసి ఆస్ట్రేలియాలో ఓ షో చేశా. గత ఏడాది హిట్టైన పాటలతో 'అరెరే' పేరుతో ఓ మాష్ అప్ చేశా. అది ఇప్పుడు యూ ట్యూబ్‌లో వైరల్ అవుతోంది. నా మాష్ అప్‌ని టీవీల్లో చూసుకోవడం కొత్త అనుభూతి కలిగించింది. ఈ ఏడాది నా యూట్యూబ్ ఛానెల్‌లో సంగీత పరంగా కొత్త ప్రయోగాలు చెయ్యాలనుకుంటున్నా. నేనే పాటలు రాయించి వాటినే మాష్ అప్స్‌గా విడుదల చెయ్యాలనుకుంటున్నా. అమెరికాను వదిలి వచ్చి ఏ సపోర్టూ లేకుండా సింగర్‌గా నలుగురి మెప్పు పొందానని ఈ ఏడాది అనిపించింది.

ఆనందదాయకం..!

- దామినీ భట్ల

నాకు వసంత రుతువు అంటే చాలా ఇష్టం. దానితోపాటు వచ్చే ఉగాది పండుగ అంటే ఇంకా ఇష్టం. ఉదయాన్నే పూజలు చేసి, కొత్త బట్టలు ధరించి పచ్చడి తింటాం. అ రోజు అమ్మ తయారు చేసే పిండి వంటల్ని తిని ఎంజాయ్ చేస్తా. రెండేళ్లుగా ఈ పండుగను ఇంటి దగ్గర జరుపుకోవడం లేదు. విదేశాల్లో తెలుగు అసోసియేషన్స్ వాళ్లు ఉగాది సందర్భంగా షోలు ఏర్పాటు చేయడం, అక్కడికి వెళ్లడంతో ఇంట్లో చేసుకునే పండుగను మిస్ అయ్యా. ఈ ఏడాది మాత్రం ఇంట్లోనే ఉన్నా. ఉగాది పచ్చడిలో తియ్యదనం, పులుపు అంటే నాకు చాలా ఇష్టం. పంచాంగ శ్రవణం వింటా. నాకొక ఉగాది పాట వచ్చు. పూజ పూర్తయిన వెంటనే మంగళ హారతి ఇస్తూ నాకొచ్చిన 'ఉల్లము దోచే ఈ ఉగాదితో వెల్లి విరిసెను...' పాట పాడతాను. ఉగాది రోజున చెరుకు ముక్కలు తినడమంటే చాలా ఇష్టం. గత ఏడాది ప్రారంభం చాలా బావుంది. సింగర్‌గా 'బాహుబలి2' విడుదలైంది. ఆ సినిమా మొత్తం నేను, అక్క మౌనిమ సోలో బిట్స్, కోరస్, ఆర్.ఆర్ ఇలా అన్నిట్లో భాగమయ్యాం. ప్రపంచవ్యాప్తంగా ఆ సినిమా పెద్ద హిట్ కావడం ఆనందంగా ఉంది. అలాగే ఆ తర్వాత లండన్, మస్కట్, స్కాట్‌లాండ్‌లో పెద్ద పెద్ద షోలు చేశా. అక్కడ నా పాటలకు మంచి ప్రశంసలు వచ్చాయి.. మే మొదటివారంలో రెహమాన్‌గారి కె.ఎం ఇన్‌స్టిట్యూట్‌లో వెస్ట్రన్ వోకల్స్ నేర్చుకోవడానికి వెళ్లా. నా కోర్స్ పూర్తి కాగానే ఆయన స్టూడియోలో నుంచి ఫోన్ వచ్చింది. అది శ్రీదేవిగారి చివరి చిత్రమైన 'మామ్' సినిమాలో ఓ పాట కోసం. 'ఆరదు ఈ అగ్ని' అనే ఈ పాటను 'జీన్స్' శ్రీనివాస్‌గారి పర్యవేక్షణలో పాడటం మరచిపోలేని అనుభూతి. నా వెర్షన్ రెహమాన్‌గారికి నచ్చి నా వాయిసే ఫైనల్ చేశారు. ఆ పాటకు మంచి పారితోషికం కూడా ఇచ్చారు. ఆ చెక్కు జిరాక్స్ తీసి దాచుకున్నా. అలాగే మనోగారితో ఆస్ట్రేలియాలో తెలుగు, తమిళ షో చేశా. 'భాగమతి', 'ఒక్కక్షణం', 'స్కెచ్' సినిమాలో మంచి పాటలు పాడా. గత ఏడాది ఉగాది నుంచి ఇప్పటి వరకూ ఏ రోజూ ఖాళీగా లేను. అసలు ఈ ఏడాది మరచిపోలేని విషయం ఏంటంటే.. త్రివిక్రమ్‌గారి దర్శకత్వంలో 'అజ్ఞాతవాసి' సినిమాలో నేను మా అక్క మౌనిమ ఒక్క క్షణం అలా కనిపించడం... ఆ సినిమా షూటింగ్‌లోనే పవన్‌కల్యాణ్‌గారితో ఫొటో దిగే ఛాన్స్ దక్కింది. కానీ త్రివిక్రమ్‌గారితో ఫొటో మిస్ అయ్యా. ఈ ఏడాది సొంతంగా 'మాన్‌సూన్ లవ్' అనే ఇండిపెండెంట్ ఆల్బమ్ చేశా. ఇకపై అలాంటి మ్యూజిక్ వీడియోలు ఎక్కువగా చేద్దామనుకుంటున్నా.



మరచిపోలేని సంవత్సరం

- ఎం.ఎం.మానసి

నా మాతృభాష తమిళం. పుట్టి పెరిగింది ముంబైలో! ప్రస్తుతం చెన్నైలో ఉంటున్నా. అయినప్పటికీ నాకు ఉగాది పండుగ గురించి బాగా తెలుగు. ఎందుకంటే నాకు చాలా మంది తెలుగు స్నేహితులు ఉన్నారు. తెలుగు సంవత్సరాది అని కాకుండా ఓ పండుగగా మా కుటుంబం ఉగాది పండుగ జరుపుకుంటాం. ఉగాది పచ్చడి రుచి నాకు తెలుసు కానీ మా ఇంట్లో తయారు చెయ్యరు. అమ్మ వడ, పాయసం తయారు చేస్తారు. పండుగ అని కొత్త నిర్ణయాలు తీసుకోవడం నాకు అలవాటు లేదు. ప్రతిరోజూ బావుండాలనీ, చేసే వృత్తిలో ఎదుగుదల ఉండాలనీ కోరుకుంటా. గడిచిన ఏడాది తెలుగు, తమిళంలో మంచి మంచి పాటలు పాడా. 'మహానుభావుడు' టైటిల్ సాంగ్, 'ఉన్నది ఒకటే జిందగీ'లో 'రయ్యి రయ్యి మంటు', 'జయ జానకీ నాయకా'లో పాటలు మంచి పేరు తెచ్చాయి. ఈ ఉగాది ప్రారంభం అదిరిపోయింది. ఎలా అంటే పండుగ ముందు 'రంగస్థలం' సినిమా నుంచీ 'రంగమ్మా మంగమ్మా' పాట విడుదలై సూపర్ సక్సెస్ అయింది. పాట విడుదలైన రోజు నుంచీ గోదారి యాసలో వాయిస్ అదిరిపోయిందని వరుసగా మెసేజ్‌లు వస్తూనే ఉన్నాయి. పైగా ఉగాది రోజున వైజాగ్‌లో జరుగుతున్న ప్రీ రిలీజ్ వేడుకలో లైవ్ పెర్‌ఫార్మెన్స్ ఇవ్వబోతున్నా. అలా ఈ ఏడాది ఉగాది నా జీవితంలో అతి పెద్ద రోజు కాబోతోంది. ఆ పాట పది రోజుల్లో 11 మిలియన్ వ్యూస్ సాధించింది. నేను పాడిన సోలో పాటల్లో ఇంతగా రెస్పాన్స్ వచ్చిన పాట మరొకటి లేదు. పాడే ముందు ఈ పాట మనం మాట్లాడుకునే మాటల్లా ఉంటుందనీ, ఫోక్ టైప్‌లో గోదావరి యాసలో ఉండాలనీ చెప్పి ఎలా పాడాలో నేర్పించారు దేవిశ్రీ ప్రసాద్. రికార్డింగ్ అయిపోయాక సుకుమార్‌గారు పిలిచి 'నువ్వు తెలుగమ్మాయివి కాదంటే నమ్మలేకపోతున్నా అమ్మా' అన్నారు. ఆ సందర్భంలో నాకు చాలా ఆనందంగా అనిపించింది. అమ్మానాన్నల ప్రశంసలతోపాటు నేను రికార్డింగ్‌కు వెళ్లే ప్రతిరోజు సంతృప్తిగానే ఉంటా. ఎందుకంటే ఒక పాట తర్వాత మరో పాట పాడించేందుకు నన్ను పిలుస్తున్నారు అంటే నా గొంతుకు ప్రేక్షకాదరణ దొరికిందనే కదా! దాని వల్ల నాపై నమ్మకం మరింత రెట్టింపు అవుతుంది. సంగీతంలో అన్ని అంశాలు నేర్చుకోవాలి. ఇందులోనే స్థిరపడాలన్నది నా కోరిక.




మరికొన్ని ఇంటర్వ్యూలు లోపలి పేజీలో...

కొత్త ప్రయత్నం చేశా..

- మోహన భోగరాజు

వసంత రుతువుతో వచ్చే ఉగాది పండుగ అంటే తెలుగు వారందరికీ ప్రత్యేకం. నాకు చిన్నప్పటి నుంచీ చాలా ఇష్టమైన పండుగ ఇది. తెలుగు సంవత్సరం ప్రారంభం అనగానే కొత్త ఆలోచనలకు దారి తీస్తుంది. ఉదయాన్నే లేచి స్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తాం. కుటుంబమంతా గుడికెళ్లి ఇష్ట దైవాన్ని కొలవడం, పంచాగ శ్రవణం అన్నీ మామూలే.. షడ్రుచులతో తయారు చేసే ఉగాది పచ్చడి తిన్న తర్వాతే, ఇతర పిండి వంటలు తింటాం. ఆ రోజు పులిహోర, బొబ్బట్లు, బూరెలు, పరమాన్నం మా ఇంట్లో ప్రత్యేకమైన వంటకాలు. కెరీర్ పరంగా చూసుకుంటే గత ఉగాది నుంచీ ఈ ఏడాది వరకూ అంతా ప్రత్యేకమే. నేపథ్యగాయనిగా కెరీర్ ప్రారంభించిన ఈ రెండున్నర ఏళ్లల్లో ఇది నాకు చాలా ప్రత్యేకం. గత ఉగాది సమయంలోనే 'బాహుబలి-2' సినిమా విడుదలైంది. అందులో తమిళ వెర్షన్ కోసం నేను పాడిన 'ఒరే ఒరురిల్' (తెలుగులో 'హంసనావ...') పాట నాకెంతో గుర్తింపు తీసుకొచ్చింది. ఆ పాట నాకు మంచి ప్రారంభంగా భావిస్తా. ఆ కిక్‌తో 'మిస్టర్', 'జవాన్', 'భాగమతి', 'ఆచారి అమెరికా యాత్ర', 'నక్షత్రం' చిత్రాల్లో మంచి పాటలు పాడా. తెలుగు, తమిళ భాషల్లో పాడటమే కాకుండా తొలిసారి కన్నడంలో కూడా పాడే అవకాశం గత ఏడాది దక్కింది. హిందీలో నూరీన్ సిస్టర్స్ పాడిన 'దమాదమ్ మస్త్ కలందర్' పాటని ఓ సూఫీ సాంగ్‌గా పాడి నా పేరుతో స్టార్ట్ చేసిన యూట్యూబ్ చానెల్‌లో విడుదల చేశా. ఏ అంచనాలూ లేకుండా విడుదల చేసిన ఆ పాట నాకెంతో గుర్తింపు తీసుకొచ్చింది. ఈ ఏడాది కూడా ఆనందంగా సాగుతుందని నమ్ముతున్నా.



• ఆలపాటి మధు
ఫొటోలు: గోపీకృష్ణ

ప్రవచనం

అనువైన సమయం ఇదే!

ప్రపంచమంతా జనవరి 1ని సంవత్సరాదిగా పాటిస్తున్నప్పుడు, మనం ఇంకా ఉగాదిని ఎందుకు సంవత్సరాదిగా జరుపుకొంటున్నాం? అసలు ఉగాది యొక్క ప్రాముఖ్యం ఏమిటి? అందరూ ఇంగ్లీష్ క్యాలండర్‌ను అనుసరిస్తున్న ఈ సమయంలో, మనం ఇంకా మన సంప్రదాయ పంచాంగాన్ని అనుసరించడం అవసరమా?

కొంత నిర్దుష్టమైన కాలం, కొంత నిర్దుష్టమైన శక్తి - ఈ రెంటినీ కలిపి మనం 'జీవితం' అంటాం. కాలమనే ఆలోచన భూమి చుట్టూ జరిగే చంద్ర పరిభ్రమణం వల్ల, సూర్యుని చుట్టూ జరిగే భూ పరిభ్రమణం వల్ల ఏర్పడింది. భూమి చుట్టూ చంద్రుడు ఒకసారి తిరిగితే ఒక నెల. సూర్యుని చుట్టూ భూమి ఒకసారి తిరిగితే ఒక సంవత్సరం. ఈ సూర్యచంద్రులకు సాపేక్షంగా భూమి ఉండే స్థానం మన వ్యవస్థపై చాలా ప్రభావం చూపుతుంది. మన శరీరం, మనసులపై ఈ సూర్య చంద్రుల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది.

భూమి ముఖ్యంగా సూర్యశక్తి వల్లే నడుస్తున్నది, మీ శరీరం కూడా ఈ భూమిలో ఒక అంశమే. సూర్యశక్తిని మీరెంత గ్రహించగలరన్న దానిని బట్టే మీకెంత శక్తి ఉన్నదనేది నిర్ణయమవుతుంది. అందువల్ల సూర్యుని చుట్టూ జరిగే భూ పరిభ్రమణం కాలాన్నే కాక, మన శక్తిని కూడా నిర్దేశిస్తుంది. అంటే జీవానికి ప్రధాన అంశాలైన కాలమూ, శక్తి అనే ఈ రెండూ కూడా సూర్యుని వల్లనే నిర్దేశితమవున్నాయి.

సూర్యునిలాగా చంద్రుడు శక్తిని ప్రసరించ లేకపోయినా, భూమికి అతి సమీపంలో ఉండడం వల్ల మనపై చంద్రుడి ప్రభావం కూడా ఎక్కువే. అసలు మన పుట్టుకే చంద్ర గమనంపై ఆధారపడి ఉన్నది. చంద్రుని ప్రభావం కాంతి, శక్తి, ఉష్ణాలకు సంబంధించినది కాదు, అది అయస్కాంతపరమైనది. ఈ రోజు ఏదో ఒకదాని భ్రమణ, పరిభ్రమణాల వల్లనే విద్యుత్తు తయారవుతున్నది. అందుకు వేరే మార్గం లేదు. అదే విధంగా చంద్రుడు తన




ఫొటో: ఎస్.వి. నరేశ్‌బాబు, తాడేపల్లిగూడెం

భ్రమణ, పరిభ్రమణాల ద్వారా ఒక శకిక్షేత్రాన్ని ఏర్పరుస్తున్నాడు. తద్వారా మనపై ప్రభావం చూపుతున్నాడు. బయట నుంచి మన జీవితాన్ని ప్రభావితం చేసే వాటిని అర్థం చేసుకోవాలంటే సూర్యుడిని పరిగణనలోకి తీసుకోవాలి. అంతరంగంలో జరిగే దానిని అర్థం చేసుకోవాలంటే చంద్రుడిని పరిగణనలోకి తీసుకోవాలి.

మానవుని అంతరంగంలో జరిగే దానికి ఎక్కువ ప్రాముఖ్యమిచ్చే సంస్కృతులు సహజంగానే 'చాంద్రమాన క్యాలండర్'ను, లేక చాంద్రమాన ప్రభావం ఎక్కువ ఉన్న 'సౌర- చాంద్రమాన' క్యాలండర్‌ను అనుసరించాయి. భారతీయ సంప్రదాయ క్యాలండర్‌ను 'పంచాంగం' అంటారు. మనకు బాహ్య, అంతర్గత శ్రేయస్సులు రెంటిపైనా ఆసక్తి ఉంది కాబట్టి, మన పంచాంగం ఒక 'సౌర- చాంద్రమాన' క్యాలండర్. అది భూమి చుట్టూ జరిగే చంద్రుని గమనాన్నీ, సూర్యుని చుట్టూ జరిగే భూమి గమనాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ విధంగా క్యాలండర్ తయారుచేసుకోవడం చాలా ఉత్తమం. కానీ దురదృష్టవశాత్తూ అటువంటి క్యాలండర్ ఒకటుందని కూడా ఈ కాలంలో చాలామందికి తెలియదు.

ప్రపంచంలో అతి పురాతనమైన క్యాలండర్లలో ఇది ఒకటి. ఈ క్యాలండర్ పరంగా ఇప్పుడు మనం కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్నాం. కొత్త సంవత్సరం మొదటి రోజును 'ఉగాది' అంటాం. ఇప్పుడు భూమి సూర్యునికి అతి సమీపంలో ఉన్నది. ఎదగటానికి వేసవి అత్యంత అనుకూలమైనది. వృక్షజాతి అంతా వేసవిలోనే బాగా పెరుగుతుంది. భూమిపై ఉండవలసిన వాటినన్నిటినీ మనం నాశనం చేశాం కాబట్టి, ప్రస్తుతం వేసవి అంటే అత్యంత అసౌకర్యమైన కాలంగా మారింది. ఎరుకతో ఉంటే ఈ సమయమే మానవులకు కూడా ఎంతో మంచిది. మిమ్మల్ని మీరు మీకు కావలసిన విధంగా మలచుకోవడానికి కూడా ఇదే ఉత్తమమైన సమయం. ఇది ఉత్తరాయణ కాలం కూడా. అంటే భూమి పరంగా చూస్తే సూర్య గమనం ఉత్తరం వైపు ఉంటుంది. ఉత్తరార్ధగోళంలో ఉన్న మనకు ఈ సమయం ఎంతో ముఖ్యమైనది- ఆత్మ సాక్షాత్కారానికీ, ఆశయ సాధనకూ అనువైన సమయం ఇదే!

నిజానికి ఈ అనంత విశ్వంలో పాత సంవత్సరం, కొత్తసంవత్సరం అంటూ ఏమీలేవు. ఈ ఎల్లలన్నీ మనం మన జీవితం ఎలా సాగుతుందో చూసుకోవడానికి మనం ఏర్పరచుకున్నవే. క్రితం సంవత్సరంతో పోల్చుకుంటే ఒక మనిషిగా మనం పురోగమించామా లేదా గమనించాలి. మీ వ్యాపారం అభివృద్ధి చెంది ఉండవచ్చు. మీరు బాగా సంపాదించి ఉండవచ్చు. మీ అమ్మాయికి పెళ్లి చేసి ఉండవచ్చు. కానీ, అది కాదు అసలు విషయం. ఒక మనిషిగా క్రితం సంవత్సరం కన్నా కొద్దిగానైనా మెరుగయ్యామా, లేదా అన్నది చూసుకోవాలి. అలాగే వచ్చే సంవత్సరం కల్లా మీరు ఇప్పటికన్నా చాలా మెరుగైన మనిషిగా మారాలి. ఇంకా సంతోషంగా, శాంతంగా, ప్రేమగా ఉండే, అంటే అన్నిరకాలుగా ఉత్తమమైన మనిషిగా తయారవాలి. దానికి మీరేం చేయాలో మీరే నిర్ణయించుకోవాలి.



• సద్గురు జగ్గీవాసుదేవ్

పండుగ ప్రశస్తి

పురాణ... ఖగోళ పర్వం!

మనం ఉగాదిగా జరుపుకొంటున్న చైత్ర శుద్ధ పాడ్యమికి పౌరాణికంగా, ఖగోళ శాస్త్ర రీత్యా, చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ రోజు గురించి ఒక్కో గ్రంథం ఒక్కొక్క రీతిలో వివరించింది.

బ్రహ్మపురాణం: బ్రహ్మ ఆదిలో ఈ చరాచర సృష్టి అంతటినీ చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ప్రారంభించాడని 'బ్రహ్మ పురాణం' చెబుతోంది. అందుకే దీన్ని మానవ జాతి అంతా జరుపుకోవలసిన పర్వదినంగా పరిగణించవచ్చు.

నారద పురాణం: చైత్ర శుక్ల పాడ్యమి నాడు సూర్యోదయ సమయంలో, సూర్యుడు అధిదేవతగా ఉన్న కాలంలో, ఆదివారం రోజున బ్రహ్మ సృష్టిని బహిర్గతం చేసినట్టు 'నారద పురాణం' పేర్కొంటోంది.

మత్స్య పురాణం: విష్ణుమూర్తి మత్స్యరూపంలో సముద్రంలోకి చొచ్చుకువెళ్ళి, వేదాలను దొంగిలించిన రాక్షసుడిని సంహరించి, బ్రహ్మకు వేదాలను తిరిగి అందజేసిన శుభ దినం చైత్ర శుద్ధ పాడ్యమేనని 'మత్స్య పురాణం' వివరించింది.

రామాయణం: పధ్నాలుగు సంవత్సరాలు అరణ్య వాసం చేసిన శ్రీరాముడు- రావణ సంహారానంతరం సీతా లక్షణ సమేతంగా అయోధ్యకు తిరుగు ప్రయాణ సన్నాహం చేసిన రోజు చైత్ర శుద్ధ పాడ్యమేనట! అందువల్ల దీన్ని పుణ్య దినంగా పరిగణిస్తారు.

వసు చరిత్ర (భారతం): పురు వంశానికి చెందిన వసురాజు ఒక పర్యాయం వేటకు వెళ్తాడు. అక్కడ ధ్యాన నిష్టలో ఆయన ఉన్న సమయంలో ఇంద్రుడు ప్రత్యక్షమై, అతిలోక సుందరమైన విమానాన్ని, ఎప్పటికీ వాడని పూలదండను ఇస్తాడు. యుద్ధంలో వాటిని ఉపయోగించి, అజేయుడిగా నిలవాలని చెప్పి అంతర్ధానమవుతాడు. మహిమాన్వితమైన ఆ వస్తువులతో వసురాజు చైత్ర శుద్ధ పాడ్యమి నాడు తన పట్టణంలో ప్రవేశిస్తాడు. ఆ వస్తువుల మహిమను తెలుసుకున్న ప్రజలు ఇంద్రుని కీర్తిస్తూ పెద్ద ఉత్సవం నిర్వహిస్తారు. ఆ కారణంగా ఈ రోజును పర్వదినంగా పరిగణించారు.

ఖగోళ శాస్త్ర రీత్యా: సూర్యుడు చైత్ర శుద్ధ పాడ్యమి రోజున భూమధ్య రేఖపై ఉంటాడని ప్రతీతి. అందువల్ల ఈ రోజున ఉగాది- దిన, మాస, వర్షారంభాలు ఒకేసారి ఏర్పడతాయి.

విక్రమార్క పట్టాభిషేకం: పరాక్రమశాలి విక్రమార్క చక్రవర్తి శకులను ఓడించి, చైత్ర శుద్ధ పాడ్యమి నాడు పట్టాభిషిక్తుడయ్యాడు. విక్రమార్క శకం ఆనాడే ప్రారంభమయింది.

ఏ గ్రంథం ఏమని వివరించినా... ఒకటి మాత్రం నిజం. ఉగాది నవజీవనానికి నాంది!

• డాక్టర్ రాపాక ఏకాంబరాచార్యులు

రాజకీయాలా... తెలీదండీ!

నందమూరి కల్యాణ్‌రామ్



"నా భవిష్యత్తు (రాజకీయాలను ఉద్దేశించి) కోసం నేనేదో చూపించుకోవాలని ఈ సినిమాలో ఎలాంటి డైలాగులు, సన్నివేశాలు పెట్టించలేదు. ఏం చేసినా... జస్ట్ కథ కోసం, సినిమా కోసమే. సందర్భానుసారమే 'నేనింకా రాజకీయం చేయడం మొదలుపెట్టలేదు. మొదలుపెడితే... మీరు చేయడానికి ఏం మిగలదు' డైలాగ్ చెప్పా. (నవ్వుతూ...) వేరే విధంగా తీసుకోవద్దు" అన్నారు నందమూరి కల్యాణ్‌రామ్. ప్రచార చిత్రాల్లో డైలాగుల గురించి ప్రశ్నించగా ఆయన సమాధానమది. 'భవిష్యత్తులో రాజకీయాలలోకి వచ్చే ఆలోచన ఉందా?' అనడిగితే... "తెలీదండీ! సినిమాల్లో వరుసగా విజయాలు సాధించే ప్రయత్నం చేస్తున్నా" అని చెప్పారు. ఆయన హీరోగా నటించిన తాజా సినిమా 'ఎమ్మెల్యే'. మంచి లక్షణాలున్న అమ్మాయి... అనేది ఉపశీర్షిక. ఉపేంద్ర మాధవ్ దర్శకుడు. భరత్ చౌదరి, కిరణ్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 23న విడుదలవుతోన్న సందర్భంగా కల్యాణ్‌రామ్ చెప్పిన సంగతులు...

- (నవ్వుతూ...) ఈ నెల 23న మా 'ఎమ్మెల్యే' పోలింగ్ మొదలవుతుంది! ప్రేక్షకులు ఇచ్చే తీర్పూ అదే రోజు వచ్చేస్తుంది! అందుకని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. సినిమాలో నా పేరు కల్యాణ్. టైటిల్‌కి, క్యాప్షన్‌కి తగ్గట్టు పాత్ర చిత్రణ ఉంటుంది. మంచి అబ్బాయే కానీ... కొన్ని తప్పులు చేస్తాడు. వాటిని ఎలా సరిదిద్దుకున్నాడనేది చిత్రకథ. ఇందులో రాజకీయాలు ప్రస్తావన ఉంది. అలాగని, రాజకీయ చిత్రం కాదు. మంచి ప్రేమకథతో చిత్రం మొదలవుతుంది. విద్యా వ్యవస్థ గురించి చర్చించాం. సినిమా ముఖ్యోద్దేశం చదువే. తర్వాత రాజకీయాల వైపు మళ్ళుతుంది. దాన్నీ వినోదాత్మకంగానే చెప్పాం.

- కాజల్‌ను కథానాయికగా తీసుకోవాలనేది సమిష్టి నిర్ణయం. కొన్ని పాత్రలు కొంతమంది చేస్తే ప్రేక్షకులపై ప్రభావం ఉంటుంది. తన వల్లే హీరోలో మార్పు, ఆలోచన మొదలవుతుంది. తనది మంచి పాత్ర. ప్రచార చిత్రాల్లో రజనీకాంత్‌గారి తరహాలో చెప్పిన డైలాగులకు మంచి స్పందన వచ్చింది. అలా చెప్పాలనే ఆలోచన దర్శకుడిదే. తను మంచి రచయిత. కథను బాగా హ్యాండిల్ చేశాడు. ఇందులో నా బాడీ లాంగ్వేజ్ కొత్తగా ఉంటుంది. ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నా.

- నటుడిగా, నిర్మాతగా నా ప్రయాణంతో సంతోషంగా, సంతృప్తిగా ఉన్నా. నా సినిమాలు చూసి 'ఇదేంట్రా... చెత్తగా ఉంది' అని ప్రేక్షకులు ఎవరూ అనుకోలేదు. 'ఏదో ప్రయత్నించాడు' అనే పేరు తెచ్చుకున్నా. నాకు సూపర్‌డూపర్ హిట్లు లేకపోవచ్చు. కానీ... చెత్త సినిమా అయితే చేయలేదు. చేయను కూడా! నేను నిర్మాత అయితే... రెండు రూపాయలు ఎక్కువ ఖర్చు పెడతానేమో! అదే... బయట సంస్థలో చేస్తే బడ్జెట్ గురించి ఆలోచిస్తా. నా మార్కెట్ దృష్టిలో పెట్టుకుని చేస్తా.

- ఇంట్లోవాళ్ళు నా సినిమాల గురించి నిజాయితీగా చెబుతారు. వాళ్ళ కంటే గొప్ప విమర్శకులు ఎవరూ లేరు. తమ్ముడు తారక్ (ఎన్టీఆర్)తో కూడా ఎక్కువ సినిమాల గురించి చర్చిస్తా. లేదంటే కార్లు, సంగీతం! రాజకీయాల గురించి చర్చించడానికి మేమిద్దరం చాలా చిన్నవాళ్ళం. ఏవైనా వార్తలు వస్తే చూసి, మా పరిధిలో కొంతసేపు మాట్లాడుకుంటాం. తారక్ ఎక్కువ మ్యూజిక్ వింటాడు.

- నేనిప్పటి వరకూ పూర్తిస్థాయి ప్రేమకథా చిత్రం చేయలేదు. 'నా... నువ్వే'తో ఆ మాట వినబడదు. యూనివర్శల్ కథతో ఆ సినిమా చేశా. వేసవిలో విడుదలవుతోంది. సాయిధరమ్ తేజ్‌తో మల్టీస్టారర్ చేయాలనుకున్న మాట నిజమే. కానీ, కథ కుదరలేదు. ఏయస్ రవికుమార్ చెప్పిన కథ మా ఇద్దరికీ నచ్చలేదు. తర్వాత చేయబోయే సినిమా వివరాలు జూన్‌లో వెల్లడిస్తా. బహుశా... మల్టీస్టారర్ కావొచ్చు.

వసంత కోకిలలు

రాబోయే రోజు బావుంటే చాలు

- సమీరా భరద్వాజ్



తెలుగు సంవత్సరాది (ఉగాది) అనగానే మనందరికీ చాలా ప్రత్యేకమైన పండుగ. ఏడాది ప్రారంభం బావుంటే ఆ ఏడాదంతా బావుంటుందని మా ఇంట్లో నమ్ముతారు. ఉదయాన్నే గుడికి వెళ్లొస్తా. షడ్రుచులతో అమ్మ తయారు చేసిన ఉగాది పచ్చడి తింటాను. వేరే ఏ పనీ పెట్టుకోను. ఇంట్లో ఉండి రెస్ట్ తీసుకుంటా. కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతా. ఉగాది పచ్చడిలో నాకు తీపి, పులుపు కలిసిన రుచి అంటే చాలా ఇష్టం. నా లైఫ్ కూడా తియ్యగా సాగుతోంది. పుల్లగా నాటీగా కూడా ఉంది. గత ఉగాది నుంచీ నా కెరీర్ మలుపు తిరిగింది. సంగీత దర్శకులు రదన్, మిక్కీ జె మేయర్‌తో తొలిసారి పనిచేశా. గత ఏడాది నుంచి ఇప్పటి వరకూ పాడిన పాటల్లో 'శతమానంభవతి'లో 'నాలో నేను' పాట కోసం చాలా కష్టపడ్డా. 'చంపేశావే...'(నేను లోకల్), 'నాకే నే నచ్చేస్తున్నా...' (రాజా ది గ్రేట్), 'పరిచయం లేదా...' (మనసుకు నచ్చింది) తమిళంలో 'గులేబకావళి' సినిమాలో ఓ పాట చక్కని గుర్తింపు తీసుకొచ్చాయి. అసలు మరచిపోలేని జ్ఞాపకం అంటే 'అర్జున్‌రెడ్డి' సినిమా. అందులో 'మధురమే...' పాట పాడాను. సినిమాతోపాటు ఆ పాట కూడా పెద్ద హిట్ అయింది. ఆ చిత్రాన్ని పదమూడుసార్లు చూశా. ఈ రోజు కంటే రేపు బావుంటే చాలని ఉగాది సందర్భంగా కోరుకుంటా.

మరింత నిరూపించుకునేలా...

- సత్యా యామిని



షడ్రుచులున్న ఉగాది పచ్చడి అన్నా, ఆ పండుగ అన్నా నాకు చాలా ఇష్టం. ఆరు రకాల రుచులూ కలిస్తేనే ఉగాది పచ్చడికి అసలైన రుచి వస్తుంది. జీవితం కూడా అంతే. ఉగాది పచ్చడి తిన్నప్పుడు నోటికి ఏ రుచికి ఎక్కువగా తగిలితే ఆ ఏడాది మొత్తం అలా ఉంటుందనీ అంటారు. నాకు తీపి అంటే చాలా ఇష్టం. ఆరు పాటలు, పన్నెండు షోలతో నా కెరీర్ తియ్యగా సాగుతోంది. 'మమతల తల్లి ఒడి బాహుబలి' పాట పాడటం వల్ల ఎక్కడికి వెళ్లినా అదే పేరుతో ఆప్యాయంగా పలకరిస్తున్నారు. ప్లేబ్యాక్ అని కాకుండా మ్యూజికల్‌గా లైఫ్ చాలా ఆనందంగా సాగుతోంది. షోలు, ఇతర రికార్డింగ్‌లతో బిజీబిజీగా ఉన్నా. ఈ మధ్యనే. ఆర్.పి పట్నాయక్‌గారితో కలిసి 'నీతో ఏదో చెప్పాలని ఉంది...' అని ఓ ఆల్బమ్ చేశా. దానికి స్పందన బావుంది. నా పేరుతో యూ ట్యూబ్ చానెల్ స్టార్ట్ చేశా. నా ప్రతిభను మరింత నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్నా. ఇండిపెండెంట్ మ్యూజిక్ చేసి నా యూట్యూబ్ ఛానెల్‌లో విడుదల చేస్తా. అలాగే ఎం.బి.ఏ కంటిన్యూ కూడా చెయ్యాలనుకుంటున్నా.

శ్రియ... పెళ్లికూతురాయెనే!

మనం 'ఇష్టం'గా అభిమానించిన శ్రియ ఇప్పుడు శ్రీమతి శ్రియగా మారారు. ఈ నెల 12న మెడలో మూడు ముళ్ల వేయించుకుని ఇల్లాలి పాత్రలోకి షిఫ్ట్ అయ్యారు. అబ్బాయిది మన దేశం కాదు. రష్యా. అంటే శ్రియ ఇప్పుడు రష్యాకు కోడలన్నమాట. రష్యా క్రీడాకారుడు ఆండ్రీ కొశీవ్‌ను ఈ నెల 12న శ్రియ వివాహం చేసుకున్నారు. ఇరు వర్గాల కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఈ మూడుముళ్ల వేడుక జరిగింది. చిత్ర పరిశ్రమ నుంచి మనోజ్ భాజ్‌పాయ్, షబానా ఆజ్మీ హాజరైనట్టు సమాచారం. హిందూ సంప్రదాయం ప్రకారం జరిగిన వివాహ వేడుకలో శ్రియ గులాబి రంగు చీర కట్టుకున్నారు. ఆండ్రీతో శ్రియ ప్రేమవ్యవహారం గురించి పలుమార్లు వార్తలొచ్చాయి. అయితే శ్రియ వ్యక్తిగత జీవితాన్ని గురించి మాట్లాడటానికి ఇష్టపడేవారు కాదు. మార్చి 11న ఆమె ఇచ్చిన బ్యాచ్‌లర్ పార్టీ సంగతి కూడా బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. తెలుగులో ఆమె నటించిన 'వీరభోగ వసంతరాయలు' విడుదల కావాల్సి ఉంది. తమిళంలో 'నరగాసురన్', హిందీలో 'తడ్కా' విడుదలకున్నాయి.



శ్రియ



ఆండ్రీ కొశీవ్



సమంత, నాగచైతన్య

కలసి... మెలిసి!

కళ్లు కళ్లు ఎప్పుడో కలిశాయి. తర్వాత మనసులూ అదే బాట నడిచాయి. తర్వాత పెద్దల అంగీకారంతో నాగచైతన్య, సమంత మనువాడారు. తర్వాత ఇద్దరి కార్లు వెళ్ళే దారులు మాత్రం కలవలేదు. ఎవరి సినిమా షూటింగ్ కోసం వారు వేర్వేరు దారుల్లో వెళ్ళారు. కానీ, ఉగాదికి ముందు రోజు మాత్రం ఇద్దరూ ఒకే దారిలో ఒకే కారులో వెళ్లారు. "నిజంగా ఇది సరికొత్త రోజు. శ్రీమతితో కలిసి పని చేయడానికి కలిని బయలుదేరా. త్వరలో ఫన్ క్యాంపెయిన్ మీ (ప్రేక్షకుల) ముందుకు వస్తుంది" అని చైతన్య పేర్కొన్నారు.

డైలీ సుడోకు - 135

					4	9	1	
		9			3	5	2	
	5		1			8	4	
			3		6		8	
	7		2		9			
	3	7			8		6	
	8	5	4			7		
	1	4	7					

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 134 సమాధానం

8	3	1	9	5	4	2	6	7
5	9	4	6	7	2	1	3	8
6	2	7	3	1	8	9	4	5
2	4	3	7	8	6	5	1	9
1	8	9	2	3	5	6	7	4
7	6	5	4	9	1	8	2	3
4	7	6	5	2	9	3	8	1
9	1	2	8	4	3	7	5	6
3	5	8	1	6	7	4	9	2









SREE VYSHNAVEE CREATIONS
DR.SOWJANYA ATLURI PRESENTS
Production No.1
NARA ROHITH'S
#NR18
PB MANJUNATH NARAYANA RAO ATLURI
RAVEENDAR RICHARD PRASAD VIKAS KURIMELLA
NAVEEN NOOLI VAMSIRAJESH VAMSI SHEKAR
MOVIE LAUNCH
TODAY at 8:55 a.m.
Venue: Dhyana Buddha Statue,
Amaravathi, Andhra Pradesh


రోహిత్ సమర్పించు
ARAN MEDIA WORKS
FROM THE MAKERS OF
అప్పట్లో ఒకడుండేవాడు
నారాయణరావు అట్లూరి నిర్మాణం
శ్రీ వైష్ణవి క్రియేషన్స్
"ఏందిరా ఈ జనాల గోల"
ఉగాది శుభాకాంక్షలు
మార్చి 23 విడుదల
నీది నాది ఒకే కథ
వ్యక్తిత్వ వికాసం
నెంబర్ వన్ అవటం ఎలా ?
విజయానికి ఒక మెట్టు
గెలుపు గుర్రాలు
రచన - దర్శకత్వం వేణు ఊడుగుల
నిర్మాతలు ప్రశాంతి & కృష్ణ విజయ్.ఎల్


ఉగాది
శుభాకాంక్షలు
SHINE screens
కృష్ణార్జున యుద్ధం
వెంకట్ బోయనపల్లి సమర్పించు
మేర్లపాక గాంధీ
సాహు గారపాటి హరీష్ పెద్ది
#KRISHNARJUNAYUDHAM


POWER OF SHANKARA
SK PICTURES PRESENTS
ఉగాది
శుభాకాంక్షలు..
SHANKAR
శంభో శంకర
SREEDHAR .N
PRODUCERS Y. RAMANA REDDY (YCRR) - SURESH KONDETI


పల్లెటూరికి వినోదయాత్ర
ఉగాది
శుభాకాంక్షలు
మార్చి
23
విడుదల
అనగనగా ఒక ఊళ్లో...


FROM THE DIRECTOR OF RANGITARANGA
RELEASING ON
23RD
MAR
ఉగాది
శుభాకాంక్షలు
RANA AS
రాజరథం
A FILM BY ANUP BHANDARI
RAJARATHAM


RAJ FINDS SOLUTION FOR ORPHANS
MAHESH KHANNA
PRABHAS ADUSUMELLI VIJAY KUMAR
ఉగాది
శుభాకాంక్షలతో
త్వరలో


RISE UP
పసిఫిక్ రిమ్
తిరుగుబాటు
PACIFIC RIM
UPRISING
MARCH 23 IN 3D & 2D


M E G A P O W E R S T A R
MYTHRI MOVIE MAKERS
ఉగాది శుభాకాంక్షలు
నేడే
ప్రీ రిలీజ్ ఫంక్షన్
ఆర్కే బీచ్, వైజాగ్,
సా॥ 5 గం॥ లకు
రంగస్థలం
AUDIO SUPERHIT
SUKUMAR
NAVEEN YERNENI Y RAVI SHANKAR MOHAN (CVM) DEVI SRI PRASAD RATNAVELU ISC
PRAVEEN M NAVEEN NOOLI RAMAKRISHNA MONIKA RAM LAXMAN CHANDRABOSE CHERRY V Y PRAVEEN KUMAR THOTA SRINIVAS
KASI VISHAL BUCHI BABU SANA SRI NIVAS RONGALI


TRIDENT ARTS
NORTHSTAR ENTERTAINMENT PVT. LTD.
HIGHLY ACCLAIMED AWARD WINNING FILM
ఉగాది శుభాకాంక్షలతో
RUNNING SUCCESSFULLY
LADY SUPERSTAR Nayanthara
in
కర్తవ్యం
PRODUCERS
SHARRATH MARAR - R. RAVINDRAN
WRITTEN & DIRECTED BY
GOPI NAINAR
EXECUTIVE PRODUCER M.SRINIVASA RAO
PETER HEIN GHIBRAN RUBEN OMPRAKASH LALGUDI N ILAYARAJA GULABI SRINU
RAJESH M. MURTHY UMA DEVI RAVI RANGANATHAN RAJU RAJA KRISHNAN NAREN-MURTHY S. KALAI SELVAN PRO. SKN
think music
SINDHU GRAFIX



T G VISHWA PRASAD
PRESENTS
BLUE PLANET
Entertainments
people MEDIA FACTORY
మార్చి 23 విడుదల
ఉగాది శుభాకాంక్షలు
MLA
మంచి లక్షణాలున్న అబ్బాయ్
WORKING TITTLE
KIRAN REDDY
BHARATH CHOWDARY
UPENDRA MADHAV
VIVEK KUCHIBHOTLA
MANI SHARMA
PRASAD MURELLA
TAMMIRAJU
KIRAN KUMAR
PRAVEEN VARMA
U/A
ADITYA MUSIC



తెలంగాణలో ఆంధ్రా రిలీవ్ ఉద్యోగుల బదిలీ

హైదరాబాద్, కేటీపీఎస్ (పాల్వంచ), మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రెండున్నరేళ్లుగా ఎలాంటి బాధ్యతలు నిర్వర్తించకుండానే వేతనాలు పొందిన ఆంధ్రా ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ టీఎస్ జెన్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తెలంగాణ ఇంజనీర్ల ఉద్యమానికి తాత్కాలిక విరమణ ప్రకటించారు. కాగా, ఏపీ స్థానికత కారణంగా రిలీవ్ చేసిన ఉద్యోగులకు తెలంగాణలో పోస్టింగులు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. జెన్‌కోలో ఇప్పటికే 484 మందికి పోస్టింగ్ ఇవ్వగా.. శనివారం 262 మంది ఉద్యోగులకు పోస్టింగులు ఇస్తూ ట్రాన్స్‌కో అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఎస్పీడీసీఎల్ (హైదరాబాద్)లో 303 మందికి, ఎన్‌పీడీసీఎల్‌లో 83 మందికి సోమ లేదా మంగళవారాల్లో పోస్టింగులు ఇచ్చే అవకాశాలున్నాయి. ఈ పోస్టింగులపై తెలంగాణ విద్యుత్ ఉద్యోగ సంఘాలు భగ్గుమన్నాయి. ఈ నెల 20న చలో విద్యుత్ సౌధ నిర్వహించనున్నట్లు తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు.

దుంప సాగుకు ఏపీ అనుకూలం

- మంత్రి సోమిరెడ్డితో ఐఆర్ఐ ప్రతినిధులు

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అధిక వేడిని తట్టుకునే.. వ్యాధి నిరోధక శక్తి కలిగిన 'కుఫ్రి లీమా' అనే రకం బంగాళదుంప సాగుకు ఏపీ అనుకూలంగా ఉంటుందని అంతర్జాతీయ బంగాళదుంప పరిశోధన సంస్థ (ఐఆర్ఐ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ బార్బరావెల్స్, ఆసియా రీజనల్ డైరెక్టర్ సమరేందు మొహంతి వివరించారు. ఈ మేరకు ఏపీ వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. బంగాళదుంప, చిలకడ దుంపల సాగు, కొత్త వంగడాలు, పరిశోధన అంశాలపై మంత్రి వారితో చర్చించారు. దీనిపై మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తిస్తామని చెప్పారు. రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

ఏప్రిల్ నుంచి కొత్త పెన్షన్లు!

మూడు లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా.. 50 లక్షలకు చేరుకోనున్న లబ్ధిదారులు

- 'జన్మభూమి' దరఖాస్తుల నిశిత వడపోత
- ప్రజాసాధికార సర్వే ఆధారంగా గుర్తింపు

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద మరో మూడు లక్షల మందికి సామాజిక పెన్షన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు'లో స్వీకరించిన దరఖాస్తులను సెర్ప్ విభాగం పరిశీలించి ఇప్పటికే పింఛను అర్హులను గుర్తించింది. రాష్ట్రంలో సుమారు మూడు లక్షల మందిని అధికారులు కొత్తగా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఈ లెక్కన సామాజిక పింఛన్లు పొందుతున్నవారి సంఖ్య 48 లక్షలకు చేరనుంది. కొత్తగా కళాకారులకు, ట్రాన్స్‌జెండర్లకు పెన్షన్‌ను వర్తింపజేయడం, 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకూ ఈ లబ్ధిని అందించాలని నిర్ణయించిన దరిమిలా.. మొత్తం సామాజిక పింఛన్లు 50 లక్షలకు చేరుకోనున్నాయి. నిజానికి, ఉగాది నుంచి కొత్త పెన్షన్లు ఇస్తామని గతంలో ముఖ్య మంత్రి చంద్రబాబు చెప్పారు. అయితే, నెల మధ్యలో పింఛన్లు పంపిణీ చేయడం వల్ల ఇబ్బందులుంటాయని అధికారులు ఆలోచించారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి కొత్త పింఛనుదారులకు లబ్ధిని అందించాలని నిర్ణయించారు. నిజానికి, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు వేల పెన్షన్లు ఇవ్వాలని లోగడ అనుకొన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 3.50 లక్షల పెన్షన్లు వచ్చే అవకాశముంది. అయితే 3 లక్షల పెన్షన్లు ఇవ్వడానికి నిర్ణయించారు.

ఎంపిక ఇలా..

గతంలో రేషన్‌కార్డు, ఆధార్ కార్డులను ఆధారంగా పెన్షన్లు పంపిణీ చేశారు. తాజాగా ప్రజాసాధికార డేటా ఆధారంగా దరఖాస్తులు పరిశీలించినట్లు తెలుస్తోంది. సెర్ప్ కార్యాలయంలో సెంట్రల్ సర్వర్ ద్వారా దరఖాస్తులను పరిశీలించి ఆయా నియోజకవర్గాలవారీగా అర్హులను గుర్తించారు. ఒక కుటుంబంలో వికలాంగులతో పాటు మరోకరికి కూడా అర్హత ఉంటే, ఇద్దరికీ పెన్షన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, కల్లుగీత, కళాకారులు, డయాలసిస్ రోగులు.. మొత్తం 44,44,508 మందికి ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తోంది.

ఉన్నత విద్యామండలికి బడ్జెట్‌లో 'సున్నా'

- 2.53 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన
- ఒక్కరూపాయీ కేటాయించని ఆర్థిక శాఖ

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి 2018-19 వార్షిక బడ్జెట్‌లో ఒక్కరూపాయి కూడా కేటాయించక పోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. గత 30 సంవత్సరాల్లో ఎప్పుడూ జీరో బడ్జెట్ చూపలేదు. 1988లో మండలిని ఏర్పాటు చేసినప్పటి నుంచి కూడా సిబ్బంది జీతాల చెల్లింపుల నిమిత్తం గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నిధులను కేటాయిస్తున్నారు. 2016-17లో మండలికి బడ్జెట్‌లో రూ.1.45 కోట్లు కేటాయించగా.. ఆ మొత్తాన్ని 2017-18లో రూ.2.13 కోట్లకు పెంచారు. సిబ్బంది జీతాలతో పాటు ప్రభుత్వ సూచనల మేరకు మండలి ఏర్పాటు చేసే వివిధ కమిటీలకు అవసరమయ్యే చెల్లింపులను కలిపి ఈసారి రూ.2.53 కోట్లు ఇవ్వాలంటూ ఉన్నత విద్యా మండలి ప్రతిపాదించింది. ఆర్థిక శాఖ మంత్రి వద్ద కూడా గ్రాంట్ గురించి ప్రస్తావన వచ్చింది. కానీ, బడ్జెట్ కేటాయింపుల్లో మొండి చేయి చూపడంతో ఆయా వర్గాలు కంగుతిన్నాయి. విద్యాశాఖ ఈ విషయమై మళ్లీ ఆర్థికశాఖకు ఫైలు పంపించింది. అయినప్పటికీ ఎలాంటి స్పందనా కనిపించలేదు. సిబ్బంది జీతాల చెల్లింపులకు మాత్రమే ప్రభుత్వం సహాయక గ్రాంట్ కేటాయిస్తుంటుంది.ఇతర ఖర్చులన్నింటికీ మండలి సొంతంగా నిధులను సమకూర్చుకుంటూ వస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్) నిర్వహణ నిమిత్తం విద్యార్థుల నుంచి వసూలు చేసే మొత్తం, కొత్త డిగ్రీ కాలేజీలు, కోర్సులకు అనుమతుల ద్వారా కొంత మొత్తం ఉన్నత విద్యామండలికి వస్తుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు చెల్లింపులు చేస్తున్నారు. గత ఏడాదిలో.. ఉన్నత విద్యా మండలి నిధుల నుంచి బ్రిటిష్ కౌన్సిల్‌కు రూ.13 కోట్లు చెల్లించాలని, అలాగే, తాజాగా ఆచార్య నాగార్జున వర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్(ఐఈఏ) సదస్సుకు అయిన ఖర్చు రూ.5 కోట్లను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇలా మండలికి సమకూరిన డబ్బు ఎప్పటికప్పుడు హరించుకుపోతోంది. రాష్ట్ర విభజనకు ముందు వరకు మండలి ఖజానాలో సమృద్ధిగానే నిధులు ఉండేవి. కానీ, 2015లో చోటుచేసుకున్న విభజన సమస్యల కారణంగా ఇబ్బందులు అనివార్యంగా మారాయి. ఏపీ-తెలంగాణ మధ్య నిధుల పంపిణీ కాకపోవడంతో ఉన్న కొద్దిపాటి నిధులను కూడా జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఉన్నత విద్యామండలి అధికారులు కోరుతున్నారు.

ధర్మంతోనే జయం

- స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు: జస్టిస్ బాబ్డే
- జస్టిస్ చలమేశ్వర్ నుంచి ఎంతో నేర్చుకున్నా: జస్టిస్ నాగేశ్వరరావు


జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే


జస్టిస్ లావు నాగేశ్వరరావు

ఆంధ్ర విశ్వవిద్యాలయం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బలవంతుల నుంచి బలహీనులను ధర్మం రక్షిస్తుందని, ఒకరి స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే అన్నారు. శనివారం విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల నిర్వహించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ ధర్మనిధి ప్రసంగంలో 'రూల్ ఆఫ్ లా' అంశంపై ఆయన ప్రసంగించారు. ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ జయం కలుగుతుందని చెప్పారు. జీఎంసీ బాలయోగి, ఎర్రన్నాయుడు వంటి పూర్వవిద్యార్థులు వర్సిటీకి ఎంతో పేరు తెచ్చారని, జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఏయూ పూర్వవిద్యార్థి కావడం గర్వకారణమన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ జస్టిస్ చలమేశ్వర్ నుంచి ఎన్నో విషయాలను నేర్చుకున్నానన్నారు. ధర్మనిధి ప్రసంగాన్ని ఏర్పాటుచేసిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను న్యాయమూర్తులు అభినందించారు ఉపకులపతి జి.నాగేశ్వరరావు, రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషలోనే వాదోపవాదాలు

- అప్పుడే కేసుల సత్వర పరిష్కారం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ



పార్వతీపురం/టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో కేసులు త్వరగా పరిష్కారం కావాలంటే మాతృభాషలోనే వాదోపవాదాలు జరగాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలో రూ.5.22 కోట్లతో నిర్మించిన నూతన కోర్టుల సముదాయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురజాడ, ఆదిభట్ల, కోడి రామ్మూర్తి వంటి మహనీయులకు జన్మనిచ్చిన గడ్డ విజయనగరం జిల్లా అన్నారు. న్యాయం కోసంవచ్చే పేదలకు న్యాయవాదులు పరిపూర్ణంగా సేవలు అందించాలన్నారు. రాజీ మార్గం రాజా మార్గం అన్న నినాదంతో న్యాయవాదులు పనిచేయాలని సూచించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రజని, రిజిస్ట్రార్ మానవేంద్రనాథ్‌రాయ్, జిల్లా జడ్జి గిరిధర్, కలెక్టర్ వివేక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వధువు కావలెను




★ విడో/48/కుల ప్రసక్తి లేదు, రైల్వే జాబ్, 50,000/- డైరెక్ట్ సంప్రదించగలరు. ఫోన్ : 8825765677 AJH-158

★ చాకలి/ డైవర్సీ/ 46/ ఎంబీఏ/ రియల్ ఎస్టేట్ / కుల, కట్న ప్రసక్తి లేదు/ డైరెక్ట్. ఫోన్ 9573293378 AJM-369

★ బలిజ/38/5'6"/డైవర్స్/బిజినెస్, ఎరుపు రంగు వరునకు B.C / O.C. సాంప్రదాయమైన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్. సంప్ర: 9440057109. AJR-433124

★ నాయుడు/49/ H.T 5"10, లేట్ మ్యారేజ్ నేచర్ క్యూర్ ఫిజియో థెరపీ/సొంత హెల్త్ సెంటర్ కోసం సపోర్టు ఇచ్చే/C.N.B/A.G.N.B, A.P&T.S డైరెక్ట్ ఫోన్: 7030448819 AJO-446195

వరుడు కావలెను



★ కమ్మ/లేట్ మ్యారేజ్ /50/5'4"/Diploma/Hyd లో సివిల్ ఇంజినీర్, 1L PM, సొంత ఇల్లు రెంట్స్/వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912038880 AJH-157

★ రెడ్డి/లేట్ మ్యారేజ్ /42/5'4"/M.Sc, B.Ed/ B.C వెల్ఫేర్ ఆఫీసర్, ఆంధ్రా/Fair, సొంత ఇల్లు రెంట్స్/వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9394288881 AJH-157

★ కమ్మ/విడో/48/5'4"/BA/ రాజమండ్రిలో ల్యాండ్స్ లీజ్, స్కూల్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ 1L PM వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912916046 AJH-157

★ రెడ్డి/విడో/40/5'4"/డిగ్రీ/Hydలో Sr. Asst. In Construction, Hydలో వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9948070006 AJH-157

★ నాయుడు/లేట్ మ్యారేజ్/ 29/ 5'4"/ ఇంటీరియర్ డిజైనర్, ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 8790788977 AJH-157

★ కుల, ఆస్తి, ప్రసక్తిలేదు /విడో/37/ 5'4"/ ఫెయిర్, క్లాత్స్ బిజినెస్ ల్యాండ్స్ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7893575126 AJH-157

★ నాయుడు/లేట్ మ్యారేజ్/29/ 5'2"/ గవర్నమెంట్ టీచర్/ అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 7659921467 AJH-157

★ వైశ్య/విడో/38/M.Com, బ్యాంక్ జాబ్, Govt. OIL బిజినెస్, రెంట్స్, 20ఎ. ల్యాండ్, వధువుకి FC/BC వరుడు కావలెను. ఫోన్: 9989394054 AJH-157

★ యాదవ్/విడో/40/5'4"/Govt. జాబ్, సొంత ఇల్లు & రెంట్స్, 15ఎ. పొలాలు, కుల, ధన ప్రసక్తిలేని FC/BC వరుడు కావలెను. ఫోన్: 9502993350 AJH-157

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు/విడో/58/ గవర్నమెంట్ రిటైర్డ్ (పెన్షనర్) భాదర బందిలేని వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8499909096 AJH-157

★ BC/విడో/58/5'5"/Fair, డిగ్రీ, ఫ్యామిలీ పెన్షనర్/ సొంత బిజినెస్ & సొంత ఇల్లు 60 K, PM, వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9573380048 AJH-157

★ FC/విడో/60/5'4"/ Fair, ఇంటర్ Govt. పెన్షనర్/ 2 ఇళ్ళు, ఓపెన్ ప్లాట్ 65K PM, వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9666196882 AJH-157

★ కమ్మ/విడో/50/5'4"/ డిగ్రీ, ప్రైవేట్ జాబ్/ రెంట్స్, 3ఎ. వరి పొలము, 40,000/- PM, వధువుకు వరుడు కావలెను. ఫోన్:9705349133 AJH-157

★ కాపు/విడో/51/5'3"/ గవర్నమెంట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్, పిల్లలు లేరు, సొంత ఇల్లు 15 ఎ. పొలం గల మహిళకు వరుడు కావలెను. ఫోన్:9985768035 AJH-17157

★ కమ్మ/ 45/ 5'2"/ రైల్వే ఇంజినీర్ 85000/- PM, సొంత ఇల్లు పిల్లలు లేని మహిళకు వరుడు కావలెను. ఫోన్: 9985768035 AJH-17157

★ వైశ్య/విడో/46/5'3"/ Fair, డిగ్రీ, ఫార్మా కంపెనీ, రైస్‌మిల్లు, వరుడు కావలెను. (నో మీడియేటర్స్) ఫోన్: 9515552539 AJH-17157

★ రెడ్డి/విడో/46/సొంత పర్నీచర్ షోరూం/ లేడీస్ హాస్టల్, ఆంధ్రాలో ప్రాపర్టీ/3L PM, ఆస్తిగల వధువుకు వరుడు కావలెను. నో బ్రోకర్స్. ఫోన్: 9581776711, 9581151051 AJH-17157

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు/46/5'4"/ డిగ్రీ, Govt. Job, VRS, Agrcul. Lands, సొంత ఇల్లు, బిజినెస్, వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8187873088 AJH-82

★ చౌదరి/విడో/48/5'5"/ సెంట్రల్ Got. Job, VRS, ఆంధ్రాలో, చెరుకు వరి, పొలాలు, కమర్షియల్ కాంప్లెక్స్, వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 7659864753 AJH-82

★ పద్మశాలి/విడో/48/5'4"/ PG/Govt. Job/ VRS, సొంత ఇల్లు, బిజినెస్, వెల్‌సెటిల్డ్ ప్రాపర్టీ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8179390318 AJH-82

★ రెడ్డి/విడో/48/5'4"/B.Sc/Govt. Job/VRS, సొంత ఇల్లు, సొంత బిజినెస్, వెల్‌సెటిల్డ్, 3L PM, 5 కోట్ల ప్రాపర్టీ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9704442356 AJH-82

★ కమ్మ/విడో/34/5'5"/M.Sc/B.Ed. Govt. లెక్చరర్ గుంటూరులో పండ్ల తోటలు బిజినెస్ గల వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:9133741875 AJH-157

★ రెడ్డి/విడో/46/BA సిమెంట్ ఫ్యాక్టరీ 3 LPM, 10 కోట్లు ఆస్తి కల్గిన వధువుకి వరుడు కావలెను (CNB) నో బ్రోకర్స్ ఫోన్: 9985035976, 9703238657 AJH-427148

★ కాపు/విడో/35/Fair డిగ్రీ సొంత వైన్‌షాపు 2LPM, 7కోట్లు ఆస్తి కల్గిన వధువుకి వరుడు కావలెను (CNB) అర్జెంట్ ఫోన్: 9703247793, 8142079654 AJH-427148

★ కమ్మ/ విడో/ 48/ 5'4"/ Fair ఫ్యామిలీ పెన్షనర్ బిజినెస్ 1LPM, వెల్ సెటిల్డ్ సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8125469489 AJH-157

★ గౌడ/35/5'5"/M.Sc బిజినెస్ 1.5 PM, 2 కోట్ల ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9032629804 AJH-157

★ కమ్మ/ విడో/ 45/ Govt. Employee, ఆంధ్రాలో 20 ఎకరములు పండ్ల తోటలు వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9032924623 AJH-157

★ పద్మశాలి/ విడో/ 42/ B.Com/Govt. Job, 40,000/- విజయవాడలో సొంత ఇల్లు, సొంత బిజినెస్ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7799284519 AJH-411646

★ కాపు/ డైవర్సీ/ 29/ 5'3" సొంత మొబైల్ షోరూం అందమైన వధువుకు కుల పట్టింపులు లేని వరుడు కావలెను. హైదరాబాద్‌లో సొంత ఇల్లు. ఫోన్: 9581108427 AJH-411646

★ కమ్మ/ విడో/ 32/ 5'4" సొంత క్యాటరింగ్ & నర్సరి, అందమైన వధువుకు కుల పట్టింపులు లేని వరుడు కావలెను. ఫోన్: 9581293717 AJH-411646

★ రెడ్డి/ డైవర్సీ/ 31/ 5'5" ఫెయిర్ సొంత సిల్వర్ బిజినెస్ వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 9581106196 AJH-411646

★ రెడ్డి/ విడో/ 56/ 5'3" బిజినెస్/రెంట్స్/ వెల్‌సెటిల్డ్ గల వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు ఫోన్: 9581949563 AJH-157

★ రెడ్డి/ విడో/48/ 5'4"/M.Com/Govt.Job రెంట్స్/70K PM, 2ఎ. పొలము కల వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు ఫోన్: 9705205253 AJH-157

★ హిందూ మాల:23Y, B.Tech, SWE, Infosys (Hyd) జాబ్ జీతం: 60వేలు గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/డాక్టర్ జాబ్/ ఇతర స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న హిందూ లేక క్రిస్టియన్ వరుడు కావలెను. డైరెక్ట్ : ఫోన్: 9121191105. AJG-457068

★ చౌదరి, 27 years, 1st Marriage, Full fair, 5.5 Hight, B.Tech, కుల, ఆస్థి ప్రసక్తి లేదు. 22Crs ఆస్థి గల వధువుకు వరుడు కావలెను. Whatsapp 8341737192 AJG-1862

★ చౌదరి విడో/32 సం॥, 5'4"; MBA, ఫుల్‌ఫెయిర్, పిల్లలు లేరు, 18 కోట్ల ఆస్థి, భర్తను కోల్పోయిన వధువుకు 1,2 వరుడు కావలెను. Whatsapp 8367421959 AJG-1863

★ చౌదరి/25 సం॥, 5'4"; B.Tech, ఫుల్‌ఫెయిర్, 15 కోట్ల ఆస్థి, కుల పట్టింపు లేదు. అందమైన వధువుకు వరుడు కావలెను. Whatsapp 8341730029. AJG-1864

★ మాల, క్రిస్టియన్ రెండవపెళ్లి 29 సం॥ / 5.2 / బ్యాంక్ జాబ్ / జీతం 35 వేలు వధువుకు తగిన వరుడు కావలెను. సంప్ర॥ 70131 90895 AJY-447195

★ కాపు/ 27 సం॥/5'5"/ కోట్ల స్థిర ఆస్తి తల్లిదండ్రులు లేని వధువుకి కుల ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. Ph/ Whtsapp: 9502554983 AJA-455410

కళ్యాణ వేదిక

★ సూజిత్ మ్యారేజ్ బ్యూరో / అన్ని కులాల వారికి వయసుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీ. ఫ్రీ, పు. సర్వీస్ చార్జ్ ఓన్లీ ఫోన్:7893688483 AJH-5342

★ ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటి: తెనాలి (గుంటూరు జిల్లా) గత 6సం॥గా అత్యధిక ప్రొఫైల్స్‌తో ఘనంగా వివాహ పరిచయవేదిక కార్యక్రమము నిర్వహించియున్నాము. మా సప్తమ వివాహ పరిచయ వేదిక ది. 29/4/2018 ఆదివారం ఉ.9గం॥ నుండి సా.5గం॥ వరకు నిర్వహించ బడును. Cell: 9963924665, 7207057000. AJG-457067

★ శ్రీ గణేష్ మ్యారేజ్ బ్యూరో (1వ) అన్నికులాల, మతాల వారికి 1వ, 2వ, విడో, డైవర్సీ, దేశ, విదేశీ సంబంధాలు వెంటనే వ్యక్తి గత శ్రద్ధతో కుదుర్చుదును. ఫోన్: 7660971900, Email: devirazia@gmail.com AJH-157

★ కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో 1వ, 2వ లేట్ మ్యారేజెస్ డైవర్సీస్ విడో విడోవర్స్ పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా సంబంధాలు కుదుర్చబడును. (స్త్రీలకు ఫ్రీరిజి..) ఫోన్: 7416303057 AJH-157

★ సెకండ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. ఫోన్: 8555980066, 8328388014 AJH-157

★ గంగపుత్రుల పెళ్లి సంబంధాలకై శ్రీ గంగాభవాని గంగపుత్రుల వివాహ పరిచయాలు అగ్నికుల క్షత్రియ బెస్త గూండ్ల, జాలరి వాడబలిజ & ఇతరత్ర అంబర్‌పేట్, హైదరాబాద్ ఫోన్: 9000541008 AJH-157

★ Whats App Your photo & Bio - Data to 9347262769 we will send the Suitable Matches www.pellisandadi.com, ESTD - 1991 AJH-157

శ్రీ పర్వతనేని మ్యారేజ్‌బ్యూరో

కమ్మవారికి మాత్రమే (హైదరాబాద్ -విజయవాడ)

రాజశేఖర్: 8143436464, Hyd: 8143438383, VJA:8143436363, 8143536363, email : spmbhyd@gmail.com, Whats App No : 8143438383

వరుడు కావలెను

★ కమ్మ (Business): 22/5'5" V.Fair, MBA, 80 Cr. Hyd. ★ 27/ 5'8" V.Fair, CA 50 Cr. Hyd. ★ 25/ 5'6", V. Fair, MBA 100 Cr. Ph: 8143438383

★ కమ్మ (Doctor): 25/5'6" V.Fair, MBBS, 80 Cr, Hyd. ★ 25/ 5'7" V.Fair, MBBS, 30 Cr. Hyd ★ 26/5'7", V. Fair, MBBS, 40Cr. Ph: 8143438383

★ కమ్మ (Doctor): 26/ 5'5" V.Fair, MD (Dermatology) 15 Cr. Hyd. ★ 27/ 5'4" V.Fair, MD (Paediatric) 7Cr. ★ 26/ 5'5", V. Fair, MS (OBG) 20Cr. Ph: 8143436464

★ కమ్మ (USA): 26/ 5'7", V.Fair, MS, $105K, 25 Cr. ★ 25/5'4" V.Fair, MS, $ 70K, 10Cr. ★ 25/ 5'8", V.Fair, MS, $90K, 7Cr. Ph: 8143438383

★ కమ్మ (USA): 26/ 5'6" BE (Bits) MS (CMU) $110K, Deloitte. ★ 24/ 5'4" V.Fair, MS $ 70K, 15Cr. ★ 28/ 5'7", V.Fair MS $110K, 10Cr. Ph: 8143436363

★ కమ్మ (USA): 25/ 5'5" V. Fair, MS, $80K, 25Cr. ★ 26/ 5'7" V. Fair, MS, $ 90K 5Cr. ★ 26/ 5'7", BE(IIT) Ph.D, $150K, 5Cr. Ph: 8143438484

★ కమ్మ (USA): 24/ 5'6" V.Fair, Medicine (USA) 15Cr. ★ 25/ 5'7" V.Fair, Medicine (USA) 15Cr. ★ 24/ 5'4", Residency (USA) 15Cr. Ph: 8143438383

★ కమ్మ (INDIA): 24/ 5'8" MBA (IIM) 15LPA, 25Cr. ★ 24/ 5'6" M.Tech, MBA (IPE), 7Cr, Hyd. ★ 23/ 5'5", M.Tech MBA, 30Cr. Ph: 8143436464

★ కమ్మ (INDIA): 23/ 5'4" V.Fair, BE, MBA, 19LPA, 8 Cr. ★ 25/ 5'6" V.Fair, MBA (IBS), 9LPA, 10Cr. ★ 28/ 5'5", BE, MBA 6L PA, Hyd. 5 Cr. Ph: 8143436363

★ కమ్మ (INDIA): 22/ 5'3" V.Fair, MS (IIIT), 6LPA, 25Cr ★ 24/ 5'5" BE/Preparing Civils, 25Cr. ★ 26/ 5'5", V.Fair BE, 20Cr. Ph: 8143436464

★ కమ్మ (Divorce): 26/ 5'6"/V.Fair, B.E 7LPA, 3Cr. B'lore. ★ 29/5'4"/MS $90K, 15Cr. ★ 26/5'8"/V.Fair/MS, $70K, 10Cr. Ph: 8143438383.

వధువు కావలెను

★ కమ్మ(Doctor): ★ 26/ 6'2" V.Fair MS (GS) 30Cr. ★ 28/ 5'8" DM (Ortho Plastry), 20Cr. ★ 28/ 5'11" V.Fair, MD (GM), 25Cr. Ph:8143438383

★ కమ్మ (Business): 27/ 5'8", BE, (Bits) Business 200Cr, Hyd. ★ 26/ 5'11", V.Fair, MBA(USA) Business, 150Cr. Hyd ★ 27/ 6'0", V.Fair. BBM, Business, 100Cr. Ph : 8143438383

★ కమ్మ (Business) : 29/5'9", MBA(UK), Business 30Cr. B'lore. ★ 28/5'9", V.Fair, BE 20LPA, 20Cr. Hyd ★ 27/ 5'10", V.Fair, MBA Business, 100Cr. B'lore Ph: 8143438383

★ కమ్మ (USA): 26/6'0", BE (Bits) MS, $105K, 50Cr. ★ 25/6'2", BE (Bits) MS, $130K, Intel, 30Cr. ★ 27/5'10", MS, $110K, 50 Cr Ph : 8143438484

★ కమ్మ (USA) : 27/6'0", MS, $100K, Intel 30 Cr. ★ 26/5'10", MS $ 80K, 25Cr. ★ 28/5'10", BE(IIT) MBA(IIM) Microsoft, 15 Cr. Ph : 8143436464

★ కమ్మ (India): 28/5'11", MBA (ISB) 24LPA, Hyd 15Cr. ★ 28/6'0", BE, (NIT) 60LPA, Hyd ★ 29/ 6'2" MS, (USA) 22LPA, 5Cr, Hyd Ph : 8143436363

★ కమ్మ (India): ★ 27/ 6'0" MS(USA), 12LPA, 15Cr. ★ 29 6'0" BE 22LPA, Hyd. 10 Cr. ★ 24 5'11" BE, 7.3 LPA, 5Cr. Hyd ★ Ph: 8143436464

★ కమ్మ (India): ★ 27/5'7" MBA(IIM), 9LPA, 3Cr. ★ 26/5'9" M.Tech, 14LPA, Hyd, 5Cr. ★ 26 5'8" BE(Bits) 13 LPA, Hyd, 10Cr. Ph: 8143438484

★ కమ్మ (Govt): ★ 28/5'7" M.Tech (IIT) IRS, 5Cr. ★ 30/6', MBA 20LPA, Central Govt, 5Cr. ★ 26/5'11" BE, 9LPA, Central Excise 2Cr. Ph: 8143438383

★ కమ్మ (Divorce): ★ 29/6'2" MBA (Bits) 45 LPA, B'lore, 10Cr. ★ 32/5'8" MD (Paediatrics), 2LPM, 20 Cr. ★ 28 5'11" M.Tech & B.E (IIT) 26LPA, 15Cr. Ph: 8143436464

★ కమ్మ (Divorce): ★ 32/6', MBA, 25LPA, 8 Cr. ★ 30/5'8" MBA, Business, 2Laks P/M, 25Cr. ★ 30/6', MBA, Business, 45Cr. Hyd. Ph: 8143438383

అన్నపూర్ణ మ్యారేజెస్

● అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధములు కుదర్చబడును ●

www.annapurnamarriages.com

గుంటూరు హెడ్ ఆఫీస్ - 9397979718, విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ - 83673 44466, ఒంగోలు బ్రాంచ్ ఆఫీస్ - 93937 63666, తెనాలి బ్రాంచ్ ఆఫీస్ - 99851 44113, నెల్లూరు బ్రాంచ్ ఆఫీస్-93979 79760

పెళ్ళి కావలసిన వరుడు, వధువు మీ పూర్తి వివరములను FREEగా ఇచ్చి IDగా రిజిష్టర్ చేసుకోగలరు.

వరుడు కావలెను

★ కమ్మ- (33359); A-27; 5'4"; M.Tech; ఆస్థి- 2crores ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు M.Tech/MS(Engg) చేసి SWE/Govt.Job చేసే వరుడు కావలెను. 9985144113

★ కమ్మ- (33125); A-24; 5'5"; M.Pharmacy; ఆస్థి- 5 Crores ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech/MS(Engg) చేసి USA లో SWE Job చేసే వరుడు కావలెను. 8367055566

★ కాపు-వైద్య-(30792); A-28; 5'4"; B.Com; Pvt.Job; ఆదాయం- 1 La/Pa; ఆస్థి- 5 Lakhs ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు B.Tech/Degree చేసి Pvt/Govt Job చేసే వరుడు కావలెను. 8184911555

★ కమ్మ-వైద్య-(32512); A-35; 5'3"; M.Com; Clerk in bank; ఆదాయం- 1.75 La/pa; అందమైన వధువుకు B.Tech/Any Degree చేసి Pvt/ Govt.Job చేసే వరుడు కావలెను. 9397979718

★ క్రిస్టియన్ మాదిగ- (29202); A-24; 5'5"; Diploma Nursing; Nurse; ఆదాయం-1 La/Pa; సాంప్రదాయమైన అందమైన వధువుకు Any Degree/B.Tech చేసి Govt.Job చేసే వరుడు కావలెను. 8367022266

★ కమ్మ-విడో-(32931); A-41; 5'3"; 10th; సాంప్రదాయమైన అందమైన వధువుకు Any Degree చేసి Pvt/Govt.Job చేసే వరుడు కావలెను. 9397979718

★ మాదిగ-(29200); A-24; 5'3"; MBA; ఆస్థి- 1 House ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు B.Tech/MBA/M.Tech చేసి Govt.Job చేసే వరుడు కావలెను. 8367055577

★ కాపు-(32087); A-34; 5'5"; Inter; ఆస్థి- 1 Flat ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు B.Tech/MBA/Any Degree చేసి Pvt/Govt జాబ్ చేసే వరుడు కావలెను. 8367022266

★ హిందు మాదిగ- (26449); A-35; 5'3"; MD/MS (Medical); Doctor at USA; ఆదాయం- 55 La/Pa; సాంప్రదాయమైన అందమైన వధువుకు USA లో SWE/Doctor గా చేస్తున్న హిందువులలో కుల పట్టింపు లేని వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979720

వధువు కావలెను

★ కమ్మ-(32318); A-31; 5'9"; B.Tech; ఆదాయం- 8.4 La/Pa, ఆస్థి- 1.5 crore ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Tech చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ కమ్మ-(31877); A-34; 5'11"; Diploma; Pvt.Employee; ఆదాయం- 2.5 La/Pa, ఆస్థి- 45 Lakhs ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Tech చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367022266

★ అగ్నికుల క్షత్రియులు-(32980); A-27; 5'11"; B.Tech; Govt.Employee; ఆదాయం- 6 La/Pa, ఆస్థి- 1 house + Land ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Tech చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367244499

★ బ్రాహ్మణ-(33104); A-30; 5'11"; B.Tech; ఆదాయం- 9 La/Pa, ఆస్థి- 3 flats + Lands ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Tech చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8886953666

★ ఆర్యవైశ్య-(28314); A-31; 5'7"; B.Com; Pvt.Employee; ఆదాయం- 2.8 La/Pa, ఆస్థి- House + Lands ప్రాపర్టీ కలిగిన వరుడుకు Degree చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367022266

★ కమ్మ-(32765); A-29; 5'10"; MCA; Pvt.Job; ఆదాయం- 3 La/Pa, ఆస్థి- Own House + Land ప్రాపర్టీ కలిగిన వరుడుకు Degree చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055566

★ ఆర్యవైశ్య-(33230); A-39; 5'6"; 10th Class; Pvt Job; ఆదాయం- 72 K/Pa, ఆస్థి- Own House ప్రాపర్టీ కలిగిన వరుడుకు 10th చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367022266

★ కమ్మ-(29254); A-29; 5'6"; M.S(Engg); SWE at USA; ఆదాయం- 58 La/Pa, ఆస్థి- 5 Crores ప్రాపర్టీ కలిగిన వరుడుకు MS (Engg) చేసి USA లో జాబ్ చేసే అందమైన వధువు కావలెను. 9397979720

★ కమ్మ-(29790); A-24; 6'; B.Sc; Manager; ఆదాయం- 2.4 La/Pa, ఆస్థి- House+ Land ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055599

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.



ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ప్రకటనల కొరకు

మహబూబ్‌నగర్	: 9985411365	ఖమ్మం	: 9985401672	అనంతపురం	: 9985411165	గుంటూరు	: 9985411217	శ్రీకాకుళం	: 9985411066
నిజామాబాద్	: 9985411453	నల్గొండ	: 9985410384	కడప	: 9985411183	విజయవాడ	: 9985411614	విజయనగరం	: 9985411522
కరీంనగర్	: 9985411273	రంగారెడ్డి	: 9985410909	తిరుపతి	: 9985411423	తణుకు	: 9985411543		
ఆదిలాబాద్	: 9985411293	మెదక్	: 9985410904	నెల్లూరు	: 9985411013	కాకినాడ	: 9985411204		
వరంగల్	: 9985411172	కర్నూలు	: 9985411363	ఒంగోలు	: 9985411483	విశాఖపట్నం	: 9985411641		

మీ దగ్గరలోని ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయాలలో సంప్రదించండి

ప్రతి 4 లైన్ల ప్రకటనకు రూ.800/- (కంబైన్డ్) ప్రతి అదనపు లైన్‌కు రూ.130/- (GST అదనం)

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నం.76, రోడ్ నం.70, అశ్విని లే అవుట్, హుడా హైట్స్, జూబ్లిహిల్స్, హైదరాబాద్ - 33. ఫోన్ : 040-23558233/44/55/66. సెల్ : 9985921380.

సాయి లైఫ్‌లో టాటా క్యాపిటల్ వాటా విక్రయం!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా గ్రూపునకు చెందిన టాటా క్యాపిటల్.. హైదరాబాద్ సంస్థ సాయి లైఫ్ సైన్సెస్ నుంచి వైదొలగాలనుకుంటోంది. సాయి లైఫ్ సైన్సెస్‌లో టాటా క్యాపిటల్‌కు 35 శాతం వాటా ఉంది. మొత్తం వాటాను ఇతరులకు విక్రయించాలనుకుంటోంది. ఈ వాటాను దక్కించుకునేందుకు జనరల్ అట్లాంటిక్, వార్‌బర్గ్ పిన్‌కస్, అపాక్స్ పార్ట్‌నర్స్, టెమాసెక్, ట్రూ నార్త్ వంటి పలు ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు పోటీపడుతున్నట్లు సమాచారం. టాటా క్యాపిటల్ పోర్ట్‌ఫోలియో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న కంపెనీల్లో సాయి లైఫ్ ఒకటి. ఇన్నోవేటర్ ఫార్మా కంపెనీలకు ఈ సంస్థ కాంట్రాక్టు డెవలప్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ సేవలందిస్తోంది.

పన్ను భద్రసీమల్లోని దేశీయ కంపెనీలపై నిఘా

దర్యాప్తు ఏజెన్సీలు, రెగ్యులేటర్లకు
షెల్ కంపెనీలపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదన
డొల్ల కంపెనీల గుర్తింపునకు తగిన సూచనలతో నివేదిక

న్యూఢిల్లీ: మారిషస్, లగ్జెంబర్గ్, పనామా, డెలావర్, ఐర్లాండ్ వంటి పన్ను భద్రసీమల్లోని (టాక్స్ హెవెన్) భారత కంపెనీల అనుబంధ విభాగాల(సబ్సిడరీ)ను గుర్తించి, వాటిపై దర్యాప్తు చేయాలని డొల్ల (షెల్) కంపెనీలపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ దర్యాప్తు ఏజెన్సీలు, నియంత్రణ మండళ్లకు ప్రతిపాదించింది. పెద్ద నోట్ల రద్దు తర్వాత మనీలాండరింగ్‌కు వేదికైన షెల్ కంపెనీలపై కొరడా ఝుళిపించేందుకు గత ఏడాది జూలైలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. షెల్ కంపెనీలను గుర్తించేందుకు పెట్టుబడులు, అప్పులు, రుణాలు, నగదు నిల్వల్లో అసమానతలతోపాటు ఈ టాస్క్‌ఫోర్స్ మొత్తం 14 లక్షణాలతో కూడిన జాబితాను ప్రతిపాదించింది. వాటి ఆధారంగా పెద్ద నోట్ల రద్దు సమయంలో మనీలాండరింగ్‌కు పాల్పడిన షెల్ కంపెనీలను గుర్తించి, వాటిపై దర్యాప్తు చేపట్టాలని ఏజెన్సీలకు సూచించింది. భారత కార్పొరేట్ కంపెనీలు పన్ను భద్రసీమల్లోని సబ్సిడరీలను ఏర్పాటు చేయడం ఆందోళన కలిగించే విషయమని టాస్క్‌ఫోర్స్ నివేదిక పేర్కొంది.

ఈ నెలాఖరుకల్లా కేంద్రానికి నివేదిక

షెల్ కంపెనీలను గుర్తించేందుకు నివేదికలో ప్రతిపాదించిన ప్రతి లక్షణాన్ని టాస్క్‌ఫోర్స్ సమగ్రంగా నిర్వచించినట్లు తెలుస్తోంది. ఈనెలాఖరుకల్లా రిపోర్టును కేంద్రానికి సమర్పించే అవకాశం ఉంది. పన్ను భద్రసీమల్లోని షెల్ కంపెనీల రిజిస్ట్రేషన్‌తోపాటు చిరునామా, ఇతర సేవలందించేందుకు అక్కడి కన్సల్టింగ్ నిపుణులు కొంత మంది భారతీయులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని రిపోర్టు పేర్కొంది. పోస్ట్ బాక్స్ కంపెనీలుగా కూడా పిలిచే ఈ సంస్థలు కేవలం కాగితాలకే పరిమితమవుతాయి. వీటికంటూ ఓ కార్యాలయం కూడా ఉండదు. చట్టబద్ధంగా విదేశాల్లో ఆస్తులు కలిగి ఉండే ఈ కంపెనీలను చాలామంది తమ అనధికార లావాదేవీలపై ముసుగు కప్పడంతోపాటు నల్లధనాన్ని దాచుకునేందుకు ఉపయోగించుకుంటున్నారని నివేదికలో టాస్క్‌ఫోర్స్ పేర్కొంది.

షెల్ కంపెనీలను గుర్తించడమెలా..?

- రిజర్వులు, మిగులు నిధులు, స్థిరాస్తులు, నగదు నిల్వలు, పెట్టుబడులు, రుణం, అడ్వాన్సులు, మొత్తం రుణాల్లో ఏ అంశమైనా కంపెనీ టర్నోవర్ కంటే ఐదు రెట్లు లేదా అంతకుమించినట్లయితే దాన్ని షెల్ కంపెనీగా భావించి దర్యాప్తు చేయాలని టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదించింది.
- సంస్థ షేర్ క్యాపిటల్‌లో 75 శాతం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల చేతుల్లో ఉన్నప్పుడు, రెండేళ్ల లేదా అంతకు ముందు నుంచి వార్షిక రిటర్నులు సమర్పించని సంస్థలపైనా నిఘా పెట్టాలని సూచించింది.
- పదికి పైగా సంస్థలు ఒకే కార్యాలయం చిరునామాతో రిజిస్టర్ చేసుకొని, అందులోని సగం సంస్థలు కామన్ బోర్డు సభ్యులను కలిగి ఉన్నప్పుడు, గడిచి రెండేళ్లలో సగం మంది డైరెక్టర్లను మార్చినట్లయితే వాటిని షెల్ కంపెనీలుగా అనుమానించాలని టాస్క్‌ఫోర్స్ అంటోంది.



నీరవ్ కంపెనీలపై దర్యాప్తునూ పరిగణనలోకి తీసుకోండి: కేంద్రం

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.12,700 కోట్లకు పైగా కుచ్చుటోపీ పెట్టిన నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల కంపెనీలపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి ఏజెన్సీల దర్యాప్తు అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం కోరింది. వీరిద్దరూ 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు దర్యాప్తు ఏజెన్సీలు గుర్తించాయి.

బిఎస్ఎన్ఎల్ మెగామేళా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) ఈ నెల 19వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తెలంగాణలో మెగా మేళాను నిర్వహించనుంది. ఈ సందర్భంగా కస్టమర్ సర్వీస్ సెంటర్లు, ఫ్రాంచైజీలు/ రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా కస్టమర్లకు ఉచితంగా 3జి స్మార్ట్ సిమ్‌కార్డులను ఇవ్వనున్నారు. కొత్త సిమ్ తీసుకునే వారికి ఉచితంగా 351 ఎంబి డేటా లభిస్తుంది. అంతేకాకుండా 110 రూపాయలతో రీచార్జ్ చేసుకుంటే పూర్తి టాక్‌టైమ్ లభించనుందని బిఎస్ఎన్ఎల్ తెలిపింది. బిఎస్ఎన్ఎల్ సిబ్బంది నిర్వహించే మెగామేళాలో లాండ్ లైన్, బ్రాడ్‌బ్యాండ్, ఎఫ్‌టిటిహెచ్ కనెక్షన్లను బుక్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నారు.



ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్‌కు అవార్డు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆగ్రో కెమికల్ రంగంలోని ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2017 సంవత్సరానికిగాను అత్యుత్తమ కంపెనీ అవార్డును సొంతం చేసుకుంది. ఇంటర్నేషనల్ బ్రాండ్ కన్సల్టింగ్ కార్పొరేషన్ (ఐబిసిసి) యుఎస్ఎ నుంచి ఈ పురస్కారం లభించినట్టు కంపెనీ తెలిపింది. ఇటీవల ముంబైలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్, ట్రోఫీని జస్టిస్ అనూప్ మెహతా చేతుల మీదుగా కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ (మార్కెట్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్) ఎం వెంకటేశ్వర రావు, జనరల్ మేనేజర్ (సేల్స్, మార్కెటింగ్) ముకేష్ గార్గ్ అందుకున్నారు.

ఐస్ మేక్ నుంచి సోలార్ కోల్ట్ స్టోరేజ్ యూనిట్



హైదరాబాద్: ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలోకి సోలార్ విద్యుత్ ఆధారిత కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌ను విడుదల చేసింది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ పి పటేల్ తెలిపారు. 4-5 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ధర 11-12 లక్షల రూపాయలుంటుందని చెప్పారు. ఇలాంటి కోల్డ్ స్టోరేజ్ గదుల మూలంగా వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కువ కాలం నాణ్యతతోపాటు తాజాగా ఉండటానికి అవకాశం ఉంటుందని, వృధా కూడా తగ్గుతుందని చెప్పారు. సోలార్ విద్యుత్ ఉన్నందువల్ల కోల్డ్ స్టోరే జ్ నిర్వహణ వ్యయం తగ్గుతుందన్నారు.

భారత్‌కు డేంజర్



- కృత్రిమ మేధపై పాల్ క్రుగ్‌మన్ హెచ్చరిక
- పెరగనున్న నిరుద్యోగం

సేవల రంగాన్నే నమ్ముకుంటే భారత ఆర్థిక వ్యవస్థకు పెనుముప్పు తప్పదని ప్రఖ్యాత ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత పాల్ క్రుగ్‌మన్ హెచ్చరించారు. కృత్రిమ మేధ (ఎఐ) టెక్నాలజీతో భారత సేవల రంగంలో కొలువులు క్షీణించి, మున్ముందు భారీ ఎత్తున నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఒక న్యూస్ ఛానల్ నిర్వహించిన సదస్సులో క్రుగ్‌మన్ ఈ హెచ్చరిక చేశారు. ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగం పాత్రను పెంచుకోవడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని స్పష్టం చేశారు. 'కొత్తగా వినిపిస్తున్న కృత్రిమ మేధ విషయంలో మీరు జాగ్రత్తగా ఉండాలి. భవిష్యత్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఔట్‌సోర్సింగ్ ద్వారా భారత్‌లోని డాక్టర్లతో పాటు, కృత్రిమ మేధ ఆధారిత కంపెనీల నుంచి కూడా పొందే అవకాశం ఉంది. అదే జరిగితే భారత సేవల రంగం ఆందోళన చెందక తప్పదు' అన్నారు.

చైనా, జపాన్ కష్టాలు

పని చేసే జనాభా తగ్గిపోవడం వల్లనే జపాన్ 'ఆర్థిక సూపర్ పవర్' హోదాను కోల్పోయిందని క్రుగ్‌మన్ స్పష్టం చేశారు. చైనాదీ ప్రస్తుతం అదే పరిస్థితి అన్నారు. సేవల రంగంతో పాటు, తయారీ రంగంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా ఆసియాలో ఈ విషయంలో భారత్ నాయకత్వ బాధ్యత తీసుకోవాలని కోరారు. లేకపోతే పెరిగే జనాభాకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పించడం భారత్‌కు కత్తిమీద సాములా మారుతుందని హెచ్చరించారు.

ప్రపంచీకరణ

అత్యధిక స్థాయిలో పని చేసే జనాభా ఉన్న భారత్ మలిదశ ప్రపంచీకరణలోనూ కీలక పాత్ర పోషిస్తుందని క్రుగ్‌మన్ చెప్పారు. 'భారత అభివృద్ధి కథ చాలా ప్రత్యేకమైంది. సేవల రంగం ఇక్కడ అభివృద్ధిని ముందుకు నెడుతోంది. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి కనిపించదు. సేవల ప్రపంచీకరణ ఇప్పుడే ప్రారంభమైంది. దీనికి భారీ వాణిజ్య అవకాశాలు ఉన్నాయి. భారత్ మరింత అభివృద్ధి చెందుతుందనేందుకు అది కూడా ఒక కారణం.

కొనసాగనున్న అధిక వృద్ధి రేటు

పని చేయగల జనాభాతో భారత్‌లో అధిక వృద్ధి రేటు కొనసాగుతుందని క్రుగ్‌మన్ స్పష్టం చేశారు. జపాన్, ఇటలీ, చైనా వంటి దేశాలకు ఈ సౌలభ్యం లేదన్నారు. చాలినంత మంది పని చేసే జనాభా లేక ఈ దేశాల ఆర్థికాభివృద్ధి నీరసిస్తోందన్నారు. స్వల్ప కాలంలోనే భారత్‌లో తలసరి ఆదాయం నాలుగింతలు పెరగడం మామూలు విషయం కాదన్నారు. అయితే ప్రపంచ ఆర్థికవేత్తలందరి దృష్టి చైనా మీద ఉండడంతో, భారత అధిక ఆర్థికాభివృద్ధి పెద్దగా అందరి దృష్టికి రావడం లేదన్నారు.

అభివృద్ధికి ఇంకా అవకాశం

ఆర్థిక రంగంలో భారత్ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని క్రుగ్‌మన్ చెప్పారు. దేశంలోని అనేక ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంతాల్లో అభివృద్ధి ప్రారంభమైతే భారత ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా దూసుకు పోతుందన్నారు. దేశంలో అన్ని ప్రాంతాలకు విద్యుత్ సదుపాయాన్ని అందుబాటులోకి తేవాలన్న ప్రధాని మోదీ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊతం అవుతుందన్నారు.

చంద్రబాబును కలిసిన వికాట్ సిఇఒ సిడాస్

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఫ్రాన్స్‌కు చెందిన వికాట్ సిమెంట్ కంపెనీ సిఇఒ గై సిడాస్ శనివారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ ఫ్రంక్వాయిస్ గౌటీయర్ కూడా ఉన్నారు. విజయనగరం జిల్లా కొత్తవలసలో ఏటా 17.5 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో సిమెంట్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు వికాట్ సంస్థ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఒయు కుదుర్చుకుంది. కాల్బర్గీ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.510 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ ప్లాంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 200 ఎకరాల భూమి కేటాయించింది. ఈ ప్లాంట్ పూర్తయితే 275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.

వాటా విక్రయ యత్నాల్లో రాంకీ ఎన్విరో

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వ్యర్థాల నిర్వహణ పరిష్కారాలందించే హైదరాబాద్ కంపెనీ రాంకీ ఎన్విరో ఇంజినీరింగ్ లిమిటెడ్.. సంస్థలో 50 శాతం వరకు వాటాను ఇతరులకు విక్రయించే ప్రయత్నాల్లో ఉంది. ఇందుకోసం ప్రముఖ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ కెకెఆర్‌తో పాటు పలువురితో సంప్రదింపులు జరుగుతున్నట్లుగా సమాచారం. ఇందుకు సంబంధించిన చర్చలు తుది దశలో ఉన్నాయి. త్వరలోనే డీల్ ఖరారయ్యే అవకాశం ఉంది. వాటా విక్రయ ప్రక్రియలో భాగంగా కంపెనీ విలువను రూ.7 వేల కోట్ల స్థాయిలో లెక్కగట్టినట్లు తెలుస్తోంది.

'కారియోటికా'కు రాష్ట్రపతి ఆహ్వానం

సంస్థ పరిశోధకులకు సత్కారం



బోడపాటి బాపూజీరావు, బీరం రవిచంద్ర

అనకాపల్లి: ఆక్వా, పాడి పరిశ్రమ రంగాల్లో వినూత్న పరిశోధనలతో కొత్త ఉత్పత్తులను తయారు చేస్తున్న కారియోటికా బయోలాజికల్ సంస్థ (హైదరాబాద్)కు అరుదైన గుర్తింపు లభించింది. ఈ నెల 19 నుంచి 23 వరకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే నూతన పరిశోధన, వ్యవస్థాపక ఉత్సవానికి ఈ సంస్థను ఆహ్వానించారు. ప్రతిభావంతులైన పరిశోధకులను పారిశ్రామిక రంగానికి, ప్రజలకు పరిచయం చేసేందుకు రాష్ట్రపతి భవన్ ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేసింది. ఈ నెల 19వ తేదీ ఉదయం రాష్ట్రపతి కోవింద్ ఈ సంస్థ పరిశోధకులను సత్కరిస్తారు. ఈ సందర్భంగా కారియోటికా బయోలాజికల్ సంస్థ శాస్త్రవేత్త, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీరం రవి చంద్ర, డైరెక్టర్ డాక్టర్ బోడపాటి బాపూజీరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

సమస్యలకు పరిష్కారాలు

ఇటీవలికాలంలో వైట్‌స్పాట్ వైరస్, వైట్‌గట్, విబ్రియో వ్యాధులు ఆక్వా రైతులను తీవ్రంగా వేధిస్తున్నాయి. రొయ్యల్లో వైట్‌స్పాట్ వైరస్ ప్రవేశానికి కారణమైన ప్రొటీన్లను నియంత్రించే 'కారియోవిర్, విరాకల్' అనే సహజ సిద్ధమైన ఉత్పత్తులను కిరాయోటిక్ కంపెనీ అభివృద్ధి చేసింది. చెన్నైలోని కేంద్రీయ ఉప్పు నీటి రొయ్యల పరిశోధనా సంస్థ (సిఐబిఎ) సహాయంతో ప్రస్తుతం ఈ ఉత్పత్తులపై క్షేత్ర స్థాయిలో పరీక్షలు జరుగుతున్నాయి. 'మా కంపెనీ కొత్తగా అభివృద్ధి చేసిన ఎంజైమ్‌లతో కూడిన 'క్యారోమాక్స్'ను రొయ్యలకు మేతతో కలిపి ఇస్తే వాటి జీర్ణ వ్యవస్థ మెరుగు పడుతుంది. రొయ్యలు త్వరగా పెరగడంతో పాటు వైట్‌గట్ సమస్యా అదుపులో ఉంటుంది' అని రవిచంద్ర, బాపూజీరావు చెప్పారు. పాడి పశువుల్లో పాల నాణ్యత పెంచేందుకు కంపెనీ 'కారియోలాక్ట్' పేరుతో మరో ఉత్పత్తిని అభివృద్ధి చేసింది.

పిఎస్‌బిల విదేశీ శాఖల్లో 25 శాతం నష్టాల్లోనే..



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల(పిఎస్‌బి)కు చెందిన విదేశీ శాఖల్లో దాదాపు 25 శాతం నష్టాల్లో కొనసాగుతున్నాయని కేంద్రం తెలిపింది. పిఎస్‌బిల డేటా ప్రకారం.. గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2016-17) మొత్తం 159 బ్రాంచీల్లో 41 నష్టాలు నమోదు చేసుకున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా పార్లమెంట్‌కు తెలిపారు. నష్టాల్లో ఉన్న విదేశీ శాఖల్లో ఎస్‌బిఐకి చెందినవే అధికం. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన ఎస్‌బిఐ విదేశాల్లో నిర్వహిస్తున్న బ్రాంచీల్లో 9 నష్టాల్లో ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో బ్యాంక్ ఆఫ్ ఇండియా (8 శాఖలు), బ్యాంక్ ఆఫ్ బరోడా (7) ఉన్నాయి. దాదాపు అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు విదేశాల్లో బ్రాంచీలను నిర్వహిస్తున్నాయి. అయితే, విదేశీ శాఖలను తగ్గించుకునే విషయమై ఈ పిఎస్‌బిలన్నీ కలిసి ఓ నోట్‌ను రూపొందించే పనిలో ఉన్నాయని శుక్లా వెల్లడించారు.

9వేలు దాటిన రుణ ఎగవేతదారులు

మార్చి 2014 చివరినాటికి పిఎస్‌బిలకు ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేసిన వారి సంఖ్య 6,336గా నమోదుకాగా.. 2017 డిసెంబర్ 31 నాటికి 9,063కు పెరిగింది. ఆర్‌బిఐ ఆదేశాల మేరకు ప్రభుత్వ బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు వీరికి మళ్లీ రుణాలు మంజూరు చేయలేదని శుక్లా వెల్లడించారు.

కార్డు మోసాలు 1,785 పైనే..



పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యం పెరిగిన విషయం తెలిసిందే. అయితే ఇదే సమయంలో క్రెడిట్/డెబిట్ కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాల సంఖ్య కూడా పెరుగుతుండటం వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తోంది. గత ఏడాది కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాల సంఖ్య 1,785గా ఉంది. వీటి మూలంగా జరిగిన ఆర్థిక నష్టం 71.48 కోట్ల రూపాయలను తాకింది. లక్ష రూపాయలు అంతకు మించి నష్టపోయిన సందర్భంలో వాటి నమోదు జరిగింది. కానీ అంతకన్నా తక్కువగా మోసాలు జరిగినా వాటి గురించి ఫిర్యాదు చేయని వారి సంఖ్య అధికంగానే ఉంటుందని పరిశీలకులు అంటున్నారు. గత డిసెంబరు నెలలో 187 మోసాల మూలంగా వాటిల్లిన నష్టం 33.73 కోట్ల రూపాయలకు చేరుకుంది. ఆర్‌బిఐ వెబ్‌సైట్‌లోని గణాంకాల ప్రకారం.. డిసెంబరులో ఎటిఎంలు, పాయింట్ ఆఫ్ సేల్ (పిఒఎస్) టెర్మినల్స్ ద్వారా కార్డులను వినియోగించి చేసిన లావాదేవీల విలువ 3,46,997 కోట్ల రూపాయలుగా ఉంది. ఇందులో మోసాల కారణంగా నష్టపోయినది 0.0009 శాతంగా ఉంది. కాగా ఆన్‌లైన్ చెల్లింపుల్లో రిస్క్‌లను తగ్గించేందుకు ఆర్‌బిఐ తగినన్ని చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వం చెబుతోంది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,260	---	31,180	31,200	30,410
క్రితం ముగింపు	31,250	---	31,180	31,230	30,410
22 క్యారెట్లు	28,950	---	28,680	28,930	28,950
క్రితం ముగింపు	28,940	---	28,680	28,950	28,950
వెండి (కిలో)	39,000	---	38,900	39,300	41,100
క్రితం ముగింపు	39,200	---	38,900	39,500	41,300

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	330.00	చిత్తూరు	363.00
వరంగల్	332.00	చెన్నై	370.00
విజయవాడ	317.00	నమక్కల్	360.00
గోదావరి	317.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	325.00	ముంబై	370.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70.00	విజయవాడ	71.00
కరీంనగర్	71.00	గుంటూరు	71.00
వరంగల్	70.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	73.00
కర్నూలు	70.00	నెల్లూరు	73.00
విశాఖపట్నం	74.00	అనంతపురం	72.00
గోదావరి	71.00		

టిజివి గ్రూప్.. రాయలసీమ రసాయనాల లీడర్

రాయలసీమ కేంద్రంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థ టిజివి గ్రూప్. ఆర్గానిక్, ఇనార్గిక్ కెమికల్స్ తయారీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును కలిగిన ఈ సంస్థను టిజి వెంకటేష్ ప్రమోట్ చేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు టిజి భరత్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా సంస్థను తనదైన శైలిలో ముందుకు తీసుకుపోతున్నారు. కాస్టిక్ సోడా, సల్ఫ్యూరిక్ యాసిడ్, బొగ్గు, విద్యుత్ రంగాల్లో చురుగ్గా ఉన్న ఈ సంస్థ కార్యకలాపాలు, ఇతరత్రా అంశాలపై టిజి భరత్.. ఎబిఎన్ ఆంధ్రజ్యోతి 'బెస్ట్ ఇన్ ది బిజినెస్'తో పంచుకున్నారు.



సాధారణ వ్యాపారాలకు భిన్నంగా కెమికల్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టడానికి కారణం ?

- నాన్న టిజి వెంకటేష్ 1980లో కుటుంబ విభజన అనంతరం కాస్టిక్ సోడా వ్యాపారానికి లైసెన్స్ తీసుకున్నారు. సెల్‌మెంబ్రెన్ టెక్నాలజీతో కాస్టిక్‌సోడా ఉత్పత్తికి వీలుగా ఇటలీకి చెందిన డినారోతో ఒప్పందం కుదుర్చుకున్నాం. ప్రస్తుతం గ్రూప్‌లో టిజివి ఎస్ఆర్ఎఎసి లిమిటెడ్ (గతంలో శ్రీ రాయలసీమ ఆల్కలిస్, అలైయిడ్ కెమికల్స్ లిమిటెడ్), శ్రీ రాయలసీమ హై-స్ట్రెంత్ హైపో లిమిటెడ్, శ్రీ రాయలసీమ గెలాక్సీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ మారుతి మెరైన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, టిజివి సెక్యూరిటీస్ లిమిటెడ్ కంపెనీలు ఉన్నాయి.

క్లయింట్లు ఎవరు, ఎగుమతులు చేస్తున్నారా?

- టిజివి గ్రూప్ ఉత్పత్తి చేసే ఉత్పత్తులన్నీ ఫార్మా రంగానికి సంబంధించినవే. కాస్టిక్ సోడా, సల్ఫ్యూరిక్ యాసిడ్.. ఇలాంటి బేసిక్ కెమికల్స్ అన్నీ ఫార్మా కంపెనీలు ఉపయోగిస్తాయి. ఇందులో సల్ఫ్యూరిక్ యాసిడ్‌ను ఆటోమొబైల్ కంపెనీలు ఉపయోగిస్తాయి. అమర రాజా బ్యాటరీస్‌కు దీన్ని సరఫరా చేస్తాం. నెలకు వేల టన్నుల ఉత్పత్తి చేస్తాం. ఫార్మా, పేపర్, బ్యాటరీస్ వంటి పరిశ్రమలు మా ఉత్పత్తులను అధికంగా వినియోగిస్తాయి. కాల్షియం హైపో క్లోరైట్‌ను ఉత్పత్తి చేస్తాం. దీన్ని వాటర్ ట్రీట్‌మెంట్‌కు ఉపయోగిస్తారు. ప్రధానంగా స్విమ్మింగ్ పూల్స్‌లో ఉపయోగించే నీటి కోసం దీన్ని వినియోగిస్తారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కాల్షియం హైపోక్లోరైట్‌కు మంచి డిమాండ్ ఉంది. ఇప్పుడిప్పుడే భారత్ లాంటి దేశాల్లో దీని వినియోగం పెరుగుతోంది. ప్రస్తుతం భారత మార్కెట్లో సోడియం హైపో, బ్లీచింగ్ పౌడర్ వినియోగం ఎక్కువగా ఉంది. దాదాపు ఎనిమిది నుంచి తొమ్మిది ప్రొడక్ట్స్ ఉత్పత్తి చేస్తున్నాం. సల్ఫ్యూరిక్ యాసిడ్, క్లోరోసల్ఫోనిక్ యాసిడ్, ఓలియం, మోనోక్లోరాస్టిక్ యాసిడ్ ఈ ఉత్పత్తులన్నీ ఫార్మా రంగానికి సంబంధించినవే. ఇవన్నీ టిజివి ఎస్ఆర్ఎఎసి లిమిటెడ్‌లో ఉత్పత్తి అవుతాయి. క్లోరిన్ ఆధారిత ఉత్పత్తులన్నీ రాయలసీమ హై-స్ట్రెంత్ హైపో లిమిటెడ్‌లో ఉత్పత్తి చేస్తాం. కాల్షియం హైపోక్లోరైట్‌ను ఉత్పత్తి చేస్తున్నది టిజివి గ్రూప్ మాత్రమే. ఆక్వాఫిట్ బ్రాండ్‌తో దీన్ని భారత మార్కెట్లో విక్రయిస్తున్నాం. పెప్సీకో, కోకాకోలా సహా మరికొన్ని బహుళ జాతి కంపెనీలకు దీన్ని సరఫరా చేస్తున్నాం. అమెరికా, దక్షిణ అమెరికా, పశ్చిమాసియా సహా ఆఫ్రికా దేశాలకు దీన్ని ఎగుమతి చేస్తున్నాం. సల్ఫ్యూరిక్ యాసిడ్ ఉత్పత్తిలో దక్షిణాదిలో మాదే అగ్రస్థానం, బ్లీచింగ్ పౌడర్ తయారీలోనూ కీలకంగా ఉన్నాం.

విద్యుదుత్పత్తి, బొగ్గు విభాగంలోకి ప్రవేశం ఎలా ?

- కాస్టిక్ సోడా ఉత్పత్తికి పెద్ద ఎత్తున విద్యుత్ అవసరమవుతుంది. అప్పట్లో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండటంతో విద్యుదుత్పత్తిలోకి ప్రవేశించాలని నిర్ణయించాం. ఇందులో భాగంగానే క్యాప్టివ్ అవసరాల కోసం 60 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం. ఇది పూర్తిగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రం. అలాగే తమిళనాడులో ఉదయతూర్, తేనిల్లో 11.5 మెగావాట్ల సామర్థ్యం గల పవన విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఇక్కడ కాస్టిక్ సోడాలో కీలకమైన ఉప్పును ఇక్కడి క్షేత్రాల్లో ఉత్పత్తి చేస్తున్నాం. నెల్లూరులో కూడా ఉప్పు క్షేత్రాలున్నాయి. వీటితో పాటు కర్నూలులో మల్టీప్లెక్స్, హోటల్‌ను నిర్వహిస్తున్నాం. అలాగే ఈ మధ్య కాలంలోనే బొగ్గు ట్రేడింగ్‌లోకి ప్రవేశించాం. గ్రూప్ కంపెనీలన్నింటికి బొగ్గు ఎక్కువగా అవసరమవుతుండటంతో ట్రేడింగ్ వ్యాపారంలోకి అడుగుపెట్టాం. రాయలసీమ కోల్ పేరుతో దీన్ని ప్రారంభించాం. గ్రూప్ కంపెనీలకు దాదాపు 40 వేల టన్నుల బొగ్గు అవసరమవుతుంది.



ఏసీబీ వలలో నాంపల్లి లేబర్ కోర్టు జడ్జి గాంధీ

- ఏపీ, తెలంగాణలో ఏకకాలంలో దాడులు

బౌద్ధనగర్,/హైదరాబాద్/కొవ్వూరు/గోపాలపురం/దేవరపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నాంపల్లి లేబర్ కోర్టు ప్రిసైడింగ్ సెషన్ జడ్జి మల్లంపాటి గాంధీ ఇళ్లు, కార్యాలయాలపై శనివారం ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. తెలంగాణలోని జడ్జి కార్యాలయం, డీడీ కాలనీ, బౌద్ధనగర్, ఏపీలోని ఏలూరు, రాజమండ్రి, కొవ్వూరులలో ఏకకాలంలో ఏడు బృందాలు దాడుల్లో పాల్గొన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.3 కోట్ల విలువైన ఆస్తులను కనుగొన్నారు. సికింద్రాబాద్ బౌద్ధనగర్‌లోని ఏసీబీ డీడీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. జడ్జి గాంధీపై ఏసీబీ కార్యాలయంలో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారని, దీంతో హైకోర్టు అనుమతితో రెండు రాష్ట్రాల్లో దాడులు జరిపామని మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బౌద్ధనగర్‌లోని గాంధీ నివాసంలో జరిపిన సోదాలలో 30 తులాల బంగారం, పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు, పోలవరం మండలాల్లో 18 ఎకరాల పొలం, బ్యాంకులోని ఓ లాకర్‌తోపాటు మూడు వాహనాలను ఉన్నట్లు గుర్తించామన్నారు. గాంధీపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. కాగా, పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కురుకూరు, గోపాలపురం మండలం వెదుళ్లకుంట, కొవ్వూరులో గాంధీ, ఆయన బంధువులకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలపై ఏసీబీ దాడులు జరిగాయి.

మోదీది ద్రోహం... అవిశ్వాసానికి మద్దతివ్వండి

- అన్నాడీఎంకేకు స్టాలిన్ వినతి
- తోసిపుచ్చిన జయ పార్టీ

చెన్నై, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి అన్నాడీఎంకే కూడా మద్దతు ఇవ్వాలని డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. తమిళనాడుపై కూడా కేంద్రం సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని, నీట్ పరీక్షల నుంచి మినహాయింపు ఇవ్వడంలోనూ, తమిళ రైతు జీవనాధార సమస్య కావేరి జల వివాదంలో- కావేరి నిర్వాహక మండలి ఏర్పాటుకు చర్యలు తీసుకోకుండా వంచిస్తోందని ఆయన ఆరోపించారు. టీడీపీ అవిశ్వాసాని కి పార్లమెంట్‌లో సంఖ్యాపరంగా మూడో పెద్ద పార్టీగా ఉన్న అన్నాడీఎంకే దీనికి మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే అవిశ్వాస తీర్మానానికి అన్నాడీఎంకే మద్దతు ఉండదని ఆ పార్టీ పార్లమెంటరీ బృంద అధ్యక్షుడు డాక్టర్ పి.వేణుగోపాల్ స్పష్టం చేశారు. బీజేపీ ఒత్తిడి మేరకే తనపై వేటు వేశారని అన్నాడీఎంకే అధిష్ఠానంపై ఆ పార్టీ నేత కేసీ పళనిస్వామి ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మాట్లాడినందుకు ఆయనను అన్నాడీఎంకే పార్టీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే తమ స్వార్థ ప్రయోజనాలకు పార్టీని వాడుకోవద్దని కేసీ పళనిస్వామి హితవుపలికారు.

అవిశ్వాసంతో ముప్పేమీ లేదు

- ఐదేళ్లూ పదవిలో ఉంటాం: బీజేపీ

బెంగళూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానంతో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ మనుగడకు ఎలాంటి ముప్పు లేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ అన్నారు. ఐదేళ్ల పదవీకాలాన్ని ఆత్మవిశ్వాసంతో పూర్తి చేస్తామన్నారు. టీడీపీ మనసులో మరేదో ఉందని ఆయన విమర్శించారు. కాగా, మరో కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ మల్లేశ్వరంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీయే నుంచి టీడీపీ వైదొలగడం తొందరపాటు చర్యగా వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు మోదీ ప్రభుత్వం అత్యంత ఉదారంగా అదనంగా రూ.24వేల కోట్లకుపైగా నిధులు మంజూరు చేసిందన్నారు. ఎన్డీయేలో మిత్ర పక్షాలు అసంతృప్తితో రగిలిపోతున్నాయన్న వాదన సరికాదని ఆయన పేర్కొన్నారు.

600 మంది అనర్హులు డాక్టర్లయ్యారు!

యూపీలో భారీ కుంభకోణం

మేరఠ్, మార్చి 17: ఉత్తరప్రదేశ్‌లో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. మోసగాళ్ల ముఠా అండ తో రాష్ట్రంలో 600 మందికి పైగా అనర్హులు వైద్యులు గా మారారు. ఈ బాగోతాన్ని యూపీ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్) పోలీసులు బట్టబయలు చేశారు. కవిరాజ్ సింగ్ ఈ మోసగాళ్ల రాకెట్ సూత్రధారిగా గుర్తించారు. ఇతను మేరఠ్‌లోని చౌదరి చరణ్ సింగ్ యూనివర్సిటీకి చెందిన మరో ఉద్యోగి, ఇద్దరు కాం ట్రాక్ట్ ఉద్యోగులను అరెస్టు చేశారు. ముఠాలో మరో సభ్యుడు, వర్సిటీ మాజీ ఉద్యోగి సీపీ సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలివీ.. వర్సిటీలోని జవాబు పత్రాల మూల్యాంకన విభాగం ఇన్‌చార్జి పవన్‌కుమార్, ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు కపిల్‌కుమార్, సందీప్‌లతో కలిసి సింగ్ ఈ మోసానికి తెరలేపాడు. అతను వైద్య విద్యార్థులు ఒక్కొక్కరి నుంచి రూ.1-1.50 లక్షలు, ఇతర విద్యార్థుల నుంచి రూ.30-40 వేలు వసూలు చేసేవాడు. వీరి మోసాలతో 600 మందికి పైగా అనర్హులు వైద్యవిద్యను పూర్తిచేశారు. వర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి ఖాళీ జవాబు పత్రాలను తెప్పించుకొని, సమాధానాలు రాసి అసలు సమాధాన పత్రాల స్థానంలో వాటిని ఉంచేవారని పోలీసులు తెలిపారు.



నాలుగోసారీ పుతినే!

నేడు పోలింగ్.. ఎన్నిక లాంఛనమే.. స్టాలిన్ తర్వాత అత్యధిక కాలం పదవిలో

పుతిన్ రాజ్యకాంక్షపై పశ్చిమ దేశాల్లో అలజడి.. గూఢచారిపై విషదాడితో అగ్రరాజ్యాల ఆగ్రహం

లండన్, మాస్కో, మార్చి 17: వ్లాదిమిర్ పుతిన్ (65) నాలుగోసారి రష్యా దేశాధినేత పదవిని చేపట్టబోతున్నారు. ఎన్నికల్లో ఆయనకు అఖండ మెజారిటీ ఖాయమని అనేక సర్వేలు ఇప్పటికే తేల్చాయి. ఆదివారం లాంఛనంగా అధ్యక్ష ఎన్నిక జరగడమే తరువాయి. జోసెఫ్ స్టాలిన్ (30 ఏళ్లు) తర్వాత అత్యధిక కాలం ఆ పదవిలో కొనసాగనున్న అధినేత పుతినే (19 ఏళ్లు). జీవితకాల అధ్యక్షుడిగా కొనసాగేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ మధ్యే కమ్యూనిస్ట్ పార్టీ ఆమోదముద్ర వేయించుకున్నారు. అదే తరహాలో పుతిన్ కూడా వీలైనంత ఎక్కువ కాలం పదవిలో కొనసాగేందుకు పావులు కదుపుతున్నారు. స్టాలిన్ నియంత అయితే పుతిన్ బయటకు కనబడని నియంత అని రష్యన్ విశ్లేషకుడొకరు వ్యాఖ్యానించారు. ఇక, ప్రీ పోల్ సర్వేలో పుతిన్‌కు 69.7 శాతం మద్దతు తెలపవచ్చని వస్తే.. సమీప ప్రత్యర్థి పావెల్ గ్రడినిన్‌కు 7.1 శాతమే ఓటేశారు. ఓటర్లలో ఆసక్తి పలచబడిందని, పోలింగ్ తగ్గవచ్చని పశ్చిమ మీడియా వ్యాఖ్యానించింది. 1999 నుంచి దేశాధ్యక్ష పదవిలో ఉన్న పుతిన్.. మళ్లీ గెలిస్తే 2024 వరకు ఎదురుండదు. కానీ, ఇటీవల జరిగిన రెండు పరిణామాలు ఆయన విజయాన్ని మసకబార్చడం ఖాయమని అంటున్నారు. ఒకటి- బ్రిటిష్-రష్యా గూఢచారిపై విష రసాయన దాడి. కాగా, రెండోది, 2016 అధ్యక్ష ఎన్నికల్లో తలదూర్చినందుకు అమెరికా ఆంక్షలు విధించడం. ఈ రెండింటికీ ప్రత్యక్ష బాధ్యత పుతిన్‌దేననేది పశ్చిమ మీడియా వ్యాఖ్య.

విష దాడి ఎలా..?

సెర్గీ స్క్రిపాల్.. బ్రిటన్ దక్షిణ ప్రాంతంలోని శాలిస్బరీలో ఉంటున్న రష్యన్ జాతీయుడు. రష్యా సైనిక రహస్యాలను, రక్షణ వివరాలను ఏళ్ల తరబడి బ్రిటన్‌కు రహస్యంగా చేరవేసినట్లు ఆయనపై అభియోగం. నేరం అంగీకరించడంతో 13 ఏళ్ల జైలుశిక్ష విధించారు. తర్వాత విడుదలై శాలిస్బరీ వెళ్లిపోయి శేష జీవితం గడుపుతున్నాడు. ఈనెల 4న కుమార్తెతో కలిసి ఓ ఇటాలియన్ రెస్టారెంట్‌లో భోజనం చేశాడు. రెస్టారెంట్ బయట బెంచ్‌పై తండ్రీకూతుళ్లు ఇద్దరూ అపస్మారకంగా పడి ఉన్నారు. పరీక్షల్లో వారిపై ప్రాణాంతక విష పదార్థాలతో కూడిన నెర్వ్ ఏజెంట్ దాడి జరిగిందని తేలింది.

నెర్వ్ ఏజెంట్స్ అంటే..!

1970-80 ప్రాంతాల్లో అప్పటి సోవియట్ యూనియన్ వినియోగించిన విష రసాయనాలు, విష వాయువులను విరజిమ్మే అణువులే ఈ నెర్వ్ ఏజెంట్స్. ఇవి అత్యంత ప్రమాదకరమైనవి. ఇవి గుళికలు, ద్రవ, వాయు రూపాల్లో ఉంటాయి. వీటిని వ్యక్తులపై ప్రయోగించినప్పుడు అతని శరీరంలోని నాడీకణ వ్యవస్థను కుప్పకూల్చేస్తాయి. మనిషి ఉన్నపళంగా కూలిపోతాడు. శరీర వ్యవస్థలు క్రమేణా నిర్వీర్యమై మనిషి మరణిస్తాడు.

పరస్పర ఆరోపణలు

ఇది రష్యా విదేశీ గూఢచారి సంస్థ ఎస్వీఆర్ జరిపిన దాడి అని బ్రిటిష్ ప్రధాని థెరెసా మే మార్చి 6న ఆరోపించారు. వివరణ ఇవ్వకపోతే తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం 23 మంది రష్యన్ దౌత్యవేత్తలను బ్రిటన్ బహిష్కరించింది. ఆ ఆరోపణలను రష్యా ఖండించింది. ఆధారాలుంటే చూపాలని డిమాండ్ చేసింది. ప్రతిగా 23 మంది బ్రిటిష్ దౌత్యవేత్తలను బహిష్కరించింది. బ్రిటన్ నిర్ణయాన్ని అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ సమర్థించాయి. అవసరమైతే రష్యాపై ఆంక్షలు విధిస్తామని హెచ్చరించాయి. సదరు ప్రకటనపై నాలుగు అగ్రరాజ్యాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, థెరెసా మే, ఏంజెలా మెర్కెల్, ఇమానియేల్ మెక్రాన్ సంతకాలు చేశారు. రష్యా మాత్రం బెదరలేదు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో వేలు

అమెరికా 2016 అధ్యక్ష ఎన్నికల్లో రష్యా తలదూర్చిందని, ట్రంప్‌కు అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపణలు మొదట్నుంచీ వెల్లువెత్తాయి. ప్రజల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో రాబర్ట్ మ్యూలర్ నేతృత్వంలో ట్రంప్ విచారణ కమిషన్ వేశారు. అది ఇంకా తుది నివేదిక ఇవ్వాల్సి ఉంది. అయితే, ఈ కమిషన్ అభిశంసించిన ఐదు రష్యన్ సంస్థలు, 19 మంది రష్యన్ అధికారులపై ట్రంప్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అధ్యక్ష ఎన్నికల్లో వేలు పెట్టినందుకు, సైబర్ దాడులకు పాల్పడుతూ అమెరికన్ ప్రభుత్వ, సంస్థల ఈమెయిళ్లను, వెబ్‌సైట్లను హ్యాక్ చేసినందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ చెప్పారు. దీనిపై కూడా తాము దీటుగా ప్రతిస్పందిస్తామని పుతిన్ ప్రకటించారు.

రైతుకు మద్దతు తథ్యం

2022 లోగా ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం.. కృషి ఉన్నతి మేళాలో ప్రధాని మోదీ హామీ


ఢిల్లీలో శనివారం జరిగిన కృషి ఉన్నతి మేళా-2018లో రైతులకు అవార్డులు అందజేస్తున్న మోదీ

న్యూఢిల్లీ, మార్చి 17: ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. బడ్జెట్లో ప్రకటించిన కనీస మద్దతు ధరపై రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో ప్రకటించినట్లుగా పంటల ఉత్పత్తి వ్యయంపై రెండున్నర రెట్లు కనీస మద్దతు ధర కల్పించేందుకు కేంద్రం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జరుగుతున్న కృషి ఉన్నతి మేళాలో ప్రధాని మోదీ శనివారం పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంపై ఈ మేళాలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ.. 2022లోగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని పునరుద్ఘాటించారు. వంట నూనె దిగుమతులను తగ్గించుకునేందుకు నూనెగింజలను పండించాలని రైతులకు పిలుపునిచ్చారు. యూరియా వాడకాన్ని 2022లోపు సగం వరకు తగ్గించాలని కోరారు. రైతులకు అవసరమైన విత్తనాలను, విద్యుత్తును నిరంతరం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బడ్జెట్‌లో ప్రకటించినట్లుగా పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. కనీస మద్దతు ధరపై రైతులను గందరగోళానికి గురిచేసేందుకు చాలా మంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. పంట ఉత్పత్తి ఖర్చును తగ్గించడం ద్వారా మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం.. మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి మార్కెట్ల నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీల వరకు అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సేంద్రియ ఉత్పత్తుల కోసం ఈ-మార్కెటింగ్ పోర్టల్‌ను మోదీ ప్రారంభించారు. కృషి ఉన్నతి మేళా వంటి కార్యక్రమాలను మారు మూల ప్రాంతాల్లో నిర్వహించడం ద్వారా రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. వీటివల్ల రైతులు సాగులో ఆధునిక పద్ధతులను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, మేఘాలయా సీఎం కన్రాడ్ సంగ్మా, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌తో పాటు పలు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులు హాజరయ్యారు.

చైనా అధ్యక్షుడిగా మళ్లీ జిన్‌పింగ్

ఇక జీవితకాలం చక్రవర్తి ఆయనే!


అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న జీ జిన్‌పింగ్

బీజింగ్, మార్చి 17: చైనా అధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్ రెండోసారి ఎన్నికయ్యారు. దేశాధ్యక్షుడిగా ఎవరూ రెండు దఫాలకు మించి చేయకూడదని నిబంధన ఉండేది. దీనికి 'రబ్బరు స్టాంపు' పార్లమెంటు చెల్లుచీటీ రాసి, జిన్‌పింగ్ జీవితకాల అధ్యక్షుడిగా కొనసాగేందుకు మార్గం సుగమం చేసింది. ఇది జరిగిన కొద్ది రోజులకే ఆయన తిరిగి లాంఛనంగా పట్టాభిషిక్తుడు అయ్యారు. చైనా సైన్యాన్ని శాసించే అత్యంత శక్తిమంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) అధినేతగా కూడా జిన్‌పింగ్ ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు రెండు దఫాల పరిమితిని మార్చి 11న పార్లమెంటు- నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్పీసీ)తొలగించింది. ఈ మేరకు అధికార చైనా కమ్యూనిస్టు పార్టీ తెచ్చిన రాజ్యాంగ సవరణను 2,900 మందికిపైగా సభ్యులు ముక్తకంఠంతో ఆమోదించారు. దేశ ఉపాధ్యక్షుడిగా జిన్‌పింగ్‌కు విశ్వాసపాత్రుడైన వాంగ్ కిషాన్ ఎన్నికయ్యారు. మావో మరణానంతరం ఉమ్మడి నాయకత్వం ఉండాలనే ఉద్దేశంతో కమ్యూనిస్టు పార్టీ ఈ నిబంధనను తెచ్చింది. అయితే ఒక్క రాజ్యాంగ సవరణతో జిన్‌పింగ్ పదవిలో జీవితకాలం కొనసాగడానికి.. .సార్వభౌమాధికారిగా వెలుగొందడానికి ముందుగానే రంగం సిద్ధమైంది. జిన్‌పింగ్ చైనా శాశ్వత అధ్యక్షుడిగా ఉండేలా ఆ దేశ పార్లమెంటులో చట్ట సవరణ చేయడంపై విదేశాల్లోని చైనా విద్యార్థులు నిరసన గళం వినిపిస్తున్నారు. చట్టసవరణకు వ్యతిరేకంగా ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున నిరసన ప్రసంగాలు వెల్లువెత్తుతున్నాయి.



ఎవరీ వాంగ్?

ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాంగ్ కిషాన్(69) సీపీసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేసి రిటైర్ అయారు. ఏడుగురు సభ్యులు ఉండే ఆ కమిటీ పార్టీలో ఎంతో శక్తిమంతమైనది. జిన్‌పింగ్ ప్రారంభించిన అవినీతి వ్యతిరేక ఉద్యమానికి ఐదేళ్లుగా సారథ్యం వహించిన వాంగ్ బెంబేలెత్తించారు.విదేశాంగ మంత్రి వాంగ్ యీకు స్టేట్ కౌన్సిలర్‌గా పదోన్నతి లభిస్తే.. దేశ అత్యున్నత దౌత్యవేత్త అవుతారు. భారత్‌తో సరిహద్దు చర్చల్లో చైనా ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరిస్తారు.



'హెపటైటిస్-బీ'కి ఉచిత మందులు: నడ్డా

న్యూఢిల్లీ, మార్చి 17: కాలేయ సంబంధిత వ్యాధి 'హెపటైటిస్-బీ' నివారణకు త్వరలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఇందుకోసం కేంద్రం ఓ పథకాన్ని రూపొందిస్తోందన్నారు. కాలేయ అధ్యయన సదస్సులో ఆయన మాట్లాడుతూ..హెపటైటిస్-బీ, హెపటైటిస్-సీ, కాలేయ క్యాన్సర్ వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వీలైనంత త్వరలోనే హెపటైటిస్-సీ నివారణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, హెపటైటిస్-బీ నివారణకూ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని కేంద్రం భావిస్తోందని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలందరికీ హెపటైటిస్-బీ వ్యాక్సినేషన్‌ను ఉచితంగా అందిస్తామన్నారు.

థర్డ్ పార్టీ వెబ్‌సైట్లలో ఆధార్ డేటా లీక్

- గూగుల్ సెర్చ్‌లో పీడీఎఫ్‌లు లభ్యం
- స్పందించిన యూఐడీఏఐ.. లింకుల బ్లాక్

న్యూఢిల్లీ, మార్చి 17: ఆధార్ డేటా లీక్ అయ్యే ప్రసక్తేలేదని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) పదేపదే చెబుతున్నా అది తప్పని రూఢీ అవుతోంది. ఇటీవలే ఓ ఫ్రెంచ్ ఎథికల్ హ్యాకర్ ఏపీ ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఆధార్ డేటా లీక్ అవుతోందని ట్విటర్‌లో అప్రమత్తం చేశారు. తాజాగా శనివారం థర్డ్ పార్టీ వెబ్‌సైట్లలో ఇతరుల ఆధార్ వివరాలు పీడీఎఫ్ రూపంలో లభిస్తున్న విషయం వెలుగు చూసింది. గూగుల్‌లో 'మేరా భారత్.. మేరా పెహచాన్ ఫైల్‌టైప్:పీడీఎఫ్' అని ఆంగ్లంలో సెర్చ్ చేస్తే పలువురి ఆధార్ వివరాలు కంప్యూటర్ తెరపై ప్రత్యక్షమయ్యాయి. ఈ వార్త సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించడంతో యూఐడీఏఐ నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లను సంప్రదించి ఆధార్ కార్డు ఫైళ్లను అందుబాటులో పెట్టిన వెబ్‌సైట్ల యూఆర్‌ఎల్(లింకు)లను తొలగించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. 'మొబైల్ కనెక్షన్ వంటి థర్డ్‌పార్టీ సేవలను పొందేందుకు ప్రజలు ఆధార్ వివరాలు అందిస్తున్నారు. పలు వెబ్‌సైట్లు వీటిని అప్‌లోడ్ చేశాయి. ఒకరి ప్రమేయం లేకుండా వారి ఆధార్ వివరాలను నెట్‌లో అప్‌లోడ్ చేయడం నేరం' అని పేర్కొంది. 'కేవలం థర్డ్ పార్టీ వెబ్‌సైట్లలో ఆధార్ ఫైళ్లు ప్రత్యక్షమయ్యాయి. యూఐడీఏఐ వెబ్‌సైట్, సర్వర్లలోని డేటా పదిలంగా ఉంది' అని వివరణ ఇచ్చింది. కాగా.. ఆధార్ డేటా లీక్‌పై నెటిజన్లు ట్విటర్‌లో మండి పడ్డారు.

మోదీ సర్కారుపై మరిన్ని ఆందోళనలు

- బీజేపీని ఓడించేందుకు ఇతర పార్టీలతో కలిసి కృషి: ఏచూరి
- మే 23న వామపక్ష సంఘాల నిరసన మార్చ్

న్యూఢిల్లీ, మార్చి 17: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మరిన్ని ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హెచ్చరించారు. పార్టీ పొలిట్‌బ్యూరో రెండు రోజుల సమావేశంలో 22వ పార్టీ కాంగ్రెస్‌లో చర్చించాల్సిన రాజకీయ నివేదికను సిద్ధం చేశామన్నారు. మహారాష్ట్రలో ఇటీవల రైతు మార్చ్ విజయవంతం పట్ల పొలిట్‌బ్యూరో ఆనందం వ్యక్తం చేసిందన్నారు. రాజస్థాన్‌లోనూ భూమిపై అధికారం కోసం 200 వామపక్ష సంఘాలతో ఇలాంటి ఆందోళనే నిర్వహించామన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కూటమిని ఓడించేందుకు ముందుకొచ్చే పార్టీలతో కలిసి పని చేసేందుకు వచ్చే నెలలో జరిగే 22వ పార్టీ కాంగ్రెస్‌లో ఓ విధానాన్ని రూపొందిస్తామని ఏచూరి చెప్పారు. అయితే, కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహనపై ఏచూరి, సీనియర్ నేత ప్రకాశ్ కరత్ మధ్య తలెత్తిన విభేదాలను ఈ సందర్భంగా తొలగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 22వ పార్టీ కాంగ్రెస్ ఏప్రిల్ 18-22 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనుంది. కాగా, కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా మే 23వ తేదీన అన్ని రాష్ట్రాల రాజధానుల్లో నిరసన మార్చ్ చేపట్టాలని 100కు పైగా వామపక్ష సంఘాలు నిర్ణయించాయి. 'జన్ ఏక్తా జన్ అధికార్ ఆందోళన్'(జేఈజేఏఏ) పేరుతో నిరసన దినం పాటిస్తాయని సమన్వయ కమిటీ సభ్యుడు హన్నన్ మొల్లా తెలిపారు.

అవసరమైతే మళ్లీ పాక్‌సరిహద్దు దాటుతాం

- హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, మార్చి 17: భారత భద్రతా బలగాలు అవసరమైతే మళ్లీ పాక్ సరిహద్దులు దాటుతాయని.. కశ్మీర్ ప్రాదేశిక సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని భావిస్తే.. చూస్తూ ఊరుకోబోమని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పాక్‌తో భారత్ స్నేహ హస్తాన్ని ఆశిస్తోందని.. కానీ, ఆ దేశం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. న్యూస్-18 నిర్వహించిన 'రైసింగ్ ఇండియా సమ్మిట్'లో హోంమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ముద్ర వేసిన లష్కరే తాయిబా అధినేత హఫీజ్ సయీద్‌ను పాక్ అందలమెక్కిస్తోందని ఆరోపించారు. 'కశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగా ఉండేది.. ఉంది.. భవిష్యత్‌లో కూడా ఉంటుంది. కశ్మీర్ ఎట్టిపరిస్థితుల్లో భారత్ నుంచి వేరు కాదు. ఇతరులను చూసి, కశ్మీరీ యువత పక్కదోవ పడుతోంది.' అని అన్నారు.

సమాజాన్ని చైతన్య పర్చండి

- శ్రీశైల మహాస్వామికి ప్రధాని పిలుపు
- ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగం
- భక్తులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మోదీ


మోదీ ప్రసంగాన్ని వింటున్న భక్తులు

కర్నూలు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని విడగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నాలకు స్వస్తి పలికేలా ప్రజలను చైతన్య పర్చాల్సిన బాధ్యత సాధువులు, పీఠాధిపతులపై కూడా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మత విద్వేషాలు చెలరేగకుండా..అవినీతికి వ్యతిరేకంగా.. నల్లధనం అరికట్టే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని.. ఇలాంటి కార్యక్రమాల్లోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తే ప్రభుత్వానికి మరింత ఉత్సాహం వస్తుందని ఆయన చెప్పారు. శ్రీశైలజగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామపండితారాధ్య శివాచార్య మహాస్వామి.. శ్రీశైలక్షేత్రంలో ఉగాది ఉత్సవాల సందర్భంగా స్థానిక శివదీక్ష శిబిర ప్రాంగణంలో రాష్ట్రీయ జనజాగృతి ధార్మిక సమ్మేళనం నిర్వహిస్తున్నారు. దాదాపు 5 లక్షల మంది భక్తులు వచ్చారు. వీరిలో 80 శాతం మంది కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి ఏటా వందలాది కిలోమీటర్లు నడిచి వస్తుంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి తదితరులను ఉద్దేశించి ఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. మోదీ ప్రసంగం కన్నడ భక్తులు వీక్షించేందుకు వీలుగా ప్రాంగణంలో భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి మంచి రోజులు వస్తాయని ఆశించినా ఆనాటి పాలకులు పట్టించుకోలేదని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలంలో జరుగుతున్న కార్యక్రమానికి, 12 ఏళ్లకు ఒకసారి జరిగే మహాకుంభమేళాకు సారూప్యత ఉందని చెబుతూ.. కుంభమేళలో సాధువులు ఒక్కచోట చేరి సమాజాభివృద్ధికోసం ఆలోచన చేసి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తారని చెప్పారు. ప్రజలు చెడు వైపు మళ్లకుండా వారు ఆలోచించడం మనకెంతో గర్వకారణమన్నారు. అదేవిధంగా శ్రీశైలంలో ఒక్కచోట చేరిన వారంతా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉన్నతమైన లక్ష్యం చేరుకోవాలంటే వయస్సుతో పనిలేదని.. చిన్న వయస్సులో అయినా చేయవచ్చని అంటూ..ఎలాంటి లక్ష్యం లేకుండా వందేళ్లు బతికినా వ్యర్థమని ప్రధాని అన్నారు. బసవేశ్వరుడు చెప్పిన విధంగానే తమ ప్రభుత్వం పనిచేస్తోందని, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని జనధన్ బ్యాంకు ఖాతాలు తదితర సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. శ్రీశైలం క్షేత్రం మహత్యం గురించి చెబుతూనే ప్రజలందరికీ కన్నడ, తెలుగు భాషల్లో ప్రధాని ఉగాది శుభాకాంక్షలను తెలియజేశారు. ఉగాది పచ్చడి గొప్పతనాన్ని వివరించారు. జీవితంలో కష్ట సుఖాలు కూడా పచ్చడి రుచులు మాదిరే ఉంటాయని వివరించారు. కాగా, ఈ క్షేత్రం మరింత అభివృద్ధి చెందాలంటే రైల్వే రవాణా మార్గం ఏర్పాటు చేయాలని మహాస్వామి ప్రధానిని కోరారు.


ఉప్పొంగిన నిర్లక్ష్యం!

- లిఫ్టులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకుండానే నీటి విడుదల
- మడకశిర ఉప కాలువకు గండి
- నీరు వదిలిన ఒక్క రోజుకే తెగిన కట్ట
- అధికారుల ఉరుకులు..పరుగులు


పొలాల మీదుగా కియ కార్ల పరిశ్రమ వైపు ప్రవహిస్తున్న నీరు

హిందూపురం, మార్చి 17: హంద్రీనీవా సుజల స్రవంతి మడకశిర ఉపకాలువకు నీరు వదిలిన రోజే కాలువ కట్ట తెగిపోయింది. తెగిన కట్ట నుంచి నీరు కియ కార్ల పరిశ్రమ వైపు మళ్లడంతో అధికారులు పరుగులు పెట్టారు. అనంతపురం జిల్లా పెనుకొండ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉపకాలువకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత, హిందూపురం, పెనుకొండ ఎమ్మెల్యేలు నందమూరి బాలకృష్ణ, బీకే పార్థసారథి శుక్రవారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. కాలువ గుండా పరవళ్లు తొక్కిన కృష్ణా జలాలు మొదటి లిఫ్టు కుంభకర్ణ ప్రాజెక్ట్ వద్దకు చేరాయి. అక్కడ రెండు లిఫ్టుల్లో హిందూపురం వైపు నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా మోటార్లకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీరు ఆగిపోయింది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా వచ్చే నీరు భారీగా రావడంతో కుంభకర్ణ లిఫ్టు సమీపంలో శనివారం తెల్లవారుజామున కాలువ కట్ట తెగిపోయింది. ఈ నీరు పొలాల గుండా ప్రవహిస్తూ హరిపురం మీదుగా కియ కార్ల ప్రాజెక్ట్ వైపు పరుగులు పెట్టింది. వెంటనే ఏపీఐఐసీ అధికారులు ఎక్స్‌కావేటర్‌తో నీరు కియ వైపు రాకుండా కట్టను నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శనివారం రిజర్వాయర్ గేట్లను మూసివేసి కాలువలో ఉన్న నీటిని వెంకటగిరిపాళ్యం చెరువు వైపు మళ్లించారు. ఉపకాలువలో వచ్చే నీటిని ఎత్తిపోసేందుకు లిఫ్టులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకుండానే నీటిని విడుదల చేయడంతో అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. అందునా నీటిని వదిలిన రోజే కాలువకు గండిపడటం విశేషం. విద్యుత్ కనెక్షన్లు లేవని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులకు తెలిసినా, ట్రయల్ రన్ కోసం ప్రజాప్రతినిధులు పెట్టిన ఒత్తిళ్లకు తలొగ్గడం వల్లే కాలువ కట్ట తెగినట్టు తెలిసింది.





సీఎం ఉగాది శుభాకాంక్షలు

» నేడు కళారత్న, ఉగాది పురస్కారాలు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విళంబి నామ సంవత్సర ఉగాది తెలుగు ప్రజల జీవితాల్లో ఆరు రకాల రుచులను సమపాళ్లలో అందించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రముఖులైన 47మందికి కళారత్న(హంస), 99మందికి ఉగాది పురస్కారాలు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉగాది వేడుకలు ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయి. అనంతరం సిరివెన్నెల సీతారామశాస్త్రి, వేటూరి ఆనందమూర్తి, అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎం.ఎం.శ్రీలేఖ, వేదాంతం రామలింగ శాస్త్రి, బిజ్జి కృష్ణ తదితరులు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాలను అందుకోనున్నారు. కాగా, మంత్రులు నారా లోకేశ్, కళా వెంకట్రావు, యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తబంగారు లోకం!

నిన్న.. సింహాచలం.. నేడు తిరుమల.. వాహ్..! రెండుచోట్లా అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. పచ్చని గిరులపై నుంచి దిగువకు చూస్తే కనుచూపుమేరలో ఆకాశహర్మ్యాలతో కూడిన భవంతులు కనిపించాలి. కానీ.. వాతావరణలో మార్పులతో తాజాగా శనివారం ఉదయం తిరుమల లోయల్లో వాలిన మబ్బులు పాల సంద్రాన్ని తలపించాయి. దిగువన తిరుపతి పట్టణం కనిపించాల్సి ఉండగా.. అంతటా తెల్లని మబ్బులు ఆవరించి కొత్తబంగారు లోకం కనువిందు చేసింది. ఆపై పగలంతా ఎండ చుర్రుమనిపించినా.. పొద్దువాలగానే చినుకులు రాలి చలివాతావరణం అలముకుంది. తిరుమలకు వచ్చీపోయే భక్తులకు ఈ వింతవాతావరణం మధురానుభూతిని మిగిల్చింది.

-తిరుమల



పనుల్లో యమ జోరుగా..

చెల్లింపుల్లో మందకొడిగానా?

- » పునరావాసంపై చేసిన ఖర్చు ఏది?
- » ఏపీని ప్రశ్నించిన మసూద్ కమిటీ
- » కేంద్రం ఇస్తే తక్షణమే చెల్లించేస్తాం
- » కమిటీకి అధికారుల సమాధానం
- » తొలిసారికీ, ఇప్పటికీ 'పోలవరం'
- » ఊపందుకొందని మసూద్ వ్యాఖ్య

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



పోలవరంప్రాంతంలో పర్యటిస్తున్న మంత్రి ఉమా

పోలవరం ప్రాజెక్టు కోసం సేకరించిన భూమికి పరిహారం చెల్లింపులు మందకొడిగా సాగుతున్నాయెందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర నిపుణుల కమిటీ ప్రశ్నించింది. పోలవరం పనుల తీరును గత రెండు రోజులుగా సమీక్షిస్తోన్న కేంద్ర జలవనరుల కమిషన్ సీఈవో, నిపుణుల కమిటీ ఛైర్మన్ ఎండీ మసూద్ హుస్సేన్ నేతృత్వంలోని కమిటీ శనివారం రాజమహేంద్రవరంలోని జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైంది. ఈ సమావేశంలో మసూద్‌తో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో హాల్దర్, జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు రాజమండ్రిలో మసూద్ కమిటీని కలిశారు. 2013 భూసేకరణ చట్టం అమలు కారణంగా పరిహారం, సహాయ పునరావాస కార్యక్రమాల వ్యయం రూ.33,000 కోట్లకు పెరిగిపోవడాన్ని అధికారులు సవివరంగా కమిటీకి చెప్పారు. అయితే..ఇప్పటిదాకా రూ.4,000 కోట్లమేర మాత్రమే సహాయ పునరావాస కార్యక్రమం కింద వ్యయం చేయడంపై మసూద్ కమిటీ ఆరా తీసింది. భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమం కోసం కేంద్రం నిధులు మంజూరు చేస్తే తక్షణమే వాటిని అర్హులైన వారికి చెల్లిస్తామని జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ వివరించారు. భూసేకరణ, పునరావాసంపై కేంద్ర జలసంఘం వేసిన కొర్రీలకు రాతపూర్వక సమాధానమిస్తే, కేంద్రం ఆమోదించేలా చూస్తామని కమిటీ హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టు పనులపై మసూద్ కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. "ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మా కమిటీ సభ్యులం గత అక్టోబరులో మొదటిసారి పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించాం. ఇప్పుడు మరోసారి పనుల పరిశీలనకు వచ్చాం. పనులు చాలా వేగవంతమయ్యాయి" అని మసూద్ పేర్కొన్నారు.

ఇదీ అంచనా..

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సవరించిన అంచనా వ్యయం రూ.57,940.86 కోట్లను వెంటనే అనుమతించాల్సిందిగా మసూద్ కమిటీకి రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం అంచనా వ్యయాలు పెరిగాయని వివరించింది. "2013-14లో భూసేకరణ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం రూ.2,934.42 కోట్లు అంచనా వేశాం. ప్రస్తుతం అది రూ.33,225.74 కోట్లకు చేరింది. హెడ్ వర్క్స్‌కు సంబంధించి అప్పట్లో రూ.6,600.56 కోట్లు అంచనా వేయగా అది రూ.11,388.37 కోట్లకు పెరిగింది. కుడి ప్రధాన కాలువ పనులు అంచనా అప్పట్లో రూ.2,135.08 కోట్లు ఉండగా, ఇవాళ అది రూ.4.476.09 కోట్లకు చేరింది. ఎడమ ప్రధాన కాలువ పనులు అంచనా అప్పట్లో రూ.1,471.99 కోట్లు ఉండగా ఇప్పుడు రూ.4,644.13 కోట్లకు పెరిగింది. పవర్ హౌస్ అంచనా అప్పట్లో రూ.2,868.40 కోట్లు. ఇప్పుడది రూ.4,205.66 కోట్లకు చేరింది" అని కమిటీ సభ్యులకు వివరించారు. ప్రాజెక్టుకు సంబంధించి.. 54 శాతం పనులు పూర్తయ్యాయని, 2019నాటికి అందుబాటులోకి తీసుకురావడానికి పని చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ప్రాణత్యాగం చేసైనా..
'పోలవరం' కడతాం

» ప్రాజెక్టు ప్రాంతంలో మంత్రి ఉమా పర్యటన

"ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి వైసీపీ కుట్ర చేస్తోంది. నిపుణుల కమిటీ వస్తుందని తెలిసి జగన్ పత్రిక, మీడియాలో నాలుగు రోజులపాటు తప్పుడు కథనాలు రాయించారు. వాటిని ఇంగ్లీషులోకి తర్జుమా చేసి ప్రధాన మంత్రి తదితరులకు పంపించారు. సీబీఐ విచారణ జరిపించాలని కోరుతున్నారు. ఏ విచారణకైనా మేము సిద్ధమే. ప్రాణత్యాగం చేసైనా ప్రాజెక్టు పూర్తి చేస్తాం"అని మంత్రి దేవినేని తేల్చిచెప్పారు. శనివారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. విశాఖ నుంచి శర్మ, రాజమహేంద్రవరం నుంచి ఉండవల్లి స్వచ్ఛంద సంస్థల పేరిట పోలవరంపై తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారులను భయపెట్టాలనుకుంటున్నారని విమర్శించారు.

రాష్ట్రాన్ని వెన్నుపోటు పొడిచారు

» టీడీపీ ప్రజా ప్రతినిధుల ఆగ్రహం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని వెన్నుపోటు పొడిచిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై టీడీపీ ప్రజా ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న మోదీ నాయకత్వానికి, బీజేపీకి ప్రజలు కర్ణాటక ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎంపీ మురళీమోహన్ మాట్లాడుతూ ఏపీని కేంద్రం ఆదుకుంటుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నామని అయితే టీడీపీతో పాటు రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కూడా బీజేపీ వమ్ము చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవిశ్వాస తీర్మానంతో సీఎం చంద్రబాబు సత్తా ఏమిటో ప్రధాని మోదీకి తెలిసివస్తుందని ఎంపీ శివప్రసాద్ అన్నారు. మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీతో పాటు ఏపీ ప్రజలను మోదీ ప్రభుత్వం నమ్మించి వెన్నుపోటు పొడిచిందని చెప్పారు. తమ స్వప్రయోజనాల కోసం జగన్, విజయసాయిరెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ఎమ్మెల్యే వర్మ ఆరోపించారు. మోదీపై ప్రవేశపెట్టనున్న అవిశ్వాసం దేశ రాజకీయాల్లో చంద్రబాబుపై విశ్వాసంగా మారబోతోందని ఎమ్మెల్యే సుగుణమ్మ చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు.

పండక్కి ఆ ముగ్గురూ ఇక్కడే..

» ఉండవల్లిలో సీఎం.. ఉద్దండరాయునిపాలెంలో పవన్

» గుంటూరు జిల్లాలోనే జగన్ యాత్ర

గుంటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర రాజధాని అమరావతి ఈసారి విభిన్న ఉగాది వేడుకలకు వేదిక కానుంది. ఇద్దరు రాజకీయ నాయకులు తమ తెలుగు సంవత్సరాదిని అమరావతిలోనే జరుపుకోనుండగా, మరో నేత కూడా గుంటూరు జిల్లాలోనే రోజంతా గడపనున్నారు. అమరావతి ప్రాంతాన్ని శాశ్వత నివాసం చేసుకొన్న సీఎం చంద్రబాబు, ఉండవల్లిలో పండుగ జరుపుకోవాలని నిర్ణయించారు హైదరాబాద్‌లో ఉంటున్న చంద్రబాబు కుటుంబ సభ్యులు, ఇప్పటికే ఇక్కడకు చేరుకొన్నారు. వారితో కలిసి ఆయన ఆదివారం ఉదయం వేడుకల్లో పాల్గొననున్నారు. అమరావతి వేదికగా జనసేన ఆవిర్భావ సభని నిర్వహించిన ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, ఉగాది రోజు కూడా ఇక్కడే గడపనున్నారు. ఆదివారం ఆయన తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలేనికి చెందిన లంకభూముల ఎస్సీ రైతులను కలుసుకొని, వారి సమస్యలను ఆలకరించనున్నారు. వైసీపీ అధినేత జగన్ ప్రజాసంకల్ప యాత్ర ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమానులో సాగనుంది. ఈ యాత్రలో భాగంగానే భార్య భారతి, పార్టీ శ్రేణులతో కలిసి ఉగాది సంబరాల్లో పాల్గొననున్నారు.

ఉసురు తీసిన సెప్టిక్ ట్యాంకు

» విషవాయువులు వెలువడి నలుగురి మృతి

ఉపమాక (నక్కపల్లి), మార్చి 17: వ్యక్తిగత మరుగుదొడ్డి కోసం మరొక సెప్టిక్ ట్యాంకు నిర్మిస్తుండగా పాత ట్యాంకు నుంచి వెలువడిన విషవాయువులు నలుగురి ప్రాణాలను బలిగొన్నాయి. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో శనివారం ఉదయం ఈ ఘోరం జరిగింది. మృతుల్లో తండ్రీకొడుకు ఉండగా, ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఉపమాక ఎస్సీ కాలనీకి చెందిన కాండ్రకోట అప్పారావు తన ఇంట్లోని సెప్టిక్ ట్యాంకుకు సమీపాన మరొక ట్యాంకు నిర్మాణం కోసం సుమారు ఎనిమిదడుగుల గొయ్యి తవ్వాడు. పాత సెప్టిక్ ట్యాంకు నిండిపోవడంతో ఉదయం పక్కనే రెండో సెప్టిక్ ట్యాంకు కోసం తవ్విన గోతిలో దిగి రెండింటి మధ్య రంధ్రం చేసి ప్లాస్టిక్ పైపు అమర్చేందుకు యత్నించాడు. అయితే పాత సెప్టిక్ ట్యాంకు నుంచి ఒక్కసారిగా విషవాయువులు వెలువడడంతో పాటు సుమారు మూడు అడుగుల మేర నీరు దూసుకువచ్చింది. దీంతో ఉక్కిరిబిక్కిరైన అప్పారావు స్పృహ కోల్పోయాడు. అది చూసిన అతని కొడుకు రాజశేఖర్ గోతిలోకి దిగి తండ్రిని రక్షించాలని ప్రయత్నించాడు. కానీ.. విషవాయువుల ధాటికి అతడు కూడా స్పృహ కోల్పోయాడు. విషయం తెలుసుకున్న అప్పారావు అన్న కుమారుడు కాండ్రకోట సత్తిబాబు వచ్చి, అందులో పడిపోయాడు. అతడి సోదరుడు కృష్ణ గోతిలోకి దిగి రెప్పపాటులో గోతిలో నుంచి సత్తిబాబును బయట పడేశాడు. కానీ కృష్ణ గోతిలోనుంచి బయటికి రాలేకపోయాడు. ఈలోగా అప్పారావు మరో అన్న కుమారుడు కాండ్రకోట నాగేశ్వరరావు వచ్చి.. తన చిన్నాన్న, సోదరులను రక్షించేందుకు గోతిలోకి దిగాడు. అతను కూడా విషవాయువుల వల్ల స్పృహ కోల్పోయాడు. కాలనీ యువకులు, స్థానికులు తాళ్లు, కర్రల సాయంతో గోతిలో పడిన నలుగురినీ బయటకు తీశారు. కానీ అప్పటికే జరగరాని ఘోరం జరిగిపోయింది. కాండ్రకోట అప్పారావు (50), అతని కుమారుడు రాజశేఖర్ (28), అప్పారావు అన్న నూకరాజు కుమారుడు నాగేశ్వరరావు, మరో అన్న మర్నియ్య కుమారుడు కృష్ణ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సత్తిబాబు నక్కపల్లి 30 పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



» ఆకుపచ్చ 'ఉగాది'

కడియం, (రాజమహేంద్రవరం) మార్చి 17: తూర్పుగోదావరిజిల్లా కడియంలోని పల్ల వెంకన్న నర్సరీలో ఉగాదిని పురస్కరించుకుని వివిధ రకాల మొక్కలతో ఉగాది చిత్రాన్ని రూపొందించారు. ఉగాది పచ్చడిలో ఉపయోగించే మామిడికాయ, వేపాకు వంటి ఆకృతులను మొక్కలతో తీర్చిదిద్దారు.

నిర్లక్ష్యాన్ని సహించను

- » ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- » 'గుంటూరు' మరణాలు శాఖాపర వైఫల్యమే
- » హుద్‌హుద్ నాటి స్ఫూర్తి మీలో ఏమైంది?
- » మున్సిపల్ అధికారులపై సీఎం ఆగ్రహం
- » అతిసార మరణాలపై టెలికాన్ఫరెన్స్

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): "పట్టణ ప్రజల ఆరోగ్య రక్షణ బాధ్యత అధికార యంత్రాంగానిదే. నిర్లక్ష్యాన్ని సహించేది లేదు. ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గుంటూరు ఘటన శాఖాపరమైన వైఫల్యమే. ఒక వ్యక్తి వైఫల్యం పదిమంది మృతికి కారణం కావడం దురదృష్టకరం. విపత్తు వస్తే దానిని చక్కదిద్దే వరకు వదిలిపెట్టకూడదు. విశాఖలో హుద్‌హుద్ తుఫాను అప్పుడు ఎలా చేశాం? గుంటూరులో ఆ స్ఫూర్తి ఏమైంది? స్థానికంగా వైఫల్యం చెందితే ఉన్నతస్థాయి యంత్రాంగం చక్కదిద్దాలి" అని మునిసిపల్ శాఖ అధికారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు అతిసార బాధితులను వెంటనే పరామర్శించలేక పోయారని, ప్రకటించిన పరిహారం కూడా వెంటనే అందించలేకపోయారని సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన తన నివాసం నుంచి మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గుంటూరు జిల్లాలో అతిసార వ్యాధి ప్రబలడం, అనంతర పరిణామాలను సీఎంకు ఆ శాఖ మంత్రి నారాయణ, ఆ శాఖ అధికారి కన్నబాబు వివరించారు. దీనిపై విచారణ చేపట్టామని, తాగునీటి పైపులైన్లను యుద్ధ ప్రాతిపదికన మారుస్తున్నామని, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ..."అధికార యంత్రాంగం పనితీరు ప్రభుత్వ గౌరవం పెంచేదిగా ఉండాలి. తప్పు జరగకూడదు. ఒకవేళ జరిగితే సకాలంలో సమర్థంగా సరిదిద్దాలి. అంతే తప్ప ఉదాసీనత, నిర్లక్ష్యాన్ని సహించేది లేదు. జిల్లాల్లో ఎప్పటికప్పుడు తాగునీటి నమూనాలను సేకరించాలి. రక్షిత తాగునీటిని సరఫరా చేయాలి. గుంటూరు లాంటి దుర్ఘటనలు పునరావృతం కారాదు. సెన్సార్ ద్వారా నీటి కాలుష్యంపై పరీక్షలు నిర్వహించాలి. మున్సిపల్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంగా పని చేయాలి" అని స్పష్టం చేశారు. గుంటూరు ఘటనపై వెంటనే నివేదిక పంపాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో పైపులైన్ల లీకేజీలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. మురుగు కాలువలను శుభ్రపరచాలని, శిథిలావస్థకు చేరిన పాత పైపులైన్లు తొలగించి, కొత్తవి వేయాలని ఆదేశించారు. రోడ్డు కొట్టేయడం, గుంతలు అలాగే వదిలేయడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. సూపర్‌వైజర్లను నియమించుకోవడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేయడాన్ని సీఎం తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు కమిషనర్‌పై వేటు

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 17 : గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా అనురాధపై అతిసార వేటు పడింది. అనురాధను బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దినేష్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిషనర్‌గా ఎల్ఎస్ బాలాజీరావును నియమించారు.

ప్రభుత్వ పనితీరు భేష్

- » 62 శాతానికి పెరిగిన సంతృప్త స్థాయి
- » రేషన్‌పై 76%.. ఇసుకపై 84% సంతృప్తి
- » రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా సమీక్ష

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో 62% మంది సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో 57% ఉన్న సంతృప్త స్థాయి తాజాగా 62 శాతానికి పెరిగింది. రాష్ట్రంలో రేషన్ పంపిణీపై గత డిసెంబరులో 68శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా.. ఇప్పుడు అది 76 శాతానికి పెరిగింది. ఇసుక మాఫియాపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ఇసుక అందుతున్న తీరుపై ప్రజల్లో సంతృప్తస్థాయి గణనీయంగా పెరిగింది. గతంలో 47శాతం మంది మాత్రమే దీనిపై సంతృప్తి వ్యక్తం చేయగా.. ఇప్పుడది 84 శాతానికి పెరిగింది. 1100 కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో సంతృప్త స్థాయి పెరిగిందని రియల్‌టైమ్ గవర్నెన్స్ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

నక్కపల్లి బాధితులను ఆదుకోండి: సీఎం

రాష్ట్రంలో శనివారం సంభవించిన వేర్వేరు సంఘటనలపై సీఎం చంద్రబాబు రియల్‌టైమ్‌లో సమీక్షించారు. విశాఖపట్నం జిల్లాలోని నక్కపల్లిలో మురుగు గుంటలో పడి నలుగురు మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను తక్షణం ఆదుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు కృష్ణా జిల్లా గుడివాడలో ఒక ఇంట్లో దోపిడీ దొంగలు చొరబడి ఇద్దరిని హత్యచేసి నగలు దోచుకుపోయిన సంఘటనపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. దోపిడీ దొంగలను పట్టుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో అకాల వర్షాల పరిస్థితిపైనా చంద్రబాబు సమీక్షించారు. కృష్ణా జిల్లాలో మినుము రైతులు నష్టపోయే ప్రమాదముందని, గుంటూరులో మిర్చి రైతులు కూడా పంటలను పొలాల్లో ఎండబెట్టుకుని ఉంటారని, అవి తడిస్తే నష్టం వస్తుందని, రైతులను అప్రమత్తం చేయాలన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాలన్నారు.

ఒంటరిగానే మా పోరు!

ఇతర పార్టీలతో పొత్తులుండవు



- » వామపక్షాలతో తొలినుంచే అవగాహన
- » హోదాపై నాలుగేళ్ల క్రితమే మోదీకి చెప్పాను
- » జగన్‌పై ఆరోపణలకు కట్టుబడి ఉన్నాను
- » టీడీపీ ప్రభుత్వంలో అవినీతి పెరిగింది
- » సభలో పేర్కొన్నవన్నీ సీఎంకు చెప్పినవే
- » జనసేన అధిపతి పవన్ స్పష్టీకరణ

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 'ఎవ్వరితోనూ పొత్తుల్లేవ్! 2019 ఎన్నికల్లో ఒంటరిగానే మా పోరాటం' అని జనసేన అధిపతి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అవినీతిపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. రాష్ట్రానికి తక్షణం ప్రత్యేక హోదా ఇవ్వాలని నాలుగేళ్ల క్రితమే ప్రధాని నరేంద్ర మోదీని కోరానన్నారు. యువత తన కున్న బలమని తెలిపారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పవన్ మాట్లాడారు. ఇతర పార్టీలతో పొత్తుల గురించి ప్రశ్నించగా 'ఒంటరిగానే మా పోరు' అన్నారు. వివిధ అంశాలపై పవన్ స్పందన ఆయన మాటల్లోనే...

హోదా అవసరాన్ని అప్పుడే గుర్తించా!

ప్రత్యేక హోదా ప్రాధాన్యాన్ని ఎన్నికల సమయంలోనే గుర్తించాను. అందుకే కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే .. తక్షణమే ప్రత్యేక హోదాను ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరాను. ఈ అంశాన్ని నాలుగేళ్లుగా ప్రస్తావిస్తున్నదీ, మొట్టమొదటిసారిగా మోదీపై నేరుగా విమర్శలు చేసిందీ నేనే. హోదా కోసం పోరాడతాను. త్వరలోనే కార్యాచరణ వెల్లడిస్తా!

దక్షిణాదిపై చిన్నచూపు...

దక్షిణాది వారిపట్ల ఉత్తరాది వారు వివక్ష చూపుతున్నారు. గతంలో ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య అంతరం గురించి మాట్లాడినప్పుడు నాతో చాలా మంది విభేదించారు. ఇప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం సిద్దరామయ్య కూడా దక్షిణాది పట్ల ఉత్తరాదివాళ్లు వివక్ష చూపుతున్నారని విమర్శిస్తున్నారు. ఉత్తరాది పెత్తనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఫాతిమా అంశం కేంద్రం పరిధిదే, కానీ..

ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్య కేంద్రం పరిధిలోనిదే. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ సమస్యను సానుభూతితో పరిష్కరించి ఉంటే బాగుండేది. మార్గదర్శకాల ప్రకారమే అన్నీ జరగవు. కొన్నిసార్లు మానవతా దృక్పథంతోనూ ప్రభుత్వం వ్యవహరించాల్సి ఉంటుంది.

నాలుగో భాగమే వినియోగం .. ఐతే!

రాజధాని నగర నిర్మాణం కోసం సమీకరించిన 33000 ఎకరాల్లో నాలుగో వంతు మాత్రమే వినియోగిస్తారని నేనూ అంగీకరిస్తాను. అయితే.. నేను గతంలో చంద్రబాబుతో సంప్రదింపులు జరిపినప్పుడు రాజధాని నిర్మాణం కోసం 1400 ఎకరాలు సరిపోతుందని, మంగళగిరి వద్ద ఉన్న అటవీ భూములను డీ-నోటిఫై చేస్తే అక్కడే రాజధాని నగర నిర్మాణం చేస్తానని చెప్పారు. కానీ, ఆ తర్వాత రైతుల నుంచి 33 వేల ఎకరాలు సమీకరించారు. దీనినే నేను ప్రశ్నిస్తున్నాను. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో నేను చేసిన ప్రసంగంలోని అంశాలు గతంలో చంద్రబాబుకు వ్యక్తిగతంగా చెప్పినవే. టీడీపీ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయింది. ఒక ప్రాంతం, సంస్కృతీ సంప్రదాయాలను మరో ప్రాంతం వారు గౌరవించకుంటే ప్రాంతీయ విద్వేషాలు తలెత్తుతాయి. తెలంగాణ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కూడా కళింగాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ప్రాంతీయవాదం పెరిగిపోయే ప్రమాదముంది.

» జగన్‌పై విమర్శలే...

2014 ఎన్నికల సమయంలో వైసీపీని విమర్శించొద్దని .. తమకు జగన్ అంటే అభిమానమని, నేనంటే ఇష్టమని విశాఖలో పలువురు నన్ను అభ్యర్థించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు వ్యక్తిగత అభిప్రాయాలకు విలువ ఉండదు. పార్టీపరమైన నిర్ణయాలు ఉంటాయి. ఎన్నికల్లో జగన్ ను విమర్శిస్తాననే చెప్పాను. వద్దని కాళ్లావేళ్లా పడ్డా నాలో మార్పు రాలేదు. జగన్‌పై చేసిన అవినీతి ఆరోపణలకు కట్టుబడి ఉన్నాను.

జనసేన లీగల్ సెల్ ఏర్పాటు

» అంబేడ్కర్ పేరిట నామకరణం

అమరావతి/విజయవాడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అమరావతి శాఖ లీగల్ సెల్‌ను ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఈ విభాగానికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లీగల్ సెల్‌గా పేరు పెట్టారు. ఈ సెల్ ప్రతినిధులుగా కొప్పెర కోటేశ్వరరావు, వెన్నా యతేంద్రకుమార్, బెల్లపు సత్యనారాయణ, పి.ఆర్.కె.కిరణ్, షేక్ సులేమాన్, బి.కమలకుమారిని నియమించారు. ప్రత్యేక హోదా సాధనకు న్యాయపరంగా ఏ రకమైన పోరాటం చేయవచ్చు, చట్టంలో ఉన్న అవకాశాలు ఏమిటనే అంశాలను పరిశీలించాలని పవన్ వారికి సూచించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విజయవాడలోని పార్టీ తాత్కాలిక కార్యాలయంలో వివిధ వర్గాల వారితో పవన్ భేటీ అయ్యారు. పవన్‌ను కలిసి మద్దతు ప్రకటించిన పలువురు న్యాయవాదులు... పార్టీకి న్యాయపరమైన సహకారం అందించేందుకు ముందుకొచ్చారు.



ఏపీకి హోదా ఇస్తే దేశంలో అశాంతి

- ప్రత్యేక హోదాపై అప్పుడు మోదీకి అవగాహన లేదు
- తిరుపతి సభలో ఎవరో ఇచ్చిన చీటీ చూసి చెప్పారు
- 'ఆంధ్రజ్యోతి'తో బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే దేశంలో అశాంతి ఏర్పడుతుందని తెలంగాణ బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టే హక్కు పార్టీలకు ఉందని, తీర్మానంపై జరిగే చర్చలో అన్ని విషయాలు వివరించేందుకు ప్రధాని మోదీ సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయమై శనివారం కిషన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతి సభలో ఎవరో ఇచ్చిన చీటీ చూసి అన్నారు. ప్రత్యేక హోదాపై అప్పుడు మోదీకి సరైన అవగాహన లేదు. ఇప్పుడు ఏపీకి ఇస్తే దేశంలో అశాంతి నెలకొంటుంది. అందుకే స్పెషల్ ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రం నిర్ణయం తీసుకుంద"ని చెప్పారు. ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ ప్రకారం కేంద్రం నిధులు ఇస్తుందని, ఆందోళన అవసరం లేదని తెలిపారు. హోదా విషయంలో అసత్య ప్రచారాలు చేయటం మానుకోవాలని ఏపీలో ప్రతిపక్ష పార్టీలకు హితవు చెప్పారు. రానున్న ఎన్నికల్లో జనసేన, వైసీపీలతో బీజేపీ పొత్తు అంశం ఇప్పటి వరకు పార్టీలో చర్చకు రాలేదని తెలిపారు. ఏపీలో ప్రతిపక్ష నేతగా జగన్‌ను అక్కడి చంద్రబాబు ప్రభుత్వం గుర్తించగా లేనిది ప్రధాని మోదీ జగన్‌కు అపాయింట్‌మెంట్ ఇస్తే తప్పేంటని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.



దేశం చూపు ఏపీ వైపు!

(మూడో పేజీ తరువాయి)

పార్టీల నేతలను వ్యక్తిగతంగా కలిసి, మద్దతు కూడగట్టాలన్నారు. ఈ బాధ్యతను ఆరుగురు ఎంపీలకు అప్పగించారు. అవిశ్వాసంపై సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నామని.. మూడు పార్టీల మహా కుట్రను బయటపెట్టామన్న చర్చ ప్రజల్లో జరుగుతోందని చంద్రబాబు తెలిపారు.

కేరాఫ్ పీఎంవో

విపక్ష నేత జగన్, జనసేన అధ్యక్షుడు పవన్‌లు కేంద్రాన్ని ప్రశ్నించకుండా తనను విమర్శించడమేమిటని చంద్రబాబు నిలదీశారు. "ఇలాంటి సమయంలో నన్ను బలహీనపరిచి ఎవరికి మేలు చేస్తున్నారు? కేసుల మాఫీకే వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి ప్రధానమంత్రి కార్యాలయంలో తిరుగుతున్నారు. కేంద్ర పెద్దలకు పాదాభివందనాలు, ప్రదక్షిణలు చేయడమంతా దీనికోసమే. జగన్ కేసులకు ఇప్పుడే ఎందుకు సడలింపులు వస్తున్నాయి? రేపో, మాపో జగన్‌పై కేసులు కూడా కొట్టేస్తారనే ప్రచారం జరుగుతోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. కుట్ర రాజకీయాలు జరుగుతున్నాయని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో సరైన గుణపాఠం చెబుతారని తెలిపారు.

అదే నిదర్శనం...

తెలుగుదేశం పార్టీ పెట్టిన అవిశ్వాసానికి గంటలోనే అనేక పార్టీలు మద్దతు తెలపడం.. జాతీయ స్థాయిలో తమపై ఉన్న విశ్వసనీయతకు నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. వైసీపీని ఎవరూ నమ్మడం లేదని, అందుకే ఆ పార్టీ అవిశ్వాసానికి స్పందన రాలేదు. ఈ సందర్భంగా రాజ్యసభలో తన ప్రకటన సమయంలో జరిగిన పరిణామాల గురించి కేంద్ర మాజీ సుజనా చౌదరి వివరించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా వెనుకంజ వేయకుండా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రశ్నించానన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అడ్డుకోవాలని చూసినా ఏపీ ప్రజల మనోభావాలను సభ దృష్టికి తెచ్చానన్నారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ... లోక్‌సభలో అశోక్ గజపతిరాజు, రాజ్యసభలో సుజనా చౌదరి సమర్థంగా మన వాదన వినిపించారని అభినందించారు. ఢిల్లీలో ఇప్పటివరకు తాము కలిసిన పార్టీల నేతలు, వారు ఏమన్నారన్న విషయాన్ని లోక్‌సభా పక్ష నేత తోట నరసింహం వివరించారు. రాష్ట్రానికి న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉందని ఇతర పార్టీలు కూడా అంటున్నాయని చెప్పారు. జాతీయ చానళ్లలో జరిగిన చర్చ వివరాలను ఎంపీ రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రధాని మోదీని విమర్శించకుండా... సీఎంను, లోకేశ్‌ను విమర్శించడం ఏంటని ఒక టీవీ యాంకర్ ప్రశ్నించగా, పవన్ కల్యాణ్ సమాధానం దాటవేశారని తెలిపారు. లోకేశ్‌పై చేసిన ఆరోపణలకు రుజువులు చూపాలని సవాల్ చేయగా జవాబివ్వలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ... "ఆరోపణలు చేసిన మరుసటి రోజే వాటి గురించి విలేకరులు ప్రస్తావించారు. వారూ వీరూ అంటున్నారు కాబట్టే తానూ అన్నానని పవన్ బదులిచ్చారు. గతంలో జగన్ మీడియాలో వచ్చిన పసలేని ఆరోపణలే పవన్ చేశారు" అని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ జాతీయ రాజకీయాల్లోకి వస్తోందని, ఫ్రంట్ ఏర్పాటు చేస్తోందని సమస్యను పక్కదారి పట్టించేలా జాతీయ చానళ్లు ప్రచారం చేస్తున్న విషయం ప్రస్తావించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై చెప్పకుండా జాతీయ రాజకీయాలపైనే మీడియా దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఏపీకి జరిగిన అన్యాయం గురించి జాతీయ మీడియాలో హైలెట్ అయ్యేలా ఎంపీలు దృష్టిపెట్టాలని సూచించారు.

టీడీపీ నోటీసుతో మోదీకి దడ

- తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ టీడీపీ మంత్రులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కేంద్రంపై అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ.. మోదీ సర్కార్‌పై విమర్శల దూకుడు పెంచింది. సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ప్రత్యేక హోదా గోదాలోకి దిగారు. శ్రీకాకుళం జిల్లాలో అయితే కొందరు వృద్ధులు కేంద్రం తీరును నిరసిస్తూ తమ పింఛనులోని 50 శాతాన్ని ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. టీడీపీ ఇచ్చిన నోటీసుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దడ పుట్టిందని మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, చింతకాయల అయ్యన్న పాత్రుడు శనివారం అనకాపల్లిలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఏపీకి ఇచ్చిన మాట తప్పి.. మోసం చేశారని... ఆయనకు ఆంధ్రప్రదేశ్ నుంచే గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని మంత్రి నక్కా ఆనందబాబు గుంటూరు జిల్లా వేమూరులో విరుచుకుపడ్డారు. హోదా విషయంలో మోదీ తీరని అన్యాయం చేశారని మంత్రులు నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావులు గుంటూరులో ధ్వజమెత్తారు. టీడీపీ తీసుకున్న నిర్ణయం.. ఇటీవల కాలంలో ప్రధాని మోదీకి తగిలిన అతి పెద్ద షాక్ అని ఎంపీ కేశినేని నాని విజయవాడలో అన్నారు. అవిశ్వాసంపై చర్చను బీజేపీ జరగనివ్వకపోతే రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ను అవమానించడమేనని టీడీపీ నేత, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ వర్ల రామయ్య అన్నారు. టీడీపీ తీసుకున్న చొరవతో దేశంలోని విపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని ఆసక్తి కనబరుస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప కాకినాడలో చెప్పారు. బీజేపీకి కాలం చెల్లిందని మరో మంత్రి అచ్చెన్నాయుడు టెక్కలిలో విమర్శించారు. కేంద్రం తీరుతో విసిగి వేశారి అవిశ్వాస తీర్మానం పెట్టినట్లు ఎంపీ తోట నరసింహం కాకినాడలో చెప్పారు. బీజేపీతో జగన్ లాలూచీ పడ్డారని మరో ఎంపీ సీఎం రమేశ్ ఆరోపించారు. కాగా, మోదీ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పార్లమెంట్‌లో చర్చకు వచ్చినపుడు టీఆర్ఎస్ ఎంపీలు సహకరించాలని ఏపీ సీపీఐ కార్యదర్శి రామకృష్ణ శనివారం హైదరాబాద్‌లో డిమాండ్ చేశారు. చంద్రబాబు తలచుకుంటే బీజేపీపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విజయవాడలో అన్నారు. ఏపీ అభివృద్ధికి ప్రత్యేక హోదా అవసరమని హీరో మంచు మనోజ్ తిరుపతిలో అభిప్రాయపడ్డారు. సీనియర్ నటులు కూడా స్పందించాలని, వారు ఉద్యమానికి సిద్ధమైతే జూనియర్లూ వారి వెంట నడుస్తారని అన్నారు.



కేంద్రం తీరుకు నిరసన : 50% పింఛను విరాళం

రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని నిరసన తెలియజేస్తూ..శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం రాజాం పంచాయతీ ధర్మపురం గ్రామానికి చెందిన 26 మంది వృద్ధులు తమ పింఛనులో 50 శాతం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. రాష్ట్రానికి హోదా రావాలని, రైల్వే జోన్ కావాలని, వీటి కోసం పోరాడుతున్న చంద్రబాబుకు మద్దతుగానే పింఛనులో రూ.500 చొప్పున విరాళంగా ఇస్తున్నట్లు వారు తెలిపారు.



రానిస్తారా? దాటేస్తారా?

- అవిశ్వాసంపై ఏం చేస్తారు.. సభలో రేపేం జరుగుతుంది?
- పార్టీల్లో హై టెన్షన్.. 50మందికిపైగా మద్దతిస్తే చేపట్టాల్సిందే

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి):అందరిలో హైటెన్షన్! సోమవారం లోక్‌సభలో ఏం జరుగుతుంది? అవిశ్వాస తీర్మానం చర్చకు వస్తుందా? పరిస్థితి ఓటింగ్ దాకా వెళుతుందా? అదే జరిగితే... ఎవరు ఎటువైపు? ఈ ప్రశ్నలన్నీ ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వంపై తొలుత వైసీపీ అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చినప్పటికీ... టీడీపీ రంగంలోకి దిగిన తర్వాతే వేడి మొదలైంది. దీనిపై చర్చ చేపట్టేందుకు 50 మంది ఎంపీల మద్దతు అవసరం కాగా... ఆ సంఖ్య ఎప్పుడో దాటింది. దీనిపై ఓటింగ్ కూడా జరిగేలా పట్టుపట్టాలని ఎంపీలను చంద్రబాబు ఆదేశించారు. అయితే... అసలు అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభ స్పీకర్ చర్చకు అనుమతిస్తారా? ఈ విషయంలో బీజేపీ వ్యూహమేంటి? అనేదానిపై చర్చ జరుగుతోంది. సభలో సవ్యమైన పరిస్థితులు లేవంటూ శుక్రవారం ఈ నోటీసులను పరిగణనలోకి తీసుకోలేదు. మరి... సోమవారం ఏం జరుగుతుందనేదే ఇప్పుడు ప్రశ్న. రూల్ 198 ప్రకారం సభాపతి తనకు అందిన అవిశ్వాస నోటీసును సభలో విధిగా చదవాలి. తీర్మానానికి మద్దతిస్తున్న వారిని తమ స్థానాల్లోనే లేచి నిలబడాలని చెప్పాలి. కనీసం 50మంది సభ్యులు లేచి మద్దతిస్తే ఆ అవిశ్వాస తీర్మానాన్ని అంగీకరించాల్సిందే. దానిపై 10 రోజుల్లోపు చర్చకు సమయం కేటాయించి, ఓటింగ్ జరపాలి. అయితే ఇక్కడే చిన్న మతలబు కూడా ఉంది. సభ సజావుగా జరుగుతున్నప్పుడే అవిశ్వాసాన్ని తీసుకుంటామని సభాపతి చెప్పొచ్చు. అవిశ్వాసానికి మద్దతుగా ఉన్నవారిని లేచి నిలబడమని అన్నప్పుడు... మద్దతిచ్చే వారితో పాటు గొడవ చేసేవారు కూడా లేచి నిలబడి గందరగోళం సృష్టిస్తే ఎవరు దేనికోసం లేచారో తెలియదు. ఈ పరిస్థితిని కారణంగా చూపించి, నోటీసునే పరిగణనలోకి తీసుకోకుండా వదిలేయవచ్చు. శుక్రవారం సభలో అదే జరిగింది. కేంద్రం ఏదో ఒక అంశాన్ని లేవనెత్తించి గందరగోళం సృష్టించే వ్యూహాన్ని కూడా అమలుచేయవచ్చని టీడీపీ ఎంపీలు అభిప్రాయపడుతున్నారు.

'ప్రధాని మోదీ రాష్ట్రాన్ని నట్టేట ముంచారని, గుండె రగిలిన ఆత్మగౌరవ జాతి నీవెంట ఉంది' అంటూ తాజా పరిణామాలను ఉటంకిస్తూ టీడీపీ నేత కాట్రగడ్డ బాబు విజయవాడలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు సంచలనంగా మారాయి.



గుండు గీయించుకుంటున్న మాజీ మేయర్ బంగి అనంతయ్య

హోదా కోసం ప్రాణాలైనా ఇస్తాం

కర్నూలు(ఎక్స్ప్రెస్), మార్చి 17:హోదా సాధనలో ప్రాణాలైనా అర్పిస్తామని కర్నూలు మాజీ మేయర్ బంగి అనంతయ్య అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట అనుచరులతో కలిసి గుండు గీయించుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. హోదా కోసం ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. కాగా, హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నగరంలో టీడీపీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తిరుమల వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ మాట తప్పారని, తెలుగు ప్రజల ఉసురు తగలకమానదని టీడీపీ నేతల విమర్శించారు.

మేమే సూపర్‌స్టార్లం: బాలకృష్ణ

హిందూపురం, మార్చి 17: 'ఒకరిని హీరో చేయడం నాకిష్టం లేదు. మేమే సూపర్‌స్టార్లం' అని సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. శనివారం అనంతపురం జిల్లా హిందూపురంలో ఎంజీఎం క్రీడామైదానంలో రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై మీరేమంటారని విలేకరులు ప్రశ్నించగా.. బాలయ్య పైవ్యాఖ్యలు చేశారు.

ఏపీ బీజేపీ ఇన్‌చార్జిగా రామ్ మాధవ్!

- ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా సోము వీర్రాజు?

న్యూఢిల్లీ, మార్చి 17: అసోం, త్రిపురల్లో పార్టీని విజయ పథంలో నడిపించిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌ను ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్‌గా నియమించింది. టీడీపీని ఇరుకున పెట్టడంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఈ నిర్ణయం జరిగినట్లు తెలిసింది. బీజేపీలోని విశ్వసనీయ వర్గాలు ఈ విషయం తెలిపాయి. అసోం, త్రిపురల్లో బీజేపీ అనూహ్య ఫలితాలను సాధించడంలో రామ్ మాధవ్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. కశ్మీర్‌లో పీడీపీతో కలిసి అధికారాన్ని చేపట్టడంలోనూ ఆయనదే కీలక పాత్ర. ఈ నేపథ్యంలో ఏపీకే చెందిన ఆయనను ఏపీ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు తెలుస్తోంది. అంతేనా, విశాఖ ఎంపీ హరిబాబును మోదీ తన కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే, హరిబాబు స్థానంలో సోము వీర్రాజును ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా నియమించే అవకాశం ఉందని ఆ వర్గాలు వివరించాయి. టీడీపీని ఇరుకున పెట్టడమే ధ్యేయంగా బీజేపీ వేగంగా పావులు కదుపుతోందని ఆ వర్గాలు తెలిపాయి.

సోము వీర్రాజుకు మతి భ్రమించింది

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ సోము వీర్రాజు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అఖిల గాండ్ల తెలికుల సంఘం ట్రస్ట్ చైర్మన్ పాలూరి రామకృష్ణయ్య ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీచ కులమైన గాండ్ల కులానికి చెందిన వ్యక్తిని ప్రధానమంత్రి చేసిన ఘనత బీజేపీదని వీర్రాజు చెప్పడం తమను అవమానించినట్లుగా ఉందని మండిపడ్డారు.

అవిశ్వాసంపై రేపు నిర్ణయం: కవిత

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం విషయమై సోమవారం నిర్ణయం తీసుకుంటామని టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు.

ఇక విజృంభించండి!

- బీజేపీ నేతలకు 'చీఫ్' అమిత్ షా ఆదేశం
- టీడీపీయే మమ్మల్ని వదులుకుంది
- మా ప్రశ్నలకూ బదులివ్వాలి: రామ్‌మాధవ్

న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): "యుద్ధం మొదలైంది. మైండ్ సెట్ మార్చుకోండి. మీరు విజృంభించండి" అని బీజేపీ రాష్ట్ర నేతలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా దిశా నిర్దేశం చేశారు. మూడు నెలల్లో 'సీన్' మొత్తం మారిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఏపీలో పుట్టిన వేడి ఢిల్లీని తాకిన నేపథ్యంలో శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం... 'సార్... మనకు వ్యతిరేకంగా ప్రజల్ని రెచ్చగొడుతున్నారు' అని ఒక నాయకుడు చెప్పినప్పుడు అమిత్‌షా నవ్వారు. "మూడు నెలలు వేచి చూడండి. ఈలోపు అంతా తారుమారవుతుంది. చంద్రబాబు పట్ల ప్రజల్లో వ్యతిరేకత తీవ్రమవుతుంది. దానిని అనుకూలంగా మార్చుకుని, రాష్ట్ర ప్రజలకు కావల్సిన ప్రాజెక్టులను, నిధులను ప్రకటిస్తాం" అని షా చెప్పినట్లు తెలిసింది. ఏపీలో మనమెప్పుడూ గెలవలేదు కదా అని మరో నేత అన్నప్పుడు... "గతంలో త్రిపురలో గెలిచామా? అసోం, హరియాణాలో మనకు బలం ఉండేదా? ఆ రాష్ట్రాల్లో ఇప్పుడు గెలవలేదా? ప్రజలను మన వైపునకు ఎలా తిప్పుకోవాలో బాగా తెలుసు" అని అమిత్‌షా పేర్కొన్నట్లు సమాచారం. రాష్ట్రానికి సంబంధించి వ్యూహం ఇప్పటికే అమలులోకి వచ్చిందని, మూడు నెలల్లో బీజేపీ బాగా పుంజుకుంటుందని ఆయన చెప్పారు. "వెంటనే కసరత్తు మొదలుపెట్టండి. పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలు తక్షణం ఏర్పాటు చేయాలి. మీ మైండ్ సెట్ మార్చుకోండి. మనం బాగా పని చేస్తే ఏపీ మరో త్రిపుర అవడం ఖాయం" అని చెప్పారు.

ప్రజలకు చెప్పండి...

హోదా ఇవ్వడం కష్టమని, దానికి బదులుగా రాష్ట్రానికి ఎంత మొత్తమైనా ఇచ్చేందుకు ఒప్పందం కుదరిందని ప్రజలకు చెప్పాలని అమిత్ షా రాష్ట్ర నేతలను ఆదేశించారు. ఏపీకి కేంద్రం ఇచ్చిన హామీల అమలుకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్న విషయాన్ని కూడా చెప్పాలన్నారు. ఏపీకి ఏం చేశామో వివరించడానికి పీఎంవోలో కార్యదర్శి స్థాయిలో ఒక అధికారిని ఏర్పాటు చేశామని, ఎలాంటి వివరాలు కావాలన్నా ఆయనను అడగొచ్చని తెలిపారు. టీడీపీ నేతలు చేసే విమర్శలను గట్టిగా తిప్పి కొట్టాలని, సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వాడుకోవాలని సూచించారు. నిధులు ఇస్తామన్నప్పటికీ టీడీపీ ఎన్డీయే నుంచి బయటికి పోయిందని ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌తోపాటు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు హరిబాబు, ఇతర నేతలు కామినేని శ్రీనివాస్, మాణిక్యాలరావు, విష్ణుకుమార్ రాజు, సోము వీర్రాజు, మాధవ్, సత్యనారాయణ రాజు, కన్నా లక్ష్మీనారాయణ, పురందేశ్వరి, కావూరి సాంబశివరావు, గంగరాజు పాల్గొన్నారు.

అంతకు మించి చేస్తాం: రాంమాధవ్

అమిత్ షా వద్ద సమావేశం ముగిసిన తర్వాత రామ్ మాధవ్ మీడియాతో మాట్లాడారు. ఏపీకి హోదాకు మించి సహాయం చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. "రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు, ఇతర పార్టీలు ఎంత కట్టుబడి ఉన్నాయో అంతకంటే ఎక్కువ కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. గత నాలుగేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశాం. రాబోయే రోజుల్లో కూడా దాన్ని కొనసాగిస్తాం" అని తెలిపారు. భావోద్వేగంతో లేవనెత్తుతున్న ప్రశ్నలకు అభివృద్ధితో సమాధానం ఇస్తామన్నారు. "ఇప్పటి వరకు బీజేపీ, టీడీపీ ఒకేవైపు ఉన్నాయి. ఇప్పుడు ఎదురెదురుగా నిలిచాం. దీనికి కారణం మేం కాదు. ఎన్డీయే నుంచి బయటికి వచ్చి, కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టి టీడీపీయే వ్యతిరేకంగా మారింది. వారు లేవనెత్తిన ప్రశ్నలకు మేం సమాధానం చెబుతాం. అలాగే... రాబోయే రోజుల్లో మేం అడిగే ప్రశ్నలకూ వారు జవాబు చెప్పాల్సి ఉంటుంది" అని రామ్‌మాధవ్ పేర్కొన్నారు. రాబోయే రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ప్రవేశపెట్టే రాజకీయ తీర్మానం ద్వారా తమ కార్యచరణను, పార్టీ వైఖరిని ప్రజల ముందు పెడుతామన్నారు.

కేంద్రం చిత్తశుద్ధితో ఉంది: హరిబాబు

హోదా విషయంలో భావోద్వేగాన్ని ప్రేరేపిస్తున్నారని హరిబాబు ఆరోపించారు. హోదా ప్రకటిస్తే కలిగే ప్రయోజనాలకు ఒక్క రూపాయి కూడా తగ్గకుండా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అలాగే, విభజన చట్టంలో పేర్కొన్న వివిధ సంస్థలను మూడున్నర సంవత్సరాల్లోనే ఏర్పాటు చేయడం, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అమిత్ షా సూచించారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రానికి కొన్ని పన్ను రాయితీలను ప్రకటించిందని వివరించారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలన్నీ హోదాకు సంబంధించి బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని నిర్ణయించామన్నారు.

బీజేపీ భేటీలో వైసీపీ వ్యూహకర్త!

ఇద్దరికీ పీకే సలహాలేనా?

బీజేపీ, వైసీపీ వ్యూహకర్త ఒక్కరేనా? అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో వైసీపీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) కూడా కనపడడంతో ఈ ఊహాగానాలకు బలం చేకూరింది. గత ఎన్నికల్లో పీకే బీజేపీ వ్యూహకర్తగా వ్యవహరించారు. ఆ తర్వాత ఆయనను వైసీపీ నియమించుకుంది. రాంమాధవ్, ప్రశాంత్ కిశోర్ కలిసికట్టుగా రాష్ట్ర ఎన్నికల వ్యూహాన్ని అమలు చేస్తారని రాష్ట్ర నేతలకు బీజేపీ అధ్యక్షుడు చెప్పినట్లు సమాచారం. కాగా, ఈ భేటీకి పీకే హాజరు కాలేదని, గుజరాత్‌కు చెందిన నేత మన్‌సుఖ్ మాండవీయను చూసి పీకే అనుకున్నారని బీజేపీ నేతలు చెబుతున్నారు. అయితే... పీకే కూడా ఈ భేటీకి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



రైతు సదస్సులో మాట్లాడుతున్న జగన్

కేసీఆర్ నీళ్లు తీసుకెళ్తుంటే.. బాబు ఏం చేస్తున్నారు?

- ఓటుకు నోటు కేసులో భయపడుతున్నారు
- రైతు సదస్సులో జగన్ విమర్శలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వచ్చే ఎన్నికల్లో వైసీపీదే విజయమని, రైతు, ప్రజా సంక్షేమ పథకాలు అమలుచేసి ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయే పాలనను అందిస్తానని వైసీపీ అధ్యక్షుడు జగన్ అన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా గుంటూరు జిల్లా కాకుమాను శివారులో శనివారం జరిగిన రైతు సదస్సులో జగన్ ప్రసంగించారు. ఒకవైపు తెలంగాణ సీఎం కేసీఆర్ అక్కడి రైతులకు లిఫ్టుల ద్వారా నీళ్లు తీసుకెళ్తుంటే... ఇక్కడి సీఎం ఏం చేస్తున్నారని జగన్ నిలదీశారు. అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపుకోసం అనేకసార్లు ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు... రైతులకు మద్దతు ధరపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో భయంతోనే చంద్రబాబు మాట్లాడలేకపోతున్నారని ఆయన విమర్శించారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్రం, టీడీపీ రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. వైఎస్ పాలన రాష్ట్రానికి స్వర్ణయుగమని, తాము అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు అదే విధంగా అండగా ఉంటామని జగన్ ప్రకటించారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా ఎకరాకు రూ.12,500 చొప్పున మే నెలలోనే ఇస్తామన్నారు. పంట రుణాలకు వడ్డీ లేకుండా చేస్తామని, పగటి పూటే వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇస్తామన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ధరల స్థిరీకరణకు రూ.3వేల కోట్లతో నిధిని ఏర్పాటు ఏర్పాటు చేస్తామన్నారు. నీటి కష్టాలు లేకుండా చూస్తామని ప్రకటించారు. ఇటీవల ప్రారంభమైన పదో తరగతి పరీక్షల్లో అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా చేస్తున్న వ్యక్తి ఎవరు అనే ప్రశ్న వచ్చిందని రైతు సదస్సులో ఒక వ్యక్తి జగన్ దృష్టికి తీసుకురాగా... అది ఎస్ఎస్‌సీ బోర్డా? టీడీపీ బోర్డా? అని జగన్ ప్రశ్నించారు. ఈ సభకు ముందు పొన్నూరు మండలంలో కూడా జగన్ యాత్ర చేశారు. కాగా, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని కాకుమానులో ఆదివారం ఉగాది వేడుకల్లో జగన్ పాల్గొంటారు. ఈ దృష్ట్యా ప్రజా సంకల్పయాత్రకు ఆదివారం విరామం ప్రకటించారు.

19న ప్రజా సంకల్ప మానవహారం: బొత్స

'ప్రత్యేక హోదా మా హక్కు' నినాదంతో ఈ నెల 19వ తేదీన ప్రజా సంకల్ప మానవహారం నిర్వహించనున్నట్టు వైసీపీ నేత బొత్స సత్యనారాయణ చెప్పారు. విశాఖ జిల్లా మద్దిలపాలెంలో మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో చేపట్టే ఈ మానవహారంలో ప్రత్యేక హోదా కోరుకునే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బీజేపీ భేటీలో 'పీకే'

- బీజేపీ,జగన్ కుట్రకిదే నిదర్శనం
- ఈడ్రామాను జనంలో ఎండగట్టండి
- శ్రేణులకు కళా వెంకట్రావు పిలుపు

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ-వైసీపీ-జనసేనలు కలిసి ఆడుతున్న నాటకాన్ని, చేస్తున్న కుట్రలను కార్యకర్తలు, ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏపీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు నిర్దేశించారు. 'వైసీపీ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్...ఢిల్లీలో అమిత్‌షా నిర్వహించిన రాష్ట్ర బీజేపీ నేతల సమావేశంలో పాల్గొన్నారు. అది చూసిన వారికి రెండు పార్టీలకు వ్యూహకర్త ఒకరేననేది తెలిసిపోయింది. బీజేపీ ఆధ్వర్యంలో వైసీపీ, జనసేనలు నడుస్తున్నాయనేది ప్రజలు అర్థం చేసుకొన్నారు' అని ఆయన అన్నారు. శనివారం ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రధాన కార్యదర్శులు, సంస్థాగత కార్యదర్శులు, పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జులు, జిల్లా పార్టీ అధ్యక్షులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర పార్టీ కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ రావు దీన్ని సమన్వయం చేశారు. రాజకీయ పరిణామాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జరుగుతున్న లోపాయికారీ వ్యవహారాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కళా వెంకట్రావు పేర్కొన్నారు. మైనార్టీలు, క్రిస్టియన్ల ఓట్ల కోసం వైసీపీ-బీజేపీలు ఎన్నికల ముందు పొత్తు పెట్టుకోవని, ఎన్నికలయ్యాక మాత్రం బీజేపీకి వైసీపీ మద్దతు ఇచ్చి తీరుతుందని ఆయన విమర్శించారు. బీజేపీతో తెలుగుదేశం పార్టీ పొత్తు తెంచుకోగానే రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీలు, క్రిస్టియన్లు కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలుగుదేశం పార్టీ నిలబడి పోరాడుతుండగా, మిగతా పార్టీలు మాత్రం కేంద్రంతో కుమ్మక్కయ్యాయని, ఈ విషయాలను స్థానికంగా వివరించాలని ఆయన నిర్దేశించారు. పార్టీకి ఏ సమాచారం ఇవ్వాలన్నా, ఫీడ్‌బ్యాక్ పంపాలన్నా ఇకనుంచి కైజాలా యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. కాగా, మిత్రద్రోహానికి పాల్పడిన మోదీ పతనం ఆరంభమైందని మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నంలో శనివారం అన్నారు.

కష్టాల పరుగు!



మహేశ్వరి

తల్లిదండ్రులు కోళ్ల ఫారంలో దినసరి కూలీలు. ఉండేందుకు పక్కా ఇల్లు కూడా లేదు. కూలీ డబ్బులతో కుటుంబం గడవడమే కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో తానూ కూలీ పనులు చేసి అమ్మానాన్నకు ఆసరాగా నిలిచింది. అయితే పేదరికాన్ని జయించాలని, తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు పేరు తీసుకురావాలని నిరంతరం తపిస్తుండేది. అందుకు.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కంకణబద్ధురాలైంది. ఫలితంగా.. కష్టాలు ఎదురైనా.. వెనకడుగు వేయకుండా సాగింది. 17 ఏళ్ల వయసులోనే అథ్లెటిక్స్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. ఆమే.. మహబూబ్‌నగర్‌కు చెందిన అథ్లెట్ జి. మహేశ్వరి. క్రాస్ కంట్రీ పరుగులో ఇప్పుడు ఆమె దేశంలోనే రెండో అత్యుత్తమ అథ్లెట్. జనవరిలో గోవాలో జరిగిన జాతీయ క్రాస్ కంట్రీ పోటీల్లో మహేశ్వరి అండర్-18 విభాగంలో రజతం సాధించి సత్తా చాటింది. ఆ ఈవెంట్‌లో తెలంగాణ నుంచి పతకం నెగ్గిన ఏకైక అథ్లెట్‌గా నిలిచింది. ఈ ఒక్కటే కాదు.. అంతకుముందు కూడా రాష్ట్ర, జాతీయస్థాయిలోనూ రాణించిందామె. ప్రస్తుతం అథ్లెటిక్స్ ద్రోణుడు, సాయ్ కోచ్ నాగపురి రమేష్ పర్యవేక్షణలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో శిక్షణ తీసుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో మెరిసేందుకు సిద్ధమవుతోంది.

అథ్లెటిక్స్‌లో దూసుకెళ్తున్న తెలుగమ్మాయి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి)

మహేశ్వరిది మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచెర్ల గ్రామం. తల్లిదండ్రులు నరసింహులు, లక్ష్మమ్మ. రెండు గదుల రేకుల ఇంట్లో వారి నివాసం. నలుగురు సంతానంలో ఆమె పెద్దమ్మాయి. పాఠశాలస్థాయిలోనే మహేశ్వరి ప్రతిభను గుర్తించిన పీఈటీ నిరంజన్ రావు ఆమెను ప్రోత్సహించారు. ఇంటర్‌లో చేరాక కూడా ఆమె పరుగును ఆపలేదు. గ్రామం నుంచి రోజూ 25 కి.మీ. ప్రయాణించి మహబూబ్‌నగర్ వెళ్లేది. కాలేజీ మొదలవడానికి ముందు ఉదయం గంట.. సాయంత్రం మరో రెండు గంటలు ప్రాక్టీస్ చేసేది. బూట్లు కొనే స్థోమత కూడా లేకపోవడంతో ఒట్టి కాళ్లతోనే మహేశ్వరి పరుగులు తీసేది. పాదాలు నొప్పి పుడుతున్నా ఏనాడూ ప్రాక్టీస్‌ను ఆపలేదు. పట్టుదలే ఆయుధంగా.. మరింత కసిగా ముందుకు దూసుకెళ్లింది.

రమేష్ శిక్షణలో రాటుదేలి..: మహేశ్వరి తపన చూసిన నిరంజన్‌రావు, జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి రాజేందర్‌లు సాయ్ కోచ్ రమేష్‌కు ఆమె గురించి వివరించారు. అదే ఆమె కెరీర్‌ను మలుపుతిప్పింది. మహేశ్వరిలో ప్రతిభను గుర్తించిన రమేష్.. సొంత ఖర్చులతో నెల రోజులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంచి తర్ఫీదిచ్చాడు. ఆ తర్వాత సాయ్ హాస్టల్‌లో చేర్పించాడు. రమేష్ శిక్షణలో ఆరు నెలల్లోనే రాటుదేలిన మహేశ్వరి.. గతేడాది త్రివేండ్రంలో జరిగిన సౌత్‌జోన్ మీట్ అండర్-18 విభాగం 800 మీటర్లలో రజతం నెగ్గింది. అక్కడి నుంచి ఆమె వెనుదిరిగి చూడలేదు. ఇప్పుడు స్టీపుల్‌ఛేజ్‌లో ఆమెకు రమేష్ శిక్షణనిస్తున్నాడు. ఏప్రిల్‌లో జరిగే జూనియర్ ఫెడరేషన్ కప్ కోసం మహేశ్వరిని సిద్ధం చేస్తున్నాడు.



కుటుంబసభ్యులతో మహేశ్వరి


ఎమ్మెల్యే సాయం.. గోపీ అండ..: ప్రస్తుతం సికింద్రాబాద్ సాయ్ హాస్టల్‌లో ఉంటున్న మహేశ్వరితో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు అథ్లెట్లకు గోపీచంద్-మైత్రా ఫౌండేషన్ కెరీర్‌తో పాటు వారి చదువుకు సాయం చేస్తోంది. అదేవిధంగా దేవరకద్ర ఎమ్మెల్యే ఆల్లా వెంకటేశ్వర్ రెడ్డి కూడా టోర్నీలకు వెళ్లేందుకు మహేశ్వరికి రూ. 50వేలు సాయం చేశారు.

కావాలి ఆపన్న హస్తం..

చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకెళ్తున్న మహేశ్వరి.. వచ్చే నెలలో జరిగే జూనియర్ ఫెడరేషన్ కప్‌లో స్వర్ణమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తోందిప్పుడు. కానీ..పేదరికం, కుటుంబ భారం ఆమెకు అవరోధాలుగా మారాయి. వివిధ టోర్నీలకు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన ప్రతిసారీ ఆపన్నహస్తం కోసం ఎదురు చూడాల్సి వస్తోందని మహేశ్వరి ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గడమే లక్ష్యం అంటున్న ఆమె.. అందుకు ప్రభుత్వ సాయం కావాలని వేడుకుంటోంది.

'ప్రస్తుతానికి రమేష్ సార్, బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ సార్ నాకు అన్ని వసతులు సమకూరుస్తున్నారు. కానీ, మా కుటుంబం గురించి ఆలోచిస్తేనే బాధగా ఉన్నది. నాకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తే.. కుటుంబానికి ఆసరాగా నిలవడంతో పాటు కెరీర్‌పై మరింతగా దృష్టి పెడతా' - మహేశ్వరి


అరుదైన ప్రతిభ



ఈ అమ్మాయిలో అరుదైన ప్రతిభ దాగున్నది. ఇలాంటి వారిని వదిలేస్తే మళ్లీ దొరకరని వెంటనే హైదరాబాద్ తీసుకొచ్చి హాస్టల్‌లో చేర్పించా. ఇప్పుడు జూనియర్ ఫెడరేషన్ కప్ కోసం స్టీపుల్‌ఛేజ్‌లో శిక్షణ ఇస్తున్నా. భవిష్యత్‌లో ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కచ్చితంగా రాణించగలదన్న నమ్మకం ఉంది.
- సాయ్ కోచ్ నాగపురి రమేష్

మైదాన్
MYDAN
విజయవాడ • ఆదివారం 18 మార్చి 2018

ని'బంధనా'లా..?



ఆటలో మజా.. ఆకర్షణ.. క్రేజ్ పెరగాలంటే కాలానుగుణ మార్పులు అవసరం. ఇందుకు తగ్గట్టుగానే కొత్తవి వస్తాయి.. పాతవి పోతాయి. ప్రపంచ బ్యాడ్మింటన్‌లోనూ ఇలాంటివే ఎన్నో సరికొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. వాటిల్లో కొన్నింటికి ఇప్పటికే ఆమోదముద్ర వేయగా.. మరికొన్నింటిపై మే 19న బ్యాంకాక్‌లో జరిగే బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. అయితే కొన్ని రూల్స్‌పై టాప్ షట్లర్లు, కోచ్‌లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ని'బంధనా'ల కారణంగా భవిష్యత్ ఎలా ఉంటుందోననే ఆందోళన వారి నుంచి వ్యక్తమవుతోంది.

- బ్యాడ్మింటన్‌లో సరికొత్త రూల్స్
- పెదవి విరుస్తున్న కోచ్‌లు, ప్లేయర్లు



నూతన నిబంధనల్లో అత్యంత వివాదాస్పదమైంది సర్వీస్ రూల్ మార్పు. ఈ నెల ఒకటో తేదీ నుంచి కొత్త రూల్‌ను ప్రవేశపెట్టినా.. ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ నుంచి ప్రయోగాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చారు. ఆన్-కోర్టు కోచింగ్ సమయాన్ని తగ్గించడం, స్కోరింగ్ విధానంలో మార్పుల ప్రతిపాదనలపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీజన్‌లో 12 టోర్నీలు ఆడాలనే నిబంధన ఆటగాళ్లకు పెను భారంగా మారనుంది. మార్పుల గురించి ఈ నెల 30న జరిగే ఏజీఎంలో సభ్యులకు అధికారికంగా తెలియజేయనున్నారు. అయితే మెగా టోర్నీలు వరుసగా జరగనున్న నేపథ్యంలో బ్యాడ్మింటన్ సమాఖ్య ఆమోదించిన మార్పులు.. ప్రతిపాదనలు..

ప్రయోగాత్మక సర్వీస్ రూల్..

షట్లర్ నుంచి ఎక్కువగా విమర్శలకు గురవుతున్న సర్వీస్ రూల్. ఆటగాడి ఎత్తుతో సంబంధంలేకుండా.. షటిల్‌ను కోర్టు ఉపరితలానికి 1.15 మీటర్లు (3.8 అడుగులు) మించని ఎత్తులో పట్టుకొని సర్వ్ చేయాలి. గతంలో ఏ ఆటగాడైనా షటిల్.. అతని/ఆమె నడుము కిందకు ఉంచి సర్వీస్ చేయాలనే నిబంధన ఉండేది. ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో ఈ సర్వీస్ రూల్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నారు.

స్కోరింగ్ విధానంలో మార్పులు..

స్కోరింగ్ విధానంలో భారీగా మార్పులు చేసే ప్రతిపాదననూ వరల్డ్ ఫెడరేషన్ సిద్ధం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న మూడు గేమ్‌ల స్థానంలో బెస్టాఫ్ ఫైవ్‌ను తీసుకురానున్నారు. అంతే కాకుండా ఒక్కో గేమ్ పాయింట్లను 21 నుంచి 11కు తగ్గించాలని కూడా ప్రతిపాదించారు.

ఆన్-కోర్ట్ కోచింగ్ సమయం తగ్గింపు..

మ్యాచ్ సమయంలో ఆన్-కోర్టు కోచింగ్ సమయాన్ని తగ్గించడం కూడా ఉంది. ప్రస్తుతం 11 పాయింట్ల బ్రేక్ సమయంలో, గేమ్ ముగిశాక కోచ్‌లు ప్లేయర్లకు సూచనలివ్వడం కనిపిస్తుంది. అయితే దీనిని తగ్గించాలని బీడబ్ల్యూఎఫ్ సిఫారసు చేసింది.

తప్పనిసరిగా పాల్గొనాలి..

మహిళలు, పురుషుల విభాగాల్లోని టాప్-15 షట్లర్లు సీజన్‌లో తప్పనిసరిగా 12 ఈవెంట్లలో పాల్గొనాలి లేదంటే జరిమానా చెల్లించాలి. ఈ 12 ఈవెంట్లలో కామన్వెల్త్, ఆసియా క్రీడలను లెక్కించరు. 2018నుంచి ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. అయితే టాప్ ప్లేయర్ గాయపడితే కోలుకోవడానికి తగిన సమయం కూడా ఉండదు. ఇది వారి ఆటపై తీవ్ర ప్రభావం చూపే చాన్సుంది. విరామం లేకుండా ఆడడం వల్ల గాయాల బెడద ఎక్కువవుతుంది.

వాణిజ్య దృక్పథంతోనే..

బ్యాడ్మింటన్‌కు విశ్వవ్యాప్తంగా పాపులారిటీ పెరుగుతోంది. దీంతో ఆటను మరింత వ్యాపారాత్మకంగా మార్చాలనేది బీడబ్ల్యూఎఫ్ వ్యూహం. మ్యాచ్ రసవత్తరంగా సాగితే అభిమానుల ఆసక్తితోపాటు వ్యాపార, ప్రసార హక్కుల ఆదాయం పెరుగుతుంది. ఇది ఆట అభివృద్ధికి కూడా దోహదం చేస్తుంది. ఈ నేపథ్యంలో బెస్టాఫ్ ఫైవ్ గేమ్ విధానానికి ప్రతిపాదనలు చేశారు. గేమ్‌ను 21 నుంచి 11 పాయింట్లకు తగ్గించడం వల్ల ఫలితం ఎటువైపైనా మొగ్గే చాన్సుంది. అయితే టాప్ షటర్లు చాలామంది ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు.

సింధుకు తంటా..!



సర్వీస్ రూల్స్‌లో మార్పుల కారణంగా ఎక్కువగా ఇబ్బందులకు గురయ్యేది సింధు లాంటి పొడగరి షట్లర్లే..! సర్వీస్ చేసే సమయంలో షటిల్‌ను తక్కువ ఎత్తులో పట్టుకోవాలి. ఈ కారణంగా వారు కొంత వంగి సర్వీస్ చేయాల్సి రావచ్చు. దీంతో షట్లర్ల సహజ ఆట దెబ్బతినే ప్రమాదం ఉంది. వ్లాదిమిర్ ఇవనోవ్, మ్యాడ్స్ పైలర్ లాంటి ప్లేయర్లు కూడా తీవ్రంగా ఇబ్బంది పడనున్నారు. అయితే, పొట్టిగా ఉండే జపాన్ షట్లర్లు నజోమి ఒకుహర, అకానె యమగూచి లాంటి వారికి వచ్చిన నష్టమేమీ లేదు. అటు ఇటుగా 1.55 మీటర్ల ఎత్తుండే వీరిపై కొత్త సర్వీస్ రూల్స్ ఎటువంటి ప్రభావం చూపలేవు.

మోకాళ్లపై నిల్చోవాలా..!

సర్వీస్ రూల్‌ను వరల్డ్ నెంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సెన్ తీవ్రంగా ఆక్షేపించాడు. విక్టర్ ఎత్తు 1.94 మీటర్లు. అయితే తన లాంటి వారు మోకాళ్లపై నిల్చొని సర్వీస్‌చేయాలా? అని ప్రశ్నించాడు. బీడబ్ల్యూఎఫ్ నిబంధనలను వెటకారమాడుతూ మోకాళ్లపై, కిందకు వంగి సర్వీస్‌లు ప్రాక్టీస్ చేసిన వీడియోను అప్‌లోడ్ కూడా చేశాడు.



విక్టర్ అక్సెల్‌సెన్

అదే తేడా

డెన్మార్క్ కోచ్ కెన్నెత్ జొనాసెన్

మిగతా క్రీడలు, బ్యాడ్మింటన్ మధ్య తేడా ఆన్-కోర్ట్ కోచింగ్. అదే మ్యాచ్‌పై ఆసక్తిని పెంచుతుంది. టీవీ అభిమానులు కూడా ప్లేయర్‌కు కోచ్ ఇచ్చే సూచనలను ఆసక్తితో గమనిస్తారు. కానీ మ్యాచ్ సమయంలో ప్లేయర్లు తమ ఆట, తెలివితేటలనే నమ్ముకోవాలని ఇలా చేస్తున్నామని పైకి చెబుతున్నా, మ్యాచ్ సమయం తగ్గించడానికే ఇలా చేస్తున్నారనిపిస్తోంది.



సైనా

ప్లేయర్స్‌కు వ్యతిరేకం: హెచ్‌ఎస్ ప్రణయ్

బ్యాడ్మింటన్ వేగంగా ఆడే క్రీడ. 21 నుంచి 11 పాయింట్లకు తగ్గించడం వల్ల అలుపు తీర్చుకోలేం.. కనీసం చెమట కూడా తుడుచుకోలేం. నిబంధనలన్నీ ఆటగాళ్లకు వ్యతిరేకంగా ఉన్నాయి. 21 పాయింట్ల గేమ్ బోరింగ్ కాదు. అంతగా ఫిట్‌నెస్ లేని వాళ్లు కూడా పుంజుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఊపిరి సలపని షెడ్యూల్

వెంట వెంటనే టోర్నీలు ఆడాలంటే నాకు సాధ్యం కాదు. అత్యుత్తమ ఆటను ప్రదర్శించాలంటే కొంత విశ్రాంతి అవసరం. 12 టోర్నీలు ఆడాలంటే కేవలం పాల్గొనగలం.. గెలవలేం..!



గోపీ

ఆంతర్యం ఏంటో..?

అసలు ఎలాంటి మార్పులు చేయాలనుకుంటున్నారో కూడా అర్థం కావడం లేదు. గతంలో ఆన్-కోర్ట్ ట్రైనింగ్ అనేది ఉండేది కాదు. ఆ తర్వాత దాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు తగ్గించాలనే ప్రతిపాదన చేశారు. ఈ నిర్ణయాల వెనుక లాజిక్ అర్థం కావడం లేదు.



ఊరంతా చదరంగం



- టీ కొట్టు నుంచి బస్టాప్ వరకూ అంతా చెస్ ప్రియులే
- కేరళ గ్రామంలో 50 ఏళ్లుగా 'అఖండ చదరంగ యాగం'

కొన్ని గ్రామాల్లో తాగుబోతులు స్వైర విహారం చేస్తుంటారు. కొన్ని ఊర్లలో ఎక్కడ చూసినా పేకాట పాపారావులు దర్శనమిస్తారు. ఇక పెద్ద పండగొస్తే కోడి పందేల్లో ఆస్తులు కరిగించుకున్నవాళ్లకు కొదవే లేదు. కానీ కేరళలోని మరొట్టిచల్ అలా కాదు! ఆ గ్రామస్థులకు ఎలాంటి చెడు అలవాట్లూ లేవు. వారికి ఉన్న ఒకే ఒక వ్యసనం చదరంగం! ఎంతలా అంటే వాళ్లు చదరంగం ఆడతారు..తింటారు..తాగుతారు! ఎన్నేళ్లుగా అంటే దాదాపు 50 ఏళ్లుగా ఈ ఊళ్లో నిర్విరామంగా రోజూ చెస్ ఆడుతూనే ఉన్నారు. టీ తాగడానికి అలా సెంటర్లోకి వెళ్తే..చెక్క బల్లల మీద వృద్ధులు కళ్లజోళ్లు సర్దుకుంటూ పావులు కదుపుతూ ఉంటారు. బస్టాప్‌లో బస్సు వచ్చేలోగా ఓ ఇద్దరు సీరియస్‌గా గేమ్ ఆడేస్తుంటారు. ట్యాక్సీ స్టాండ్‌లో ఖాళీ సమయాల్లో డ్రైవర్లు చెస్ ఆడుతూ కనిపిస్తారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చెస్ సిలబస్‌లో భాగమైపోయింది. ఇలా మరొట్టిచల్ గ్రామంలో చదరంగం ఓ జీవన విధానంగా మారిపోయింది. 50 ఏళ్లుగా అక్కడ ఓరకంగా అఖండ చదరంగ యాగం జరుగుతూనే ఉందనుకోవచ్చు.

అలా మొదలైంది..

ఒకప్పుడు ఉత్తర కేరళలోని మరొట్టిచల్ బీరు షాపులతో, గాంబ్లింగ్ ఆటలతో, రౌడీ గ్యాంగులతో నిండి ఉండేది. రోడ్డు మీదకు వెళ్లాలంటేనే జనం భయపడేవారు. సెంటర్లో టీ షాప్ నడుపుతున్న ఉన్ని కృష్ణన్ ఈ పరిస్థితిని గమనించాడు. జనానికి ఓ కాలక్షేపం ఉండాలని భావించాడు. అప్పుడు తన షాపు ముందు ఓ చెక్కబల్ల వేసి..64 గడుల చదరంగం బోర్డు ఉంచి..టీ తాగడానికి వచ్చేవారికి నేర్పించాడు. అలా ఒకరి తర్వాత ఒకరు చెస్ నేర్చుకున్నారు. టీ తాగడానికి వచ్చినప్పుడల్లా ఓ గేమ్ ఆడి వెళ్లేవారు. రాజు, రాణి, శకటం, ఏనుగు, గుర్రం, భటులు.. ఇలా నలుపు, తెలుపు గళ్లలో ఇద్దరు ప్రత్యర్థుల మధ్య జరిగే యుద్ధం వారికి కాలక్షేపంతోబాటు బతుకు పోరాటంలో ధైర్యాన్ని నింపింది. అలా ఈ ఆట ఊరంతా విస్తరించింది. 6 వేల జనాభా ఉన్న గ్రామంలో ఇప్పుడు 4 వేలమంది చెస్‌లో ఆరితేరారు. 6వ శతాబ్దానికి చెందిన చదరంగం గ్రామస్థులకు ఏకాగ్రతను, సామాజిక జీవనాన్ని, వ్యసనాలు లేని జీవితాన్ని అలవాటు చేసింది. మరొట్టిచల్ చెస్ సంఘం అంతర్జాతీయంగా కూడా ప్రఖ్యాతిగాంచింది. ఇంటర్నెట్ ప్రభావం ఈ మారుమూల కేరళ గ్రామంపై కూడా ఉంది. చాలామంది యువకులు స్మార్ట్ ఫోన్లలో మునిగి కనిపిస్తారు. కానీ వాళ్లు సోషల్ మీడియా గాసిప్స్ చూడరు. ఆన్‌లైన్‌లో చెస్ ఆడుతూ ఉంటారు! దటీజ్.. మరొట్టిచల్!!

ప్రపంచకప్ ఆర్చరీకి జ్యోతి సురేఖ



హైదరాబాద్: తెలుగు తేజం జ్యోతి సురేఖ ఆర్చరీ వరల్డ్‌కప్ పోటీలకు ఎంపికైంది. చైనాలోని షాంఘై వేదికగా వచ్చేనెల 23 నుంచి 29 వరకు వరల్డ్‌కప్ స్టేజ్-1 టోర్నీ, మే 20 నుంచి 26 వరకు టర్కీలోని అంటాల్యాలో వరల్డ్‌కప్ స్టేజ్-2 చాంపియన్‌షిప్ జరగనుంది. ఈ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు జ్యోతి ప్రాతినిధ్యం వహించనుంది. సోనేపట్‌లో శనివారం జరిగిన సెలెక్షన్ ట్రయల్స్‌లో జ్యోతి 9 పాయింట్లకు 7 స్కోరు చేసి వరల్డ్ కప్‌కు జట్టులో చోటు దక్కించుకుంది.

ఫైనల్ వార్

రాత్రి 7 గంటల నుంచి డీస్పోర్ట్స్, డీడీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

- బంగ్లాదేశ్‌తో టైటిల్ ఫైట్ నేడు
- ఊపు మీదున్న భారత్

నిదహాస్ ముక్కోణపు టీ20 టోర్నీ ఆరంభానికి ముందే దాదాపుగా ఫైనల్ మ్యాచ్ టిక్కెట్లన్నీ అమ్ముడు పోయాయి.. ఎందుకంటే తుది పోరు భారత్, శ్రీలంక జట్ల మధ్య జరుగుతుందనే అంతా ఊహించారు. కానీ జరిగింది వేరు.. తమ 70 ఏళ్ల స్వాతంత్ర్య సంబరాలకు గుర్తుగా నిర్వహిస్తున్న ఈ టోర్నీ నుంచి లంక తప్పుకోగా అనూహ్యంగా బంగ్లాదేశ్.. భారత్ ప్రత్యర్థిగా మారింది. తొలి మ్యాచ్ మినహాయించి వరుస విజయాలతో ఊపు మీదున్న రోహిత్ సేన.. ఇప్పటికే రెండు సార్లు తమ చేతిలో దెబ్బతిన్న బంగ్లాపై అదే స్థాయిలో రాణిస్తుందా...!

ఇక భారత్‌తో ఓటమి ఎదురైన ప్రతీ సారి బంగ్లాదేశ్ జట్టు శ్రీలంకపై రెచ్చిపోయి ఆడుతూ వచ్చింది. శుక్రవారం నాటి మ్యాచైతే వీధి పోరాటాన్ని తలపిస్తూ ఓ రేంజిలో జరిగింది. ఇప్పుడు అదే మూడ్‌తో ఫైనల్లో రోహిత్ సేనపై విరుచుకుపడాలనే కసితో ఉంది.

కొలంబో: తమపై ఇప్పటిదాకా గెలవని బంగ్లాదేశ్ మరోసారి ఫైనల్లో పోరుకు సై అంటున్న వేళ.. భారత జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగబోతోంది. ఇక తమ చివరి మ్యాచ్‌లో పూర్తి హైడ్రామా మధ్య గెలిచిన బంగ్లాదేశ్ కూడా ఏమాత్రం తగ్గకుండానే ఉంది. ఈ టోర్నీలో భారత్‌పై ఒక్క గెలుపు లేకపోవడం వారిని మరింత కసిగా ఆడేలా చేస్తుందనడంలో సందేహం లేదు. ఈరెండు జట్ల మధ్య ఆదివారం ఫైనల్ జరగనుంది. ఆఖరి బంతి వరకు కూడా పట్టువదలని పోరాటాన్ని ప్రదర్శిస్తున్న బంగ్లాను తక్కువ అంచనా వేస్తే భారత్‌కు భంగపాటు తప్పదు. వారు లంకపై గెలిచిన రెండు మ్యాచ్‌లు కూడా చివరి ఓవర్‌లో వచ్చినవే.. వీరి పోరాట తీరును గమనిస్తున్న అభిమానులకు ఈ మ్యాచ్ కనువిందు చేయడం ఖాయం.

ఆత్మవిశ్వాసంతో భారత్

టోర్నీలో భారత్ తొలి మ్యాచ్‌ను మినహాయిస్తే నిలకడైన ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా కెప్టెన్ రోహిత్ శర్మ తన పేలవ ఫామ్ నుంచి బయటపడడం జట్టుకు లాభించనుంది. బుధవారం బంగ్లాతోనే జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో 61 బంతుల్లో 89 పరుగులు చేసి ఫామ్‌ను అందుకున్నాడు. ఇప్పుడు అదే జట్టుతో జరిగే తుది పోరులో మరోసారి తన బ్యాట్‌కు పని చెపితే బంగ్లాకు ఇబ్బందే. శిఖర్ ధవన్, రైనా బాధ్యతాయుత ఆటతీరును కనబరుస్తున్నారు. రాహుల్, మనీష్ పాండే, కార్తీక్‌లతో మిడిలార్డర్ పటిష్ఠంగా కనిపిస్తోంది. ఇక బౌలింగ్ విభాగంలో టీనేజ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ అదరగొడుతున్నాడు. పేసర్ సిరాజ్ ఒక్క మ్యాచే ఆడగా ఓవర్‌కు 12 పరుగుల చొప్పున ఇవ్వడంతో అతడి స్థానంలో ఉనాద్కట్ రావచ్చు. విజయ్ శంకర్, ఠాకూర్ ఆకట్టుకుంటున్నారు.

గెలుపే లక్ష్యంగా బంగ్లా..

షకీబ్ రాకతో బంగ్లా జట్టులో జోష్ కనిపిస్తోంది. దీనికి తగ్గట్టుగానే లంకతో మ్యాచ్‌లో అంతా దూకుడే కనిపించింది. టాప్ ఆర్డర్ తమీమ్, ముష్ఫికర్, సౌమ్య సర్కార్, మహ్మదుల్లా మంచి ఫామ్‌లో ఉన్నారు. లిటన్ దాస్ ఫామ్ తొలి మ్యాచ్‌కే పరిమితమైంది. వాషింగ్టన్ స్పిన్‌ను ఎదుర్కోవడంపై కూడా బంగ్లా దృష్టి సారించింది. ఇక వారి బౌలర్లు పది ఓవర్లలోపే లంక సగం జట్టును పెవిలియన్‌కు చేర్చారు. ఇప్పుడు షకీబ్ స్పిన్ వారికి అదనపు బలం కానుంది.



రోహిత్

ధవన్



షకీబల్

జట్లు (అంచనా)..

భారత్: రోహిత్ (కెప్టెన్), ధవన్, రైనా, పాండే, రాహుల్, దినేశ్ కార్తీక్, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, చాహల్, సిరాజ్/ఉనాద్కట్, ఠాకూర్.

బంగ్లాదేశ్: తమీమ్, లిటన్, సబ్బీర్, ముష్ఫికర్, సౌమ్య సర్కార్, మహ్మదుల్లా, షకీబ్ (కెప్టెన్), మెహదీ హసన్, ముస్తాఫిజుర్, రుబెల్, నజ్ముల్.

షకీబ్, నురుల్‌పై జరిమానా

శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించిన బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబల్ హసన్, రిజర్వ్ ఆటగాడు నురుల్ హసన్‌పై 25 శాతం చొప్పున మ్యాచ్ ఫీజులో కోత పడింది. అలాగే అంపైర్ నిర్ణయాన్ని వ్యతిరేకించినందుకు చెరో డీమెరిట్ పాయింట్ పొందాల్సి వచ్చింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో హైడ్రామా సాగిన విషయం తెలిసిందే. అంపైర్ నోబాల్ ఇవ్వలేదనే కారణంతో తమ ఆటగాళ్లను వెనక్కిరమ్మని షకీబ్ పిలవగా.. మైదానంలోకి వెళ్లిన నురుల్ లంక కెప్టెన్ తిసార పెరీరాతో దురుసుగా ప్రవర్తించాడు. షకీబ్, నురుల్ తమ తప్పును అంగీకరించడంతో ప్రాథమిక విచారణ అవసరం లేదని ఐసీసీ పేర్కొంది. 2016లో ఈ పాయింట్ల పద్ధతి వచ్చినప్పటి నుంచి ఓ ఆటగాడిపై ఒక డీమెరిట్ పాయింట్ పడడం ఇదే తొలిసారి. అయితే వీధిస్థాయి పోరాటానికి దిగిన వీరిద్దరిపై ఇంత తక్కు వ జరిమానాపై విమర్శలు వినిపిస్తున్నాయి. అటు తమ క్రికెటర్ల ప్రవర్తనపై బంగ్లా క్రికెట్ బోర్డు పశ్చాత్తాపం వ్యక్తం చేసింది.



ఫ్చ్.. సింధు

సెమీస్‌లో పోరాడి ఓడిన తెలుగు తేజం • ఫైనల్లో యమగుచి

బర్మింగ్‌హామ్: పీవీ సింధు మరోసారి కీలక సమయంలో ఒత్తిడికి లోనైంది. తొలి గేమ్‌లో లభించిన ఆధిక్యాన్ని చేజార్చుకుంది. బ్యాడ్మింటన్ ఆటగాళ్లు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో సెమీస్‌తోనే వెనుదిరిగింది. శనివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో 21-19, 19-21, 18-21 స్కోరుతో జపాన్‌కు చెందిన వరల్డ్ రెండో ర్యాంకర్ అకానె యమగుచి చేతిలో సింధు పరాజయం చవిచూసింది. గత ఐదుసార్లు క్వార్టర్‌ఫైనల్ దాటని భారత ఏస్ షట్లర్ ఈసారి అద్భుత ప్రదర్శనతో సెమీస్‌కు చేరడంతో సుదీర్ఘ విరామం తర్వాత ఓ భారత ప్లేయర్ ఆల్ ఇంగ్లండ్ టైటిల్ గెలవడం ఖాయమని అభిమానులంతా భావించారు. దానికితోడు క్వార్టర్‌ఫైనల్ వరకూ హోరాహోరీగా జరిగిన మూడు గేముల మ్యాచ్‌ల్లో సింధు అసమాన్య పోరాటంతో విజయాలు దక్కించుకోవడంతో సెమీస్‌లోనూ ఆమె గెలుపు ఖాయమని అంచనా వేశారు. కానీ మరోసారి జపాన్ క్రీడాకారిణి సింధుకు అడ్డుగా నిలిచింది. తొలి గేమ్ విరామం తర్వాత అనూహ్యంగా పుంజుకున్న యమగూచి అదే ఉత్సాహంతో రెండు, మూడు గేమ్‌లను గెలిచి సింధుకు నిరాశ మిగిల్చింది. యమగుచితో మ్యాచ్‌లో తొలి గేమ్ ఆరంభంనుంచే దూకుడు కనబరిచిన సింధు ఓ బాడీస్మాష్‌తో తొలి పాయింట్ సాధించి అదే ఊపుతో ఏకంగా 6-0తో ముందంజ వేసింది. అయితే ఏమాత్రం ఒత్తిడికిలోను కాని యమగూచి ఒక్కో పాయింట్ సాధిస్తూ వచ్చింది. అయితే విరామానికి 11-6తో ఆధిక్యం ప్రదర్శించిన సింధు..అనంతరం మరింత బాగా ఆడి 15-8 ఆధిక్యానికి దూసుకుపోయింది. విరామం తర్వాత యమగుచి అనూహ్యంగా పుంజుకొంది.ఒక్కసారి గేరు మార్చిన జపాన్ షట్లర్..ప్రత్యర్థిని లాంగ్ ర్యాలీలు ఆడేలా చేసి 14-17తో స్కోరు అంతరాన్ని తగ్గించింది. 20-19 వద్ద యమగూచి అమోఘంగా ఓ స్మాష్, ఓ విన్నర్ కొట్టడంతో సింధు రెండు గేమ్ పాయింట్లు చేజార్చుకోవాల్సి వచ్చింది. మరో పాయింట్‌తో తొలి గేమ్‌ను కైవసం చేసుకొని సింధు ఊపిరిపీల్చుకుంది. తొలి గేమ్‌లో సింధును ముప్పుతిప్పలు పెట్టిన ఉత్సాహంతో రెండో గేమ్‌లో యమగూచి 3-2తో ముందంజ వేసింది. కానీ సింధు పుంజుకొని 5-5 స్కోరు సమం చేసింది. ఇద్దరు ర్యాలీలు, షాట్లతో అలరించడంతో 9-9, 12-12తో స్కోరు సమమవుతూ మ్యాచ్‌లో ఉత్కంఠ ఏర్పడింది. ఈ దశలో 44 షాట్లపాటు సాగిన సుదీర్ఘ ర్యాలీలో షటిల్‌ను సింధు నెట్‌కు కొట్టడంతో యమగుచి 15-13 ఆధిక్యం ప్రదర్శించింది. మరో పాయింట్‌తో 16-13తో యమగుచి ముందంజ వేయగా ఆ వెంటనే సాధించిన పాయింట్‌తో సింధు 14-16కు అంతరాన్ని తగ్గించింది. అయితే స్మాష్‌లతో అదరగొట్టిన జపాన్ షట్లర్ 18-14కు ఆపై 19-15కి దూసుకుపోయింది. ఓ కళ్లు చెదిరే డ్రాప్ షాట్‌తో సింధు పాయింట్ రాబట్టగా యమగుచి క్రాస్ కోర్ట్ షాట్ బయటకు వెళ్లడంతో భారత షట్లర్‌కు మరో పాయింట్ లభించింది. మరో పాయింట్‌తో గేమ్‌ను సొంతం చేసుకున్న యమగుచి...నిర్ణాయక గేమ్‌లో అదరగొట్టింది. మరోవైపు ఒత్తిడికి లోనైన సింధు ఆటతీరు దిగజారడంతో జపాన్ షట్లర్ పని సులువైంది. ఆదివారం జరిగే ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో యమగుచి తలపడనుంది.

పోరాడి ఓడిన ప్రణయ్

పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరి భారత శిబిరంలో ఆశలు రేకెత్తించిన హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా తిరుగుముఖం పట్టాడు. శుక్రవారం అర్ధరాత్రి చైనాకు చెందిన హువాంగ్ యు జియాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ 22-20, 16-21, 21-23తో పోరాడి ఓడాడు.

పరువు కోసం పోరాటం

• ఆసీస్ మహిళలతో భారత్ మూడో వన్డే నేడు

ఉ. 9 గం. నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో..

వడోదరా: వన్డే సిరీస్ ఈపాటికే చేజారినా.. చివరి మ్యాచ్‌లోనైనా పరువు దక్కించుకోవాలని భారత మహిళలు ఆరాటపడుతున్నారు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్-ఆస్ట్రేలియా మధ్య ఆదివారం చివరి మ్యాచ్ జరగనుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన ఆసీస్ 2-0తో ఈపాటికే సిరీస్‌ను కైవసం చేసుకుంది. సొంతగడ్డపై రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లతోపాటు రెండు వన్డేల్లోనూ ఓడిన భారత్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన ఆసీస్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వెటరన్ జులన్ గోస్వామి గైర్హాజరీలో భారత బౌలింగ్ విభాగం తేలిపోతోంది. శిఖా పాండే, పూజా వస్త్రాకర్ ధారాళంగా పరుగులివ్వడం ఆందోళన కలిగిస్తోంది. అనుకూల పరిస్థితుల్లోనూ స్పిన్నర్లు ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్.. ఆసీస్ బ్యాట్స్‌వుమెన్‌ను కట్టడి చేయలేకపోతున్నారు. రెండో వన్డేలో ఓపెనర్ స్మృతి మంధానా (53 బంతుల్లో 67) తప్పించి మిగతా వారు ఆసీస్ అటాక్ ముందు నిలవలేక పోయారు. ఈ నేపథ్యంలో సీనియర్లు కెప్టెన్ మిథాలీ రాజ్, హర్మన్‌ప్రీత్, వేదా కృష్ణమూర్తి, దీప్తి శర్మ రాణించాల్సిన అవసరం ఉంది.

హైదరాబాద్‌లో తొలి డే/నైట్ టెస్ట్!

• ఉప్పల్‌లో ఆసీస్‌తో వన్డే, వైజాగ్‌లో టీ20

న్యూఢిల్లీ: అన్నీ అనుకూలిస్తే భారత జట్టు తొలి డే/నైట్ టెస్ట్ మ్యాచ్‌కు హై దరాబాద్ ఆతిథ్యమిచ్చే అవకాశముంది. 2018-19 సీజన్‌కుగాను స్వదేశంలో నిర్వహించనున్న మ్యాచ్‌ల సిరీస్‌లను బీసీసీఐ శనివారం ఖరారు చేసింది. ఇందులో భాగంగా భారత జట్టు స్వదేశంలో మూడు టెస్టు మ్యాచ్‌లను ఆడనుంది. దీంట్లో భాగంగా జూన్‌లో అఫ్ఘానిస్థాన్‌తో చారిత్రాత్మక ఏకైక టెస్టును, అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో రెండు టెస్టులను ఆడనున్నది. వీటిలో ఒక మ్యాచ్‌ను ప్రయోగాత్మకంగా డే/నైట్ టెస్ట్‌గా నిర్వహించాలని బీసీసీఐ భావిస్తోంది. ఆ డే/నైట్ టెస్ట్‌కు వేదికగా హైదరాబాద్, రాజ్‌కోట్‌లలో ఒకదాన్ని ఎంపిక చేయాలని బీసీసీఐ ప్రతిపాదించింది. ఇక వెస్టిండీస్‌తో భారత్ రెండు టెస్టులు, ఐదు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లలో తలపడుతుంది. వన్డేలకు ముంబై, గౌహతి, కొచ్చి, ఇండోర్, పు ణె ఆతిథ్యమివ్వనుండగా, టీ20లను కోల్‌కతా, చెన్నై, కాన్పూర్‌లలో నిర్వహించనున్నారు. ఆ తర్వాత 2019 ఫిబ్రవరి-మార్చిలో ఆస్ట్రేలియా జట్టు ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించనుంది. ఈ సిరీస్‌లో భాగంగా ఐదు వన్డేలు, రెండు టీ20ల ను భారత్‌తో ఆడనుంది. తొలి వన్డే ఫిబ్రవరి 24న మొహాలీలో, 27న జరిగే రెండో వన్డేకు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. మార్చి 2న నాగ్‌పూర్‌లో మూడో వన్డే, 5న ఢిల్లీలో నాలుగో వన్డే, 8న రాంచీలో చివరిదైన ఐదో వన్డే జరగనుంది. రెండు టీ20ల్లో తొలి మ్యాచ్ మార్చి 10న బెంగళూరులో, మార్చి13న జరిగే రెండోటీ20 విశాఖపట్నంలో జరగనున్నాయి.

కాంక్రీట్ కానోయింగ్ విజేత 'విట్'



ముత్తుకూరు: కృష్ణపట్నం పోర్టులో శనివారం జాతీయ స్థాయి కాంక్రీట్ కనోయింగ్ పోటీలు జరిగాయి. అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్‌కి చెంది న ఇండియా స్టూడెంట్ సెక్షన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను కేపీసీఎల్ మెరైన్ ప్రెసిడెంట్ కెప్టెన్ ప్రదీప్‌గౌర్, పీఆర్ హెడ్ వేణుగోపాల్ ప్రారంభించారు. వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల (విట్, చెన్నై), బన్నారీ అమ్మన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాల జీ కళాశాల(బెంగళూరు), ఆర్‌వీ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విట్ విద్యార్థులు విజేతగా నిలవ గా అమెరికాలో జరిగే అంతర్జాతీయ కాంక్రీట్ కనోయింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు.





రైతులకు రుణమాఫీ

- కౌలు రైతులకు వడ్డీలేని రుణాలు
- కాంగ్రెస్ ప్లీనరీలో తీర్మానం

న్యూఢిల్లీ, మార్చి 17: రాబోయే ఎన్నికల్లో తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా రైతులకు రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మోదీ సర్కారు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు దేశంలో వ్యవసాయ సంక్షోభానికి కారణమవుతున్నాయని ధ్వజమెత్తింది. కాంగ్రెస్ 84వ ప్లీనరీ సందర్భంగా శనివారమిక్కడ 'వ్యవసాయం, ఉపాధి, పేదరిక నిర్మూలన'కు సంబంధించి పార్టీ తీర్మానం చేసింది. పంజాబ్ సీఎం అమరీందర్‌సింగ్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఘనమైన హామీలిచ్చిన కేంద్ర ప్రభుత్వం వాటి అమలులో ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. 2022 కల్లా దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి వారిని మోసగించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు 2009లో అమలు చేసిన రుణమాఫీ పథకం వల్ల దేశవ్యాప్తంగా 3.2 కోట్ల మంది రైతులు లబ్ధి పొందారని తెలిపారు. మోదీ సర్కారు ప్రవేశపెట్టిన పంటల బీమా పథకం వల్ల రైతుల కంటే ప్రైవేటు బీమా కంపెనీలే అత్యధికంగా లబ్ధి పొందాయని కాంగ్రెస్ విమర్శించింది. పేదల వ్యతిరేక విధానాలను అవలంబించడం వల్ల దేశంలో ఆర్థిక అసమానతలు బాగా పెరిగిపోతున్నాయని ఆరోపించింది. 'సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్' నినాదాన్ని తెచ్చిన బీజేపీ.. అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం శాశ్వత కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపింది. వారికి వృద్ధాప్య పింఛన్‌ను చట్టబద్ధ హక్కుగా మారుస్తామని చెప్పింది. రెండు హెక్టార్ల వరకు సాగు చేసే కౌలు రైతులు, పాలిరైతులు, రైతులకు పెట్టుబడుల కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తామని పేర్కొంది. అన్నదాతల పిల్లలకు మంచి విద్యనందించడం, కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించడంతోపాటు పింఛన్ల ద్వారా ఆర్థిక, సామాజిక భద్రత కల్పిస్తామని వెల్లడించింది. దేశంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు జాతీయ పేదరిక నిర్మూలన నిధిని ఏర్పాటు చేస్తామని చెప్పింది. ఇందు కోసం దేశంలో అత్యంత సంపన్నులైన ఒక్క శాతం ప్రజల ఆదాయంపై ఐదు శాతం సెస్ విధిస్తామని పేర్కొంది. పేదలకు వివిధ పథకాలు అందకుండా చేయడానికి తాము ఆధార్‌ను ఉపయోగించబోమని తీర్మానంలో కాంగ్రెస్ స్పష్టం చేసింది. జాతీయ సామాజిక ఆసరా పథకం(ఎన్ఎస్ఏపీ), ఇతర పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు మరింత ప్రయోజనం కలిగించేందుకే ఆధార్‌ను వాడుకుంటామని తెలిపింది. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రస్తుతం ఉన్న విధానాలను పునస్సమీక్షిస్తామని పేర్కొంది. మద్దతు ధరను మరిన్ని పంటలకు విస్తరిస్తామని వెల్లడించింది.



కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీకి హాజరైన ప్రతినిధులు



మోదీ నియంత

కాంగ్రెస్ ప్లీనరీలో విరుచుకుపడిన సోనియా

న్యూఢిల్లీ, మార్చి 17: "అధికార పార్టీ జులుం నుంచి దేశానికి విముక్తి కల్పించాలి. అహంకారం, పక్షపాతం, ప్రతీకార రాజకీయాల నుంచి దేశానికి విముక్తి కల్పించాలి. ఇందుకు మనమంతా పోరాటం చేయాలి. ప్రస్తుత ప్రభుత్వం విసురుతున్న సవాళ్లపై దీటుగా పోరాడాలి. ఇందుకు పార్టీని బలోపేతం చేయాలి" అంటూ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పిలుపునిచ్చారు. మళ్లీ ప్రజా విశ్వాసాన్ని చూరగొనడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, బీజేపీని గద్దె దించేందుకు భావ సారూప్య పార్టీలతో కలిసి పని చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీలో శనివారం ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ ప్రభుత్వాన్ని ఆమె 'నియంతృత్వం'గా.. మోదీని నియంతగా అభివర్ణించారు. నిరంకుశ మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని చెప్పారు. 40 ఏళ్ల కిందట, ఎమర్జెన్సీ తర్వాత చిక్‌మగళూరు ఎన్నికల్లో ఇందిరా గాంధీ గెలిచారని, ఆ తర్వాత కాంగ్రెస్ బలమైన పార్టీగా ఎదిగిందని, అలాగే, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ అలాగే ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కష్ట కాలంలో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీకి అన్ని విధాలుగా అండదండలు అందించాలని కార్యకర్తలను కోరారు. సోనియా ఇంకా ఏమన్నారంటే..

- కాంగ్రెస్ పార్టీని నాశనం చేయడానికి ఈ అహంకారపూరిత ప్రభుత్వం గత నాలుగేళ్లుగా చేయని ప్రయత్నం లేదు. అయినా, కాంగ్రెస్ పార్టీ భయపడే ప్రసక్తే లేదు. ఈ ప్రభుత్వ అధికార మదానికి కాంగ్రెస్ తలవంచే ప్రసక్తే లేదు.
- నేను తినను.. ఎవరినీ తిననివ్వను అని అన్నారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటూ నినాదాలు ఇచ్చారు. అవినీతిపై పోరాడతానని ఎన్నికల ముందు చెప్పారు. కానీ, అది కేవలం నటన మాత్రమే. అధికారం కోసం చేసిన గిమ్మిక్కు.
- 2014 ఎన్నికల ముందు బీజేపీ చేసినవన్నీ ఉత్తుత్తి హామీలేనని ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు.
- దేశానికి కాంగ్రెస్ నుంచి విముక్తి కల్పించాలని కొందరు భావిస్తున్నారు. ఉనికి లేకుండా చేయాలనుకుంటున్నారు. వాళ్లకు తెలియదు ప్రజలు పార్టీని ఎంతగా ప్రేమిస్తున్నారో!
- అన్యాయంపై కాంగ్రెస్ పోరాడుతోంది. కొత్త శకానికి ఇది నాంది.ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న సవాళ్లు సాధారణమైనవి కావు. అవినీతి, ప్రతీకార రాజకీయాల నుంచి భారత్‌కు విముక్తి కల్పించాల్సి ఉంది. రాహుల్ నాయకత్వంలో ఇందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తామని, దేశాన్ని, పార్టీని కొత్త ఎత్తులకు తీసుకెళతామని ప్రతినబూనాలి.
- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందింది. లక్షలాది నిరుపేదలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చే ఎన్నో విధానాలను మన ప్రభుత్వం అమలు చేసింది. కానీ, ఇప్పుడు మోదీ సర్కారు ఆ విధానాలను బలహీనపరుస్తోంది.
- యూపీఏ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, బలహీనపరచడం బాధ కలిగిస్తోంది.
- మోదీ ప్రభుత్వం చేసిన మోసాలు, కుంభకోణాలను కాంగ్రెస్ పార్టీ ఆధారాలతో సహా బయట పెడుతోంది.
- పార్లమెంటులో ప్రస్తుతం ప్రతిపక్షం గొంతు నొక్కేశారు. ఈ విషయాన్ని ప్రపంచానికి చూపాల్సిన మీడియా తన విధి నిర్వహణలో విఫలమైంది. ఇది కూడా ప్రజాస్వామ్య వైఫల్యమే.

ప్లీనరీకి విదేశీ పార్టీల నేతలు

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ప్లీనరీకి విదేశాల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులూ హాజరయ్యారు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్, ఆవామీ లీగ్ బంగ్లాదేశ్ పార్టీ, నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్, శ్రీలంకకు చెందిన యూనియన్ నేషనలిస్ట్ పార్టీ, పాలస్తీనా, చైనాకు చెందిన పలు పార్టీల నేతలు ప్లీనరీలో పాల్గొన్నారు. అలాగే, బంగ్లాదేశ్ ప్రధాని, నేపాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా అధినేత, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన లేబర్ పార్టీ నేత సందేశాలు పంపించారు.

శివశంకర్‌కు సంతాపం

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు చెందిన నాయకుడు దివంగత పి.శివశంకర్‌కు ఏఐసీసీ ప్లీనరీ సంతాపం తెలిపింది. కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ సంతాపం తీర్మానాన్ని చదివారు. గత ప్లీనరీ నుంచి ఈ ప్లీనరీ మధ్య మరణించిన ఏఐసీసీ ప్రతినిధులు, ముఖ్యనేతలకు సంతాపం తెలపగా, తెలుగు రాష్ట్రాల నుంచి శివశంకర్ ఉన్నారు. వారికి ప్లీనరీలో ఉన్న నేతలు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. మొదట సంతాప తీర్మానాలు చదివినప్పుడు దివంగత ముఖ్యనేతలు మురళీ దేవర, ధరమ్ సింగ్, ప్రియరంజన్ దాస్ మున్షీ పేర్లను మరచిపోయారు. వీరి పేర్లను ప్లీనరీ మధ్యలో చదివి సంతాపం తెలిపారు.

కాంగ్రెస్ మాత్రమే కాంగ్రెస్‌ను ఓడించగలదు. ఈ విషయం గుర్తెరిగి నేతలు విభేదాలు విడనాడాలి.

\- మల్లికార్జున ఖర్గే



హిందూయిజం హిందూత్వ వేర్వేరు. హిందూ స్పేస్‌ను బీజేపీకి వదిలే యొద్దు.

\- శశిథరూర్



జనం విసిగిపోయారు

- బయటపడే మార్గం వెతుకుతున్నారు: రాహుల్



న్యూఢిల్లీ, మార్చి 17: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో కోపాన్ని, ద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ప్రేమ, సౌహార్ద్ర వాతావరణంలో దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలిగే శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని చెప్పారు. శనివారం పార్టీ ప్లీనరీలో ఆయన ప్రసంగించారు. హస్తం గుర్తు మాత్రమే దేశ ప్రజలను ఏకం చేయగలదన్నారు. తాము ప్రేమను, సౌభ్రాతృత్వాన్ని వ్యాపింపజేస్తామని ప్రకటించారు. వారసత్వాన్ని మరచిపోకుండా మార్పును ఆహ్వానించడమే కాంగ్రెస్ సంప్రదాయమన్నారు. సీనియర్లను, యువతను కలుపుకొని ముందుకు వెళతామని ప్రకటించారు. యువత పార్టీని ముందుకు తీసుకెళ్తే.. సీనియర్లు అనుభవ సాయం అందిస్తారన్నారు. కోట్ల మంది యువత మోదీ పట్ల ఎన్నో ఆశలు పెంచుకుంటే అవి కల్లలయ్యాయన్నారు. ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయో అర్థం కాని పరిస్థితుల్లో నిరుద్యోగులు, తమకు గిట్టుబాటు ధర ఎప్పుడొస్తుందోనని ఎదురుచూసే రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు.

చిదంబరానికి కృతజ్ఞతలు

సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, అమరీందర్ సింగ్, చిదంబరం సహా సమావేశానికి వచ్చిన నేతలను రాహుల్ కొనియాడారు. అవినీతి కేసుల్లో సీబీఐ దర్యాప్తును ఎదుర్కొంటున్న చిదంబరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. కృతజ్ఞతలు చెప్పడం ద్వారా రాహుల్ నైతిక మద్దతు ప్రకటించారు.

2019లో రాహులే ప్రధాని

ఆయన్ను ఎవరూ ఆపలేరు: సిద్ధరామయ్య

న్యూఢిల్లీ, మార్చి 17: కర్ణాటకలో కాంగ్రెస్ విజయభేరి మోగించడం ఖాయమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను లౌకికవాదం, మతతత్వం మధ్య జరిగే పోరుగా అభివర్ణించారు. "2019 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం. రాహుల్ గాంధీ దేశ ప్రధాని కాకుండా ఎవరూ ఆపలేరు" అని ప్లీనరీలో ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కర్ణాటకలో తాము మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పారు. ఆ గెలుపు రాబోయే సాధారణ ఎన్నికలకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.



హోదా ఇవ్వాల్సిందే!

- మిగిలిన హామీలూ అమలు చేయాలి
- వాటిని విస్మరించడం ఆందోళనకరం
- కాంగ్రెస్ తీర్మానంలో ప్రత్యేక ప్రస్తావన
- ప్రవేశపెట్టిన మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విభజన సమయంలో ప్రధాని హోదాలో మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కేంద్రాన్ని కోరింది. శనివారం ఢిల్లీలో మొదలైన 84వ ప్లీనరీ సమావేశంలో ప్రవేశపెట్టిన రాజకీయ తీర్మానంలో ఏపీకి ఇచ్చిన హామీల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఈ తీర్మానాన్ని లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రవేశపెట్టారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పార్టీల ఏకాభిప్రాయంతోనే రాష్ట్ర విభజన చేపట్టాం. 2014 ఫిబ్రవరి 20వ తేదీన సీమాంధ్రకు ప్రత్యేక హోదాతోపాటు పలు హామీలను నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంటులో ప్రకటించారు. ఈ హామీలతో పాటు రాష్ట్ర విభజన చట్టంలో ఏపీకి సంబంధించిన పలు అంశాలను విస్మరించడంపై ఆందోళన చెందుతున్నాం. ఆ హామీలను నెరవేర్చాల్సిందే" అని ఆ తీర్మానంలో డిమాండ్ చేశారు.

మైత్రితో ఇబ్బంది ఎందుకు?

ఏపీకి తాము అండగా ఉంటున్నప్పటికీ లోక్‌సభలో తనను అడ్డుకుంటున్నారని మల్లికార్జున ఖర్గే ఆక్రోశించారు. "రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై నేను మాట్లాడే సమయంలో ఏపీ ఎంపీలు నా ముందు అడ్డంగా నిలబడ్డారు. ఎంత శత్రువులమైనా కావొచ్చు. కానీ... ఒక అంశంపై మిత్రులమైన తర్వాత సిగ్గుపడాల్సిన అవసరం లేదు" అని టీడీపీ, వైసీపీలకు సభలోనే హితవు పలికానన్నారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఆ రెండు పార్టీలు అడిగినప్పుడు ఇవే వ్యాఖ్యలు గుర్తొచ్చాయని ఖర్గే తెలిపారు. "ఒకదగ్గర కాకపోతే మరో దగ్గర ఏదో అంశంపై మనం కలుస్తాం' అని వ్యాఖ్యానించారు. ఎలాంటి అభిప్రాయాలున్నప్పటికీ... అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాల్సిందేనని రాహుల్‌గాంధీ ఆదేశించారని వెల్లడించారు.

రాహుల్‌కు ధన్యవాదాలు: రఘువీరా

రాజకీయ తీర్మానంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశాన్ని చేర్చినందుకు రాహుల్ గాంధీకి పీసీసీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ తీర్మానంపై వేదిక మీద రఘువీరా రెడ్డి మాట్లాడారు. ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను బీజేపీ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లీనరీలో ప్రత్యేక హోదా తీర్మానాన్ని పెట్టిన సందర్భంగా శనివారం రాత్రి ఏపీ కాంగ్రెస్ నేతలు ఏపీ భవన్‌లో సంబరాలు నిర్వహించారు.

రాహుల్ మార్గదర్శకత్వం: కేవీపీ

రాహుల్ గాంధీ నాయకత్వం కాంగ్రెస్ పార్టీకే కాకుండా భారత దేశానికే మార్గదర్శకత్వం కానుందని ఎంపీ కేవీపీ రామచంద్ర రావు అన్నారు. రాజీవ్ గాంధీ త్యాగం చేశారని అన్నారు. ఇక... గతంలో సమాజం మోదీని ఎలా కోరుకుందో ఇప్పుడు రాహుల్ గాంధీని కోరుకుంటోందని మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు అన్నారు. రాహుల్‌కు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశాల్లో రాజకీయ, ఆర్థిక, అంతర్జాతీయ విధానం, వ్యవసాయ తీర్మానాలను ఆమోదించబోతున్నామని కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు తెలిపారు. ఏపీ నుంచి వంద మంది ఏఐసీసీ ప్రతినిధులు ఉండగా... 60 నుంచి 70 మంది మాత్రమే హాజరయ్యారు.



దక్షిణాది రాష్ట్రాలతో 'ద్రవిడనాడు'

డిమాండ్ వస్తే మద్దతిస్తాం: డీఎంకే

దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసివస్తాయా?

ఈరోడ్, చెన్నై, మార్చి 17: ఢిల్లీ రాజకీయాలు అనూహ్యమైన డిమాండ్లను తెరపైకి తీసుకొస్తున్నాయి. ఐదు దక్షిణాది రాష్ట్రాలు- తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు పాండిచ్చేరిని కూడా కలిపి- ఒక ప్రత్యేక రాజ్యంగా గుర్తించాలని డీఎంకే డిమాండ్ చేసింది. కేంద్రం దక్షిణాది రాష్ట్రాల పట్ల పక్షపాత ధోరణి ప్రదర్శిస్తూ- నిధుల విడుదలలోనూ, ఇతర కీలక అంశాలలోనూ ఉత్తరాదికి ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో ద్రవిడనాడు పేరిట వేరుపడడమే ఉత్తమమని డీఎంకే భావిస్తోంది. అయితే ఇది భారత రాజ్యాంగానికి లోబడే ఉంటుందని అంటోంది. "ద్రవిడ నాడు డిమాండ్ వస్తే స్వాగతిస్తాం.. మొదట మేమే మద్దతిస్తాం" అని డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ శనివారంనాడు అన్నారు. 'ఈ డిమాండ్ కొత్తదేం కాదనీ, 1940ల్లో పెరియార్ రామస్వామి తెచ్చినదేనని, ఐదు దక్షిణాది రాష్ట్రాలతో పాటు పాండిచ్చేరిని కలిపి ప్రత్యేక రాజ్యంగా గుర్తించాలని ఆనాడు రామస్వామి కోరారని, దాన్ని డీఎంకే తన నియమావళిలో రూల్-2 కింద చేర్చిందని- ద్రవిడనాడు సాధించడం మౌలికంగా సాధ్యమేనని ద్రవిడ రాజకీయాల చరిత్రకారుడు కె. తిరునవుక్కరసు అన్నారు. అయితే ఇది రాజ్యాంగానికి లోబడే ఉండాలని ఆయన పేర్కొన్నారు. భారత్ చైనా యుద్ధం (1962) నేపథ్యంలో డీఎంకే ఈ డిమాండ్‌ను ఆనాడు పక్కనపెట్టింది. కేంద్రం దక్షిణాది రాష్ట్రాల పట్ల పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్న ప్రస్తుత దశలో కొందరు దక్షిణాది నేతలు ఇటీవలి కాలంలో ఈ డిమాండ్‌పై సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు- కేసీఆర్, చంద్రశేఖరరావు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మొదలైనవారు కేంద్రం తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాది అంటే అంత చిన్నచూపా అని పవన్ నిలదీశారు కూడా! కర్ణాటకలో సైతం కేంద్రంపై వ్యతిరేకత పెల్లుబికుతోంది. తమిళనాడు మొదట్నుంచీ కేంద్రానికి వ్యతిరేకంగా గళమెత్తుతూనే ఉంది. అయితే అన్ని దక్షిణాది రాష్ట్రాలూ కలిసి ఒకే గొడుగు కిందకి రావడం అసాధ్యమని ఎందుకంటే అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఈ రాష్ట్రాలు- ఒకదాని పెత్తనాన్ని మరొకటి అంగీకరించవని, ఎవరి ప్రాథామ్యాలు వారివని విశ్లేషకులంటున్నారు. ముఖ్యంగా నదీజలాల పంపకం విషయంలో ఈ రాష్ట్రాలు పరస్పరం కొట్టుకుంటున్నాయని, సరిహద్దులు, భాషా సమస్యలూ ఉన్నాయని వివరిస్తున్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.